PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 171 | విజయవాడ, గురువారం 23 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 23 January 2025 | Rs

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- యుజిసి ముసాయిదా నిబంధనలను కేంద్రం వెనక్కి తీసుకోవాలి
- కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

7



ఇంగ్లండ్‌పై వరుణాస్త్రం!

- అభిషేక్ శర్మ అర్ధసెంచరీ
- తొలి టి20లో ఏడు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు

8

ప్రభుత్వం ద్వారానే సమగ్రాభివృద్ధి

ప్రైవేటుతో అసాధ్యం • 'రంగుల కలగా విజన్ 2047' సదస్సులో వక్తలు

రాష్ట్రాభివృద్ధికి సిపిఎం రాష్ట్ర మహాసభలో ప్రత్యామ్నాయ ప్రణాళిక



సదస్సులో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, వేదికపై వడ్డే, లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటు రంగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు ఆచరణ సాధ్యం కాదని, ఇప్పటి వరకూ ప్రపంచంలో ఎక్కడా అలా జరగలేదని 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' పై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగిన సదస్సులో వక్తలు స్పష్టం చేశారు. సిపిఎం 27వ రాష్ట్ర మహా సభను పురస్కరించుకొని పార్టీ ఈ సదస్సును నిర్వహించింది. ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందుకు జవాబుదారీ తనం, స్పష్టమైన ప్రణాళికలు, నిర్దిష్టమైన కార్యాచరణ అవసరమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... మన దేశానికి చెందిన పెట్టుబడిదారులతో సిఎం చంద్రబాబు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే సంతోషమేనని, గతంలో ఎన్నో సార్లు చేసుకున్న ఇటువంటి ఒప్పందాలు ఫలప్రదమైన సందర్భాలు చాలా తక్కువని గుర్తు చేశారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచకుండా ఎన్ని కొత్త పరిశ్రమలు వచ్చినా ఏ ప్రయోజనం ఉండదన్నారు. ఈ అంశం విజన్ 2047లో చోటు చేసుకోలేదన్నారు. ప్రణాళిక రూపొందిస్తే వాస్తవికంగా ఉండాలన్నారు. ఇందులో అనుసరించిన 'వాటర్ ఫాల్' విధానం సరైంది కాదని, ఇందుకు ప్రత్యామ్నాయంగా ఎజైల్ విధానం అనుసరణీయమన్నారు. 2029 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను విస్మరించి 2047 రంగుల కలను సృష్టించడం ప్రజలను మభ్యపెట్టడమేనని తెలిపారు. వందల కోట్ల స్థాయిలో ఖర్చు చేసి అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు కేటాయిస్తే రాయలసీమకు సాగునీరొస్తుందని, ఈ విషయాన్ని విస్మరించి గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు వేల కోట్లతో చేపడతామనడం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీకి 150 ఎకరాలు ఇచ్చినా ఇంతవరకూ పునాది వేయలేదన్నారు. కాకినాడ సెజ్‌లో 10 వేల ఎకరాల్లో బొమ్మల పరిశ్రమ ఒక్కటితప్ప పరిశ్రమలే లేవన్నారు. 18 వేల ఎకరాల్లో ఉన్న వాన్ పిక్ సెజ్‌లో, హిందుపూర్‌లో నాలెడ్జ్ హబ్‌లో ఒక్క పరిశ్రమ లేదన్నారు. కేటాయించిన భూములను ఆయా సంస్థలు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది, ఎగనామం పెడుతున్నారని చెప్పారు. ప్రజల సంపద పెరగాలంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, విద్యా, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. కార్పొరేట్ శక్తులకు లేబర్‌ను చౌకగా అందించేందుకు సిఎం చంద్రబాబు పిల్లలని కనాలని కోరుతున్నట్లు చెప్పారు. కౌలు దారులకు ప్రభుత్వ భూములు 2 ఎకరాలిస్తే వారికి ఏడాదికి రూ.80 వేల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. స్పెక్యులేషన్‌కు తోడ్పడే నిర్ణయాలు తప్ప వాస్తవికంగా, ప్రజలకు ప్రయోజకరమైన నిర్ణయాలను పాలకులు విస్మరిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మిగతా 7లో



- విశాఖలో డిజైన్ కేంద్రం ఏర్పాటుపై సిఇఒకు విజ్ఞప్తి
- ఐటి అభివృద్ధిలో సహకారంపై బిల్‌గేట్స్‌తో చర్చలు
- పెట్టుబడిదారులకు సిఎం చంద్రబాబు ఆహ్వానం
- దావోస్‌లో మూడో రోజు ఎనిమిది కంపెనీలతో చర్చలు

గూగుల్ క్లౌడ్ విస్తరణకు ఎపి అనుకూలం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గూగుల్ క్లౌడ్ తన సర్వర్ సప్లయి ఛైన్ అనుసంధానించేలా తయారీ యూనిట్‌ను ఎపిలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో భాగంగా అక్కడ పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడోరోజున పలు సంస్థలతో చర్చలు జరిపారు. ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ కూడా వేర్వేరుగా ఆరు సంస్థలతో విస్తృతంగా చర్చలు జరపడంతోపాటు సెమినార్లు, సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించారు. మూడోరోజు గూగుల్ క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్‌తో చంద్రబాబు చర్చలు జరిపారు. సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్న గూగుల్ విశాఖపట్నంలో డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

సర్వర్ల నిర్వహణ విషయంలో ఎపిని ప్రధాన కేంద్రంగా చేసుకోవాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని వివరించారు. ఇటీవల గూగుల్ విశాఖలో తమ డేటా సిటీని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న సంగతి తెలి సిందే. ఇప్పటికే ఢిల్లీ, ముంబయిలో క్లౌడ్ రీజియన్లు ఉన్నాయి. అనంతరం పెట్రోనాస్ ప్రెసిడెంట్, గ్రూప్ సిఇఒ మహ్మద్ తౌఫిక్‌తోనూ మిగతా 7లో

ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

2

'ఫుడ్' ఎవరికి?

- ప్రాసెసింగ్ పరిశ్రమ మొగ్గ ఎటు?
- రైతులు, మహిళల విస్మరణ

2

హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు

- రాష్ట్రపతి ఆమోదముద్ర



హరిహరనాథ శర్మ | యడవల్లి లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరిని నియమిస్తూ రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ బుధవారం వెలువడింది. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించేందుకు ఇద్దరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం గతంలో కేంద్రానికి సిఫార్సు చేసింది. కేంద్రం కూడా ఆమోదం చెప్పి రాష్ట్రపతికి నివేదించింది. రాష్ట్రపతి ఆమోదముద్రతో బుధవారం కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ వెలువరించింది. ఎపి జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న న్యాయాధికారి అవధానం హరిహరనాథ శర్మ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జి)గా ఉన్న న్యాయాధికారి యడవల్లి లక్ష్మణరావు హైకోర్టు న్యాయ మూర్తులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. వీరిరువురి నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కు చేరుతుంది. మరో ఏడు జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ నేతృత్వంలోని కొలీజియం వీరిరువురి పేర్లతోపాటు శ్రీకాకుళం జిల్లా జడ్జిగా చేస్తున్న జునైద్ అహ్మద్ మౌలానా పేరును గతంలో సుప్రీంకోర్టుకు సిఫార్సు చేశారు. జునైద్ విషయంలో సుప్రీం కొలీజియం ఏ నిర్ణయం తీసుకున్నదీ వెల్లడికాలేదు.

కర్నూలుకు చెందిన అవధానం

సుబ్బమ్మ, రామచంద్రయ్య దంపతులకు అవధానం హరిహరనాథ శర్మ 1968 ఏప్రిల్ 16న పుట్టారు. స్వస్థలం కర్నూలు. తండ్రి మిగతా 7లో

జన్మతః పౌరసత్వం రద్దు

- ట్రంప్ డిక్రీ జారీ
- ఇదో రాజకీయ జిమ్మిక్కు అన్న నిపుణులు
- ఉత్తర్వు చెల్లుబాటును సవాల్ చేసిన 22 రాష్ట్రాలు



వాషింగ్టన్: పత్రాలు లేని వలసదారులు, తాత్కాలిక వీసాహోల్డర్లకు జన్మించిన పిల్లలకు పౌరసత్వాన్ని రద్దు చేస్తూ డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే ఈ చర్య తీసుకున్నారు. జన్మత్ణ పౌరసత్వం కల్పించేందుకు సంబంధించి నూట ఏభై ఏళ్ల క్రితం తీసుకొచ్చిన పద్నాలుగో సవరణకు భిన్నంగా ఉన్న ట్రంప్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఇప్పటికే 22 రాష్ట్రాలు కోర్టుల్లో దావా వేశాయి. తక్షణమే ఈ చర్యను రద్దు చేయాలని అవి డిమాండ్ చేశాయి. 2025 ఫిబ్రవరి 19 తర్వాత జన్మించిన పిల్లల పౌరసత్వాన్ని నిలిపివేయాలని ఫెడరల్ ఏజెన్సీలను ట్రంప్ ఆదేశించారు. దీని వల్ల ఏటా దేశ వ్యాపితంగా 1,53,000 మంది, ఒక్క కాలిఫోర్నియాలోనే 24 వేల మంది దాకా పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరం గా మారనుంది. .పత్రాలు లేని, తాత్కాలిక వీసాపై ఉన్న కుటుంబాలకు చెందిన వేలాది మంది పిల్లల జన్మహక్కును ఇది తొలగిస్తుంది. ట్రంప్ ఎన్నికల వాగ్దానాల తర్వాత గ్రీన్ కార్డు సంస్కరణల కోసం ఎదురు చూస్తున్న భారతీయ అమెరికన్లను ఇది శరాఘాతమే. 1868లో ఆమోదించబడిన 14వ సవరణ" అమెరికాలో జన్మించిన లేదా సహజ సిద్ధమైన వ్యక్తులందరూ దాని అధికార పరిధికి లోబడి అమెరికా పౌరులు అవుతారు" అని స్పష్టంగా పేర్కొంది. మాజీ బానిసలకు పౌరసత్వం , చట్ట ప్రకారం సమాన రక్షణ కల్పించేలా ఈ నిబంధన రూపొందించబడింది. ట్రంప్ చర్య ఇప్పటికే అమలులో ఉన్న సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించేదిగా ఉంది. ట్రంప్ చర్యపై ఇండియన్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు ఆర్.ఖన్నా స్పందిస్తూ, దీని వల్ల అక్రమ వలసదారులే కాకుండా హెచ్-1బి వీసా వంటి చట్టబద్ధమైన పత్రాలతో వచ్చి ఇక్కడ వుంటున్న వారు కూడా తీవ్ర ఇబ్బందుల పాలవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టూడెంట్ వీసా, హెచ్1బి లేదా హెచ్2బి వీసా లేదా బిజినెస్ వీసాలపై వచ్చి తాత్కాలికంగా మిగతా 7లో

గిరిజన గ్రామాలు గాయబ్

- హైకోర్టు విస్మయం
- 792 గ్రామాల నుంచి 292 గ్రామాలకు కుదింపు
- ఆ గ్రామాలన్నీ ఎక్కడికిపోయాయని కేంద్రాన్ని నిలదీసిన ధర్మాసనం

ప్రజాశక్తి-అమరావతి

గిరిజనేతరులకు లబ్ధి చేకూర్చే కుట్రలో భాగంగా ఎప్పటికప్పుడు గిరిజన (షెడ్యూలు 5) ప్రాంతాల విస్తీర్ణాన్ని అధికారులు తగ్గించేస్తున్నారంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఒకవేళ కౌంటర్ పిటిషన్‌ను దాఖలు చేయనిపక్షంలో కేంద్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్డ్ ఏరియాలోని గ్రామాలకు గ్రామాల పరిధులను అధికారులు కుదించడానికి కారణాలు చెప్పాలని ఆదేశించింది. గిరిజనేతరలకు మేలు జరిగేలా గిరిజన గ్రామాల సంఖ్య అనూహ్యంగా తగ్గిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై పూర్తి వివరాలు సమర్పించాలని, సమగ్ర విచారణ జరుపుతామని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. గిరిజన గ్రామాల పరిధులను అధికారులు కుదించేశారంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని కేంద్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిని ఆదేశించింది. గిరిజన ప్రాంతాల పరిధిని, విస్తీర్ణాన్ని ఎందుకు కుదించేస్తున్నారో, అసలు ఏ అధికారంతో గిరిజన గ్రామాల పరిధిని కుదిస్తున్నారో చెప్పాలని ఆదేశించింది. గతంలో 792 గిరిజన గ్రామాలు ఉండగా, ఆ సంఖ్య అనూహ్యంగా 292 గ్రామాలకు ఎలా తగ్గిపోతుందని విస్మయాన్ని వ్యక్తం చేసింది. ఇప్పుడు 292 గ్రామాలు మాత్రమే ఉంటే మిగిలిన గిరిజన గ్రామాలు ఎక్కడ ఉన్నాయని కేంద్రాన్ని నిలదీసింది. గిరిజన గ్రామాలు ఎలా మాయం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. గిరిజన ప్రాంతాల పరిధులను ఎందుకు కుదించేస్తున్నారని నిప్పులు చెరిగింది. ఇంత జరుగుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిగ్గదీసింది. గిరిజనేతరుల కోసం గిరిజన ప్రాంతాల విస్తీర్ణాన్ని అధికారులు గణనీయంగా తగ్గించడాన్ని తీవ్రంగా తప్పుపడుతూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు టి.వెంకట శివరాం గతంలో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఎ శ్యామ్‌సుందర్‌రెడ్డి వాదిస్తూ, గిరిజనేతరులకు లబ్ధి చేకూర్చే కుట్రలో భాగంగానే గిరిజన గ్రామాల పరిధిని తగ్గించేస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ వ్యతిరేకంగా అధికారులు తీసుకున్న నిర్ణయాల వల్ల గిరిజనేతరులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు వీలుగా గిరిజన ప్రాంతాలను నిర్దిష్టంగా నోటిఫైకి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామాలను పట్టణాల్లో కలిపేస్తున్నారని తప్పుపట్టారు. గిరిజన ప్రాంతాలను ఆ విధంగా విలీనం చేయడానికి రాజ్యాంగం అనుమతించ్దన్నారు. కావాలని అధికారులు గిరిజన ప్రాంతాల విస్తీర్ణాన్ని, పరిధులను తగ్గిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన వివరాల మేరకు పూర్వం 792 గిరిజన గ్రామాలు ఉండగా, ఆ సంఖ్య అనూహ్యంగా తగ్గిపోయిందని, ఇప్పుడు అవి కేవలం 292 గ్రామాలే ఉన్నాయని చెప్పారు. గిరిజన గ్రామాల సంఖ్య దారుణంగా తగ్గిపోవడంపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసిన హైకోర్టు, ఈ వ్యవహారంపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది (డిప్యూటీ సొలిసిటర్ జనరల్) పసల పొన్నారావును ప్రశ్నించింది. వివరాలు ఇవ్వాలని అడిగితే రాష్ట్రం ఇవ్వడం లేదని పొన్నారావు చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, దీనిపై సమగ్ర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ కార్యదర్శిని ఆదేశించింది.



తిరుపతిలో తొక్కిసలాట (ఫైల్)

తిరుపతిలో తొక్కిసలాటపై న్యాయ విచారణ

- 6 నెలల్లోగా నివేదిక
- జిఓ 16 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 8న తిరుమల దర్శనం టిక్కెట్ల టోకెన్ల పంపిణీ సందర్భంగా తిరుపతి పద్మావతి పార్క్‌లో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో క్యూలైన్లలో వేచి ఉన్నవారిలో ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై న్యాయ విచారణ జరిపేందుకు ప్రభుత్వం బుధవారం జ్యుడీషియల్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు జిఓ ఎంఎస్ నెంబరు 16 విడుదల చేసింది. విచారణ కమిషన్‌కు పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తిని ప్రభుత్వం నియమించింది. నివేదికను ఆరు నెలల్లోపు ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేసింది.

ప్రయాణీకులపైకి దూసుకెళ్లిన రైలు

13 మంది మృతి • మహారాష్ట్రలో ఘోరం

మంటల గురించి వ్యాపించిన పుకార్లే కారణమా?



ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక కార్యక్రమాలు

జలగావ్: మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో బుధవారం సాయంత్రం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. మంటలు వ్యాపించాయన్న పుకార్లతో గబగబా రైలు దిగి పక్కనున్న ట్రాక్‌ను దాటుతుండగా ఎదురుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వారిపైకి దూసుకెళ్లడంతో ఘోరం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో 13 మంది మరణించగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సాయంత్రం 5:30 గంటల సమయంలో మహేజి, పర్ధడే స్టేషన్ల మధ్యలోని పచోరా సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నో-ముంబయి మధ్య నడిచే పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్‌లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగడంతో మంటలు వ్యాపించాయన్న భయంతో ప్రయాణికులు చైన్ లాగారని ఒక అధికారి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని పచోరాలోని ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు.

ఈ రైలు ప్రమాదంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.


మణిపూర్‌లో బిజెపికి జెడి(యు) షాక్

- మద్దతు ఉపసంహరణ
- నితీష్ రహస్య ఎత్తుగడలో భాగం

ఇంఫాల్ : మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వానికి నితీష్‌కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) షాకిచ్చింది. బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని మణిపూర్ జెడి(యు) అధ్యక్షులు క్షేత్రిమయున్ బిరేన్ సింగ్ అధికారికంగా ప్రకటించారు. రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు లేఖ ద్వారా ఈ విషయాన్ని తెలిపారు. 'మణిపూర్‌లో బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి జనతాదళ్ (యు) మణిపూర్ యూనిట్ మద్దతు ఇవ్వదు. మా ఏకైక ఎమ్మెల్యే ఎండి అబ్దుల్ నాసిర్‌ను సభలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పరిగణించాలని కోరుతున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఈ ఉపసంహరణతో బిజెపి ప్రభుత్వానికి తక్షణం వచ్చే ముప్పేమీ లేదు. 60 మంది ఎమ్మెల్యేలు ఉన్న మణిపూర్ అసెంబ్లీలో బిజెపికి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అలాగే నాగా పీపుల్స్ ఫ్రంట్ నుంచి ఐదుగురు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా బిజెపికి మద్దతుగా ఉన్నారు.

రక్తమోడిన రోడ్లు

- వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు విద్యార్థులు, భార్యాభర్తలు



హయవదన(ఫైల్) | సుజయీంద్ర (ఫైల్) | అభిషేక్ (ఫైల్)

ప్రజాశక్తి- యంత్రాంగం

రోడ్లు రక్తమోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. వారిలో ముగ్గురు విద్యార్థులు, భార్యాభర్తలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం హంపిలో కొలువైన శ్రీనరహరి తీర్థుల పూజ విషయంలో గత 26 సంవత్సరాలుగా మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి, ఉత్తరాధి మఠానికి వివాదం నడిచింది. మంత్రాలయం మఠానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో విజయోత్సవంతోపాటు తొలి ఆరాధనను ఘనంగా నిర్వహించేందుకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు శ్రీమఠం యాజమాన్యం తుపాను వాహనంలో పది మంది విద్యార్థులతో మంత్రాలయం నుంచి మంగళవారం రాత్రి బయల్దేరింది. కర్ణాటక రాష్ట్రంలోని సింధనూర్-పోతునాళ పట్టణాల మధ్య వారి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంత్రాలయంలోని శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు మంత్రాలయం కొప్పళ, గంగావతికి చెందిన సుజయీంద్ర (19), అభిలాష్ (21), హయవదన (22), వాహనం డ్రైవర్ శివ (22) మృతి చెందారు. వాహనం నుజ్జునుజ్జు అయింది.

విశాఖ జిల్లా గాజువాక నుంచి అగనంపూడి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు మన్మధరావు (41), అరుణకుమారి (34)లను భారీ ట్రాలర్ ఢీకొట్టింది. దీంతో, వీరిద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అగనంపూడికి చెందిన వీరు బ్యాంకు పని నిమిత్తం గాజువాక వెళ్లి తిరిగి వస్తుండగా జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. మన్మధరావు ఫార్మా సిటీలో ఉద్యోగం చేస్తున్నారు.

'ఫుడ్' ఎవరికి?

- ప్రాసెసింగ్ పరిశ్రమ మొగ్గు ఎటు?
- రైతులు, మహిళల విస్మరణ





జ్యోతిర్మయి

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా విడుదల చేసిన పాలసీల్లో 'ఫుడ్ ప్రాసెసింగ్' కూడా ఒకటి. ఈ పాలసీ వ్యవసాయం, పరిశ్రమల మధ్య కీలకమైన లింక్‌గా పనిచేస్తుందని చెబుతూనే రైతులను విస్మరించింది. పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు, మార్కెట్ సౌకర్యాలు, లాభాల గురించి పేజీలు, పేజీల్లో పేర్కొన్న ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పాలసీ ప్రారంభంలోనే 'పోస్టు హార్వెస్ట్ లాస్'ను ప్రస్తావించిన ప్రభుత్వం, దానికి పరిష్కారంగా పొలాల వద్దనే ప్రాసెసింగ్ యూనిట్లను,ఎక్స్‌పోర్టు హబ్‌లు, ఫుడ్‌పార్కులను ఏర్పాటుచేయడం గురించి మాట్లాడింది. అయితే, వీటి మొగ్గు 'వ్యాపారం' వైపే! ఇక వ్యవసాయరంగంతోపాటు, ఆహార రంగంలోనూ కీలకపాత్ర పోషిస్తున్న మహిళల గురించి ఈ పాలసీ ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. రు. 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు లక్ష్యంగా, 3 లక్షల ఉపాధి అవకాశాలు సృష్టించడమే ధ్యేయంగా పాలసీలో పేర్కొన్నారు.

మనది వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. సుదీర్ఘ తీరప్రాంతం గల ఇక్కడ కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో లక్షల ఎకరాల భూములు సాగు అవుతున్నాయి. వ్యవసాయంతో పాటు ఆక్వా, మత్స్య సంపదలో మనకు లోటు లేదు. 2022-23 ఏడాదిలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఒక్కటే 2.03 లక్షల కోట్ల రూపాయల స్థూల ఉత్పత్తి చేసింది. దేశ ఎగుమతుల్లో కీలక పంటల ఉత్పత్తిలో మన రాష్ట్రమే అగ్రస్థానం. మత్స్య ఎగుమతుల్లో 40 శాతం, పండ్ల ఉత్పత్తిలో 200.64 లక్షల మెట్రిక్ టన్నులతో మొదటిస్థానంలో ఉంది. ఏటా 77 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు ఉత్పత్తి చేస్తుంది. 6 ఆపరేషన్ పోర్టులు, 7 విమానాశ్రయాలు, అతిపెద్ద రోడ్డు, రైల్వే నెట్‌వర్క్ రాష్ట్ర నైసర్గిక స్వరూపం. దాదాపు 190 దేశాలకు, 2100 వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే రాష్ట్రం మనది.

పెద్దలకే లబ్ధి...!

విస్తృత వ్యవసాయ రంగ చరిత్ర ఉన్న ఇక్కడ చిన్న కమతాల రైతులే ఎక్కువ. వ్యవసాయ కార్మికులు, అనుబంధ రంగాల శ్రామికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలసీ విధివిధానాలను పరిశీలిస్తే వీరికన్నా కార్పొరేట్లే ఎక్కువగా లబ్ధి పొందే అవకాశం కల్పిస్తోంది. పాలసీలో పేర్కొన్న దాని ప్రకారం మెగా ఫుడ్ పార్కుకు కనీసం 100నుండి వెయ్యి ఎకరాల భూమి కావాలి. ఈ తరహా ఫుడ్ పార్కులు జిల్లాకి ఒకటో, రెండో ఏర్పాటవుతాయి. ఐదు నుండి 10 ఎకరాల్లో నానో ఫుడ్ పార్కుల ఏర్పాటుకు అవకాశం ఉంది. భూమిని ప్రైవేటు యజమానులే సమకూర్చుకోవాలని, ప్రభుత్వం అవసరమైన సహకారం ఇస్తుందని పాలసీలో పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఇది అసాధ్యమన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు, గ్రామకంఠం భూములను పెద్దలకు కట్టబెట్టే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇవీ అనుభవాలు !

దేశంలోనే మొట్టమొదటి మెగా ఫుడ్ పార్కుగా చిత్తూరు జిల్లాలో 'శ్రీని' నెలకొల్పబడిన విషయం తెలిసిందే. 1200 ఎకరాలతో 2012 నుండి ఇది పనిచేస్తోంది. ఆ తరువాత 2017లో హనుమాన్ జంక్షన్ సమీపంలో మల్లవల్లి మోడల్ ఇండ్రస్టీయల్ పార్క్‌లో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్ పార్క్ స్థాపించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో 57.95 ఎకరాల్లో ప్రారంభమైన 'సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్'(సిపియు) ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు. రైతుల నుండి భూములు గుంజుకోవడం గత పార్కుల పనితీరులో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మల్లవల్లి పార్కుని పరిశీలిస్తే అశోకా లేల్యాండ్‌కి అప్పగించిన 75 ఎకరాల్లో నిర్మాణాలు తలపెట్టి 1000 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఉద్యోగాల మాట అటుంచితే ఇప్పుడు అక్కడ అశోకా లేల్యాండ్ కంపెనీనే పలాయనం చిత్తగించింది. వాస్తవాలు ఇలా ఉంటే, తాజా పాలసీలో లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటున్నారు.

లక్ష్యం రైతు కాదు....!

రైతులకు గిట్టుబాటు ధరో, కనీస మద్దతు ధరో కల్పించడం ఫుడ్ ప్రాసెసింగ్ లక్ష్యంగా ఉండాలి.కానీ, ప్రభుత్వం విడుదల చేసిన పాలసీలో రైతుల ప్రస్తావన చాలా తక్కువ! ఆహారపంటలను విస్మరించడం ద్వారా భారీ సంఖ్యలో రైతులను ప్రభుత్వం పక్కనపెట్టింది. వాణిజ్య పంటలకు పెద్దపీట వేశారు. రైతులను ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని పాలసీలో పేర్కొన్నారు. ఈ ప్రకృతి వ్యవసాయ పాఠాలు రాష్ట్ర రైతులకు కొత్త కాదు. గతంలో పాలేకర్ విధానాల పేరిట వీటిని విస్తృతంగా ప్రచారం చేసి, వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, గుంటూరు, కృష్ణా, విజయనగరం, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అనేక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రొడక్షన్ క్లస్టర్లు, ఫుడ్‌పార్కులు ఉన్న సంగతి తెలిసిందే. అయినా, రైతుల పంటలకు మద్దతు ధర లభించడం లేదు. భవిష్యత్తులోనూ అదే పరిస్థితి కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఇక మహిళల గురించి. డ్వాక్రా, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులనపు ఈ రంగంలో ప్రోత్సహించడం గురించి ప్రస్తావన కూడా పాలసీలో లేదు.

రాజధానికి రూ.11 వేల కోట్లు

- రుణం ఇచ్చేందుకు అంగీకరించిన హడ్కో
- టిడ్కో ఇళ్లకు మరో రూ.4,400 కోట్లు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతికి రుణం ఇచ్చేందుకు హడ్కో ముందుకొచ్చింది రూ.11 వేల కోట్ల రుణానికి హడ్కో బోర్డు అంగీకరించింది. అలాగే టిడ్కో ఇళ్లకు మరో రూ.4,400 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ముంబయిలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో ఈ మేరకు అంగీకరించినట్లు సమాచారం ఇచ్చారని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. దీంతో రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల్లో 50 శాతం సమకూరినట్లయింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఉమ్మడిగా రూ.15 వేలకోట్ల రుణం మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రూ.10 వేల కోట్ల విలువైన టెండర్లు పిలిచారు. ఇప్పుడు అదనంగా మారో రూ.11 వేల కోట్లు రావడంతో రాజధానిలో ఇబ్బంది లేకుండా పనులు సాగుతాయని మంత్రి తెలిపారు. అలాగే నిధుల లేమితో టిడ్కో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిందని, వాటికి అవసరమైన నిధుల కోసమూ ప్రతిపాదనలు సమర్పించామని పేర్కొన్నారు. దీనికి స్పందించిన హడ్కో దానికి కూడా ప్రత్యేకంగా నిధులు ఇచ్చేందుకు ఆమోదం తెలిపిందని వివరించారు. ఈ నిధులతో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలతోపాటు అర్హులై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. రాజధాని అమరావతి పూర్తి చేయాలంటే కనీసం రూ.45 వేల కోట్లు అవసరం ఉంటుందని అంచనాలు వేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ రూ.26 వేల కోట్లు రుణం రూపంలో రాజధానికి రానున్నాయి. ఈ నిధులతో తొలిదశలో పరిపాలనా భవనాలు, దాని చుట్టుపక్కల పూలింగు లేఅవుట్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు, కరకట్ట విస్తరణ, గ్రీనరీ, రిజర్వాయర్లు, కాలువలు నిర్మించనున్నారు.

ప్రధాని ప్రకటన చేసే వరకూ పోరాటం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడంలేదని ప్రధాని మోడీ ప్రకటన చేసే వరకూ పోరాటం ఆగదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1441వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేష్ విభాగానికి చెందిన ఐఎన్‌టియుసి కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు, బిఎన్.రాజు, రమణమూర్తి, డివి.రమణారెడ్డి, కారు రమణ మాట్లాడుతూ.. 2021 జనవరి 27న కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ ప్రకటించిన నాటికి రూ.940 కోట్ల నికర లాభాల్లో ఉన్న ప్లాంట్‌ను కేంద్రం నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్రం విధ్వంసకర ఆంక్షలతో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం నుంచి 1.5 మిలియన్ టన్నులకు ఉత్పత్తి తగ్గిపోయిందని తెలిపారు. దీనివల్ల సుమారు రూ.11 వేల కోట్ల నష్టం వచ్చినట్లు పేర్కొన్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు సుమారు 750 మంది ఉద్యోగులు రాజీనామా చేశారని, కాంట్రాక్టు వ్యవధి పూర్తయిందని ఇప్పటికే వందలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను నిలిపివేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారులతోపాటు వారి అనుయాయులుగా వ్యవహరించి భారీ అవినీతికి పాల్పడిన పలువురు అధికారులపై సిబిఐ దర్యాప్తు చేసి కంపెనీ ఆస్తులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతమైన యాజమాన్యాన్ని నియమిస్తే పూర్తిస్థాయి ఉత్పత్తి, లాభాల బాటలో నడిపించవచ్చని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్మికులను ఆర్థికంగా నష్టపరిచి, ఆందోళనకు గురిచేసి విఆర్ఎస్ వైపు నెట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగింపు, పూర్వ వైభవం దిశగా ప్లాంట్‌ను నడిపిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, విధ్వంసాన్ని కొనసాగిస్తున్న తీరుకు పొంతనలేదన్నారు. కొందరు బిజెపి నేతలు ఉద్యమస్ఫూర్తిని, ఆంధ్రుల ఆకాంక్షను దెబ్బతీస్తూ మాట్లాడడం దుర్మార్గమన్నారు. కార్మిక సంఘాల నేతల పట్ల, పరిరక్షణ ఉద్యమం పట్ల అనుచితంగా మాట్లాడితే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, రాపాటి కోటేశ్వరరావు, సిహెచ్.సన్యాసిరావు, పోతయ్యరెడ్డి, నగేష్, జి.సత్యారావు, అప్పలరెడ్డి, జగదీష్ కుమార్, పోలీస్ నాయుడు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ ట్రిబ్యునల్‌లో 14 పోస్టులకు ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో 14 పోస్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి కన్నబాబు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ ఛైర్‌పర్సన్ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మంజూరైన 14 పోస్టుల్లో 13 కాంట్రాక్టు పద్ధతిలోనూ, ఒకటి అవుట్‌సోర్సింగ్ పద్ధతిలోనూ నియమించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్, కోర్టు ఆఫీసర్, ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, ఒక సీనియర్ అసిస్టెంట్, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ స్టెనో, రికార్డు అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ నియామకాలకు ఆమోదం తెలిపారు. 2017 రియల్ ఎస్టేట్ రూల్స్ ప్రకారం ఎపి రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

బిల్లలవలసలో మరొకరికి డయేరియా

- ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బొండపల్లి



బిల్లలవలసలో పైపులైన్లను సరిచేస్తున్న సిబ్బంది

విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలోని బిల్లలవలసలో ఇంకొకరు డయేరియా బారిన పడ్డారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు గ్రామంలో 16 మంది డయేరియాకు గురైన విషయం తెలిసిందే. వారిలో 13 మంది కోలుకొని ఇళ్లకు చేరగా, ముగ్గురు జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా గ్రామానికి చెందిన వృద్ధుడు మామిడి ఆదప్పడు డయేరియా బారిన పడ్డారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. మరోవైపు గ్రామంలో నెలకొన్న తీవ్ర అపరిశుభ్రం, పైపులైన్లు మురుగునీటి కాలువల్లో ఉండడం వల్లే డయేరియా సోకిందని 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రమాకుమారి, ఇఒపిఆర్‌డి ఎ రఘుపతిరావు, సర్పంచ్ ఎన్ ఏసురత్నం ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్లపైనా, కాలువల్లోను ఉన్న చెత్తను తొలగించారు. మురుగునీటి కాలువల్లో ఉన్న తాగునీటి పైపులైన్లను ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది సరి చేశారు. తాగునీటి పథకంలో నీటిని క్లోరినేషన్ చేశారు. మరోవైపు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో వైద్యాధికారి లెంక సత్యనారాయణ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వైద్య శిబిరం కొనసాగుతోంది.

సకాలంలో అర్జీలు పరిష్కరించాలి

- 2047 నాటికి 15 శాతం వృద్ధి రేటు
- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, ఆర్థికేతర ఫిర్యాదులు, అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల హెచ్‌ఒడిలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించే అవకాశం ఉందన్నారు. కులగణన, జిఎస్‌డి, సోషల్ ఆడిట్, ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులపై కార్యదర్శులు ద్వారా కలెక్టర్లకు పూర్తి అవగాహన కలిగించడంపై సచివాలయంలో సంబంధిత శాఖల కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రజల అర్జీలు, ఫిర్యాదులను నిర్దిష్ట వ్యవధిలోగా హేతుబద్ధంగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ప్రతి శాఖ తరపున ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 నాటికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ శాఖలు మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. శాఖల వారీ ప్రణాళికలు, సెక్టార్ల వారీ, జిల్లాల వారీ డేటాను సిద్ధం చేశామని, దానిని కార్యదర్శులు, కలెక్టర్లకు పంపుతామన్నారు. ఎస్‌సి కేటగిరైజేషన్‌పై ఏకసభ్య కమిషన్‌కు ఈ నెల 27లోగా వివరాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సిసిఎల్ఎ జి జయలక్ష్మి, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఎం ఎయుడి ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, కార్యదర్శులు కన్నబాబు, ఎంఎం నాయక్, సిడిఎంఎ హరినారాయణ, ఆర్‌టిజిఎస్ సిఇఒ దినేష్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి పాల్గొన్నారు.

విద్యార్థుల మృతి పట్ల గవర్నర్, మంత్రి ఆనం సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్ణాటకలో జరిగిన దారుణ రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు వేద విద్యార్థులతోపాటు, డ్రైవరు మృతిచెందిన ఘటన తమకు తీవ్ర ఆవేదన కలిగించిందని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల గోగర్భం ఏరియాలో విశాఖ శారదాపీఠం నిర్మాణాలు చట్ట విరుద్ధంగా ఉంటే వాటిని కూల్చివేతకు ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు చెప్పింది. అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేయడాన్ని తప్పుపట్టింది. ఇలాంటి నిర్మాణాల విషయంలో ఉపేక్షించరాదని అభిప్రాయపడింది. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవంది. నిర్మాణాలపై కౌంటర్ దాఖలు చేయాలని శారదా పీఠాన్ని ఆదేశిస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమలలో శారదాపీఠం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేశారంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్ పిల్ దాఖలు చేశారు. పీఠం తరపు న్యాయవాది జోస్యుల భాస్కరరావు వాదిస్తూ, కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరారు. దీనిపై పిటిషనర్ న్యాయవాది కల్పించుకుని శారదా పీఠం నిర్మిస్తున్న భవనాన్ని సీజ్ చేస్తూ టిటిడి పాలక మండలి తీర్మానం చేసిందన్నారు. ఎలాంటి నిర్మాణాలు చేయరాదన్న గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

పంచాయతీల పునర్ వ్యవస్థీకరణకు కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలను పునర్ వ్యవస్థీకరించేందుకు నలుగురు అధికారులతో కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషన్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా పంచాయతీరాజ్‌శాఖ అదనపు కమిషనర్ డి సత్యనారాయణ, కన్వీనర్‌గా డిప్యూటీ కమిషనర్ వి నాగార్జునసాగర్, సభ్యులుగా ఒఎస్‌డి కె ఆనంద్, సహాయ కమిషనర్ కె శ్రీదేవిని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ గ్రామ పంచాయతీలను క్లస్టర్ విధానాన్ని పునర్ వ్యవస్థీకరించడంతోపాటు కేటగిరిలకు తగినట్లుగా సిబ్బందిని కేటాయించేందుకు తగిన సూచనలు అందించనుంది.

షెడ్యూల్డ్ ఏరియాలో స్థానిక ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

షెడ్యూల్డ్ ఏరియాలో స్థానిక ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఒ నెంబరు 3ను వెంటనే అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన గిరిజన నాయకులు కె చిన్నంనాయుడు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో షెడ్యూల్డ్ ప్రాంతంలో స్థానిక ఆదివాసులకే ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రాబోయే రోజుల్లో ఆదివాసులు చేసే పోరాటానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతిచ్చి, అండగా నిలబడాలని ఆదివాసీ గిరిజన సంఘం ప్రజలకు విజ్ఞప్తి చేస్తోందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో జిఒ 3 చట్టంతో 19 డిపార్టుమెంట్లలో 34 రకాల ఉద్యోగ నియామకాలు స్థానిక ఆదివాసులకు హక్కుగా ఉండేదని, జిఒ నెంబరు 3ను సుప్రీంకోర్టు 2020 మార్చిలో రద్దు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జిఒ 3ను రద్దు చేయడంపై ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 17 రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ కూడా రివ్యూ పిటషన్ దాఖలు చేసిందని తెలిపారు. గత వైసిపి, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సరైన వాదన చేయకపోవడంతో రివ్యూ పిటిషన్లను ఇటీవల రద్దు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో న్యాయం జరగాలంటే ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

ఆదివాసీ అఖిల భారత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దినారి ప్రభాకర్ మాట్లాడుతూ.. కెజిబివి ఏకలవ్య మోడల్ స్కూల్స్‌తోపాటు గత ప్రభుత్వాల కాలంలో 1998, 2008లో సుమారు 400, డిఎస్‌సి-2000 ద్వారా 280 ఎస్‌జిటి పోస్టులను పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైమ్ స్కేల్ ప్రాతిపదికన స్థానికేతరులతో గత ప్రభుత్వం భర్తీ చేయడంతో ఆదివాసులు ఉద్యోగం పొందుతామనే ఆశ, నమ్మకం కోల్పోయి తీరని ఆవేదనలో ఉన్నారన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకులు అప్పల నరసయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత ఆదివాసులకు ఉద్యోగ రిజర్వేషన్లు, గత ప్రభుత్వం 5వ షెడ్యూల్డ్ క్లాజ్(2) ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టిఎసి) చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ప్రత్యేక భాష, సంస్కృతి ఉన్నాయని, గిరిజన భాష రాని ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించడంతో ఆర్టికల్ 29, 32 ఉల్లంఘించినట్లవుతుందన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకులు అమలశ్రీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివనాగరత్నం, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి బాల్దేవ్, ఎన్ దర్శన్నపడల్, టి చిట్టిబాబు, కె బొంజుబాబు, భాష వలంటీర్స్ నాయకులు కె చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి కొల్లు

ప్రజాశక్తి -చోడవరం (అనకాపల్లి జిల్లా)

గోవాడ సుగర్స్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. ఫ్యాక్టరీ సమస్యలను ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు, ఎండి సన్యాసినాయుడును అడిగి తెలుసుకున్నారు. కార్మిక నాయకులు భాస్కరరావు, రాయి సూరిబాబులు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు రూ.మూడు కోట్లు, కార్మికులకు రూ.ఆరు కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఫ్యాక్టరీ మనుగడకు ఇథనాల్ ప్లాంట్ లేదా డిస్టిలరీ ఏర్పాటు చేస్తేనే భవిష్యత్తు బాగుంటుందని, దీనిపై పూర్తి నివేదిక తయారుచేయాలని ఎండిని మంత్రి ఆదేశించారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని ముఖ్యమంత్రి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందని, సుమారు రూ.పది లక్షల కోట్లు అప్పుచేశారని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. ఇటీవల ప్రధాని రూ. రెండు లక్షల కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తే శ్రీకాకుళం జిల్లా వరకు సాగు నీరు అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపి సహకారంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నిధులు విడుదల చేయడం హర్షణీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల దీర్ఘకాలిక పోరాటం వల్లే నిధులు మంజూరయ్యాయని, కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలిచిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. గంధవరంలో రూ.4.70 కోట్లతో నిర్మిస్తున్న విత్తన శుద్ధి కేంద్రాన్ని, చోడవరంలో అసంపూర్తిగా ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని, రైతు బజార్ భవనాలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్‌డిఒ ఆయూషా, తహశీల్దార్ ఎ.రామారావు, ఎంపిడిఒ ఆంజనేయులు, మల్లు నాయుడు, పూతి కోటేశ్వరరావు, గేదెల సత్యనారాయణ, మత్స్య రాజు, పల్లా అర్జున్, యేడువాక లక్ష్మణకుమార్, గోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి టిడిపి కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ బిటి నాయుడుతో కలిసి అర్జీలు స్వీకరించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌కు సన్నిహితుడైన మొర్ల మహీధర్ ఉద్యోగం ఇపిస్తానని చెప్పి రూ.16 లక్షలు తీసుకొని మోసం చేశారని ఉప్పాల అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో అతనిపై పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదని తెలిపారు.

అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - పాములపాడు (నంద్యాల జిల్లా)



సుందర్ రాజు



డి.సురేష్

అప్పులబాధతో ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో ఒకరు... పల్నాడు జిల్లాలో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా పాములపాడు మండలం భానుముక్కుల గ్రామానికి చెందిన సుందర్ రాజు (28) నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నారు. గత రెండేళ్లుగా మొక్కజొన్న సాగు చేసి నష్టపోయారు. పంట సాగు, కౌలు చెల్లించడం కోసం సుమారు రూ.4 లక్షల వరకు అప్పు చేశారు. వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పు తీర్చడం కష్టమైంది. దీంతో, మానసిక ఒత్తిడికి గురై కొత్తపల్లి రోడ్డులో ఉన్న పాల కేంద్రం సమీపంలో సోమవారం పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుందర్‌రాజు బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య సుధారాణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సుధారాణి ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతటి బాధలోనూ ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచనతో రెడ్‌క్రాస్ సొసైటీకి సుందర రాజు రెండు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి మానవత్వం చాటుకున్నారు, ఇతరులకు చూపునందించాలని కళ్లను దానం చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ సొసైటీ వారు అభినందించారు.

పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన డి.సురేష్ (37) తనకున్న ఎకరం పొలంతోపాటు మరో ఎనిమిది ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. ఏడాది కిందట ట్రాక్టర్ కొన్నాడు. ఏటికేడు నష్టాలు వస్తుండడంతో అప్పులపాలయ్యారు. దీంతో తనకున్న ఎకరం పొలం అమ్మి కొంత అప్పు తీర్చారు. అయినా అప్పుల నుండి బయటపడలేకపోయారు. సుమారు రూ.20 లక్షల వరకూ అప్పులు ఉండడంతో వాటిని తీర్చలేక తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుండి వెళ్లిన సురేష్ తాను సాగు చేస్తున్న పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారంనాడు స్థానిక రైతులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

భూ రక్షణకు చర్యలు

ప్రజాశక్తి-అమరావతి

నెల్లూరు జిల్లా, నెల్లపల్లి గ్రామ పరిధిలోని 150 ఎకరాల అటవీ భూమి ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారణ కావడంతో ఆ భూమి రక్షణకు అధికారులు తీసుకునే చర్యలను వివరించాలని హైకోర్టు బుధవారం ఆదేశించింది. పూర్తి వివరాలు అందజేయాలని అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారిని, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఆదేశించింది. రాపూరు, నెల్లూరు రేంజ్ పరిధిలోని పోతుకొండ రిజర్వ్ ఫారెస్ట్ భూమి 150 ఎకరాల ఆక్రమణకు గురయ్యాయని వెలుగోను గ్రామ రైతు అందెన వెంకటరమణయ్య పిల్ దాఖలు చేశారు.

తప్పును కులానికి అంటగడుతున్నారు

- వైసిపి ఎమ్మెల్సీ రఘురామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు తప్పుచేసి దాన్ని కులానికి అంటగడుతున్నారని వైసిపి ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ఆరోపించారు. ఇలాగే ప్రవర్తిస్తే ఇతర కులాల వారు తిరగబడతారని హెచ్చరించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌నుద్దేశించి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడిన మాటలు ఆయన కుల జాడ్యానికి నిదర్శమన్నారు. జగన్‌కు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమలకు సానుకూల పరిస్థితి లేదు : నాగార్జున

పరిశ్రమలకు రాష్ట్రంలో సానుకూల పరిస్థితి లేదని, పారిశ్రామికవేత్తలను కూటమి నాయకులు బెదిరిస్తున్నారని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ తెలిపారు. కమీషన్ల కోసం అధికార పార్టీ నాయకులు పారిశ్రామివేత్తలను వేధిస్తున్నారని, స్వయంగా ఎమ్మెల్యేలే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు వల్లే కడప స్టీల్ ఆగిపోయిందని, సజ్జన్ జిందాల్‌ను వేధింపులకు గురిచేసి తరిమేయడంతో రూ.50 వేలకోట్ల పెట్టుబడులు రాకుండా పోయాయని, వెంటనే క్షమాపణలు చెప్పి ఆయన్ను వెనక్కు తీసుకురావాలని అన్నారు. ఈ మొత్తం వ్యవహారానికి లోకేష్ బాధ్యత వహించాలన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు మురళీ మోహన్

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం (చిత్తూరు జిల్లా)

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడి వీర మరణం పొందిన కార్తీక్ యాదవ్ అంత్యక్రియలు బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానిపెంటలో నిర్వహించారు. మధ్యాహ్నం 3.45 గంలలకు ఆర్మీ అధికారులు, స్థానిక పోలీసులు జవాను అంతిమ యాత్రను ఎగువ రాగిమానిపెంట గ్రామ వీధుల గుండా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటితో అమర జవానుకు తుది వీడ్కోలు పలికారు. జవాను అంత్యక్రియల్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కె.మురళి మోహన్, గురజాల జగన్మోహన్, చిత్తూరు నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పలమనేరు ఆర్‌డిఒ భవాని, బంగారుపాళ్యం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, 4/8 గుర్ఖా రైఫిల్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్ సింగ్ గిల్ పాల్గొని నివాళులర్పించారు. అధికార లాంఛనాలతో ఆర్మీ సిబ్బంది, పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

పదేళ్ల క్రితం ఆర్మీలో చేరిన కార్తీక్ యాదవ్ రాజస్థాన్ ఆర్మ్‌డ్ రెజిమెంట్‌లో ఏడేళ్లపాటు పని చేశారు. రెండేళ్ల క్రితం జమ్మూకు బదిలీ అయ్యారు. జమ్ము కాశ్మీంలో ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వీర మరణం పొందారు. కార్తీక్ మృతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మంత్రి నారా లోకేష్, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వీరజవాన్ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు.





ఎర్రజెండా 'నీడ'లో..పేదల 'గూడు'...!

నెల్లూరులో 25 కాలనీల నిర్మాణం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర మహాసభకు సిద్ధమౌతున్న నెల్లూరు జిల్లాలో సిపిఎం పోరాటాలది ఒక ప్రత్యేక స్థానం! ఎర్రజెండా చేతపట్టి జిల్లా ప్రజానీకం చేసిన ఒక్కో పోరాటానికి ఒక్కో చరిత్ర! వాటిలో నెల్లూరు నగరంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం కోసం జరిగిన పోరాటాలది ప్రత్యేక స్థానం! నాయకులు, కార్యకర్తలు నిరంతరం చేసిన ఈ పోరాటాల ఫలితంగా ఒకటి, రెండు కాదు. ఏకంగా 25 కాలనీలు నిర్మాణమయ్యాయి. వేలాదిమందికి'గూడు' లభించింది. నగరం విస్తరించడం, ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు కల్పించడంతో వాటి విలువ కూడా పెరిగింది.

పేదలకు కూడు...గూడు...గుడ్డ... ప్రభుత్వాల నినాదాలు. కానీ, ఏ ప్రభుత్వం కూడా పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో సిపిఎం నేత జక్కా వెంకయ్య నేతృత్వంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటి స్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్బంధాలు, లాఠీఛార్జీలు,. కేసులను ఎదుర్కొన్నారు. జైళ్లకు వెళ్లారు. పేదలను స్థలాల్లోకి సిపిఎం నేతలు తీసుకువెళ్లి, వారి చేత నిర్మాణాలు ప్రారంభింపచేసిన తరువాతే ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, చట్టబద్ధత కల్పించడం జరిగింది. బాలాజీ నగర్ ప్రాంతంలోని ఎద్దలరేవు సంగం వద్ద పేదలను ప్రభుత్వం తొలగించిన సమయంలో సిపిఎం నిర్వహించిన పోరాట ఫలితంగా పేదలకు ఇంటి స్థలాలు అందజేశారు. అదే ఇప్పటి ఎన్‌టిఆర్ నగర్ . వేలాది మందికి ఇక్కడ ఇంటిస్థలాలు ఇచ్చారు. ఇప్పుడు అది నగరంలో ప్రత్యేక కాలనీగా మారింది. రోడ్లు, డ్రెయినజీ, వీధి దీపాలు, పార్కులతో అభివృద్ధి చెందింది. సిపిఎం దశలవారీగా చేసిన ఆందోళన ఫలితంగా మౌలిక సదుపాయాలు కల్పించారు.ఇక్కడ వేలాది మంది నివాసముంటున్నారు. జాతీయ రహదారి పక్కన పడారుపల్లి ప్రాంతంలో ప్రభుత్వ భూమి, కొందరు వ్యక్తుల చేతుల్లో దురాక్రమణగా ఉన్న భూముల్లో సిపిఎం నాయకులు ఇంటి స్థల పోరాటం నిర్వహించారు. అనేక ఆందోళన ఫలితంగా సుమారు 1,000 మందికి ఇంటిస్థలాలు అందజేశారు. అదే పుచ్చపల్లి సుందరయ్యకాలనీ. ఇటీవల కాలంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో కాలనీ అభివృద్ధి చెందింది. జాతీయ రహదారిపక్కనే అయ్యప్పగుడి సమీపంలో డ్రైవర్స్ కాలనీ పేరుతో 500 మంది పేదలకు ఇంటి స్థలాలు అందజేశారు. ఎన్నో పోరాటాలు ఇందుకోసం నిర్వహించారు. వివిధ సంస్థల్లో డ్రైవర్స్‌గా పనిచేస్తున్న కార్మికులు ఇక్కడ సిపిఎం ఆధ్వర్యంలో స్థలాలు ఇచ్చారు. ఇది నగరంలో ప్రత్యేక కాలనీగా మారింది. అయ్యప్పగుడి వెనుక వైపు కమ్యూనిస్టు నేత వి. మాలకొండారెడ్డి పేరుతో కాలని ఏర్పడింది. ఇక్కడ సుమారు 500 మందికి , అదే ప్రాంతంలో డాక్టర్ రామచంద్రారెడ్డి నగర్‌పేరుతో మరో 500 మందికి ఇంటి స్థలాలు అందజేశారు. ఇవి కూడా సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి సాధించినవే! నెల్లూరు చెరువు ప్రాంతంలో కమ్యూనిస్టు యువనేత, రాడికల్స్ చేతిలో అతిదారుణంగా హత్యచేయబడి మన్సూర్ బాయ్ పేరుతో నగర్ ఏర్పాటు చేశారు. సిపిఎం కృషి ఫలితంగా అన్ని వర్గాల పేదలకు 400 మందికి ఇక్కడ ఇంటిస్థలాలు కేటాయించారు. జాతీయ రహదారి నుండి గొలమూడికి వెళ్లే మార్గంలో ప్రభుత్వ భూమిలో పోరాటం నిర్వహించి 500 మంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారు. ఈ కాలనీకి జక్కా వెంకయ్య పేరు పెట్టుకున్నారు. నగరంలోని వివిధ చోట్ల కూలీ పనులుచేసుకునే ప్రజలకు ఇక్కడ స్థలం ఇచ్చారు. అప్పుడిప్పుడే సదుపాయాలు పొందుతున్నారు.

వెంకటేశ్వరపురం సమీపంలోని పెన్నా పరివాహక ప్రాంతంలో సిపిఎం పోరాటం ఫలితంగా 1,000 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారు. దానికి భగత్‌సింగ్ కాలనీగా పేరు పెట్టారు. ప్రస్తుతం నగరం నడిబొడ్డుగా ఉన్న ఉమ్మారెడ్డి గుంట ప్రాంతంలో 200 మందికి ఇంటి స్థలాలు అందజేశారు. భక్తవత్సలనగర్ ప్రాంతంలోని స్నేహ నగర్‌లో సుమారు 100 మందికి స్థలాలు అందజేశారు. నిప్పో ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న చంద్రమౌళి నగర్ ప్రాంతంలో సుమారు 150 మంది పేదలు సిపిఎం ఆధ్వర్యంలో ఇంటిస్థలాలు సాధించుకున్నారు. అయ్యప్పగుడి ప్రాంతంలోని మల్లయ్య గుంట ప్రాంతంలో పోరాటం ఫలితంగా 300 మందికి ఇంటి స్థలాలుదక్కాయి. పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని సుందరయ్య నగర్‌లో 200 మందికి, గుర్రాల మడుగు సంఘం వద్ద 1000 మందికి, పడారుపల్లి ప్రాంతంలో బిజెపి గూండాల చేతిలో అతిదారుణంగా హత్యకు గురైన గోను చలపతి, చెంచయ్య పేరుతో 300 మంది కి స్థలాలు సాధించారు. వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీ, జ్యోతి నగర్, జాషువా నగర్, అంబేద్కర్ కాలనీ, శివాజీ నగర్, శ్రామికనగర్ కొత్తూరు , సుభాన్ నగర్, కొత్త కాలువ సెంటర్, చిట్టేటి రమణారెడ్డి కాలనీ, వైఎస్ఆర్ నగర్, ప్రాంతాల్లో పేదలకు సిపిఎం ఆధ్వర్యంలో ఇంటిస్థలాలు సాధించారు. ప్రస్తుతం వైఎస్ఆర్ నగర్‌గా కొత్తూరు వద్ద ఉన్న కాలనీలో తొలిత సిపిఎం ఆద్వర్యంలో ఏడు వేల మందిపేదలు ఎర్రజెండా పట్టుకొని అడుగులు వేశారు. అటు తరువాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 5,600 మందికి ఇంటిస్థలాల ఇచ్చారు. ఇంటిస్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు సాగాయి. వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. సిపిఎం నాయకులపై కేసులు పెట్టారు. జైళ్లకు వెళ్లారు. ఇప్పటికీ కొందరు కేసులున్నాయి.

25 కాలనీలు ఇవే!

సిపిఎం పోరాటం కారణంగా ఏర్పాటైన వాటిలో పలు కాలనీలకు ఉద్యమ నేతల పేర్లే పెట్టడం గమనార్హం.

1. సుందరయ్య కాలనీ,
2. డ్రైవర్స్ కాలనీ,
3 వి. మాలకొండారెడ్డినగర్
4. పుచ్చలపల్లి రామచంద్రారెడ్డినగర్
5. మన్సూర్ నగర్
6. వైఎస్ఆర్ నగర్
7. జక్కా వెంకయ్య నగర్.
8. భగత్‌సింగ్ నగర్ (వెంకటేశ్వరపురం)
9. ఎన్‌టిఆర్ నగర్
10. భక్తవత్సలనగర్ (స్నేహ నగర్)
11. చంద్రమౌళినగర్
12. మల్లయ్య గుంట
13.సుందరయ్య నగర్ (పాతమున్సిపల్ ఆఫీసు)
14 చిట్టేటి రమణారెడ్డి నగర్
15 గుర్రాల మడుగు సంగం
16. చలపతి , చెంచయ్య నగర్
17. గాంధీగిరిజన కాలనీ
18. ఉమ్మారెడ్డిగుంట
19.జ్యోతి నగర్
20 జాషువా నగర్
21. అంబేద్కర్ కాలనీ,
22. అంబేద్కర్ నగర్
23. శ్రామికనగర్
24. సుభాన్ నగర్
25. భగత్ సింగ్ కాలనీ (బుజబుజనెల్లూరు) కాలనీ



సైద్ధాంతిక వేత్త 'మాకినేని'



ఎంబిగా సుప్రసిద్ధుడైన బసవపున్నయ్య గుంటూరు జిల్లాలో 1914 డిసెంబరు 14 న జన్మించారు. కొంత కాలం సాంప్రదాయబద్ధమైన విద్య నభ్యసించినా తర్వాత ఇంగ్లీషు మీడియం స్కూలులోనూ చదివారు.గుంటూరు ఎసి కాలేజీలో బిఎ వరకు చదివారు.1930లో స్వాతంత్య పోరాటంలో పాలు పంచుకున్నారు. కాంగ్రెస్ నాయకత్వం పద్ధతుల నచ్చక 1934-35లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. గుంటూరు జిల్లాలో పార్టీ ఆర్గనైజర్‌గా వున్నారు. అప్పుడే ఎఐఎస్ఎఫ్ జాతీయ సహాయ కార్యదర్శిగానూ, 1940లో రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగానూ ఎన్ని కయ్యారు. ఎసి కాలేజీలో వున్నప్పుడే విద్యార్థి ఉద్యమ నేతగా ఉపన్యాసకుడుగా ఆయన విశేషమైన సంచలనం కలిగించారు. 1940లో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా, 1943లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికైనారు. 1948లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులైనారు. 1950 నుంచి పొలిట్‌బ్యూరో సభ్యులుగా వున్నారు.

వీరతెలంగాణా రైతాంగ సాయుధ పోరాట నేతలలో మాకినేని ఒకరు. ముఖ్యంగా దానికి అవసరమైన నిధులు సేకరించడంలోనూ ఆయుధాలు సమీకరించడంలోనూ బసవపున్నయ్య పాత్ర ప్రత్యేకించి చెప్పుకోదగినది. ఆ పోరాటం కొనసాగించాలా లేదా అనే విషయమై తర్జన భర్జనలు జరుగుతున్నప్పుడు వాటిపై స్టాలిన్ సలహా తీసుకునేందుకు మాస్కో వెళ్లిన ప్రతినిధి వర్గంలో ఆయన ఒకరు. తర్వాత కాలంలో హోరాహోరీగా జరిగిన 1955 ఎన్నికల పోరాటంలో ఆయన ప్రసంగ ధాటికి కంగుతిన్న శత్రువులు ఆయనపై లేని పోని అసత్యాలు ప్రచారంలో పెట్టారు. వాటినే ప్రచారాస్త్రా లుగా చేసుకున్నారు. వ్యక్తిగతంగానూ, అనేక అవాకులు చవాకులు ప్రచారంలో పెట్టారు. అయినా వాటన్నిటిని లెక్క చేయకుండా అచంచలంగా కృషి కొనసాగించిన ధీశాలి మాకినేని.

సహజంగానే ఆయన కమ్యూనిస్టు ఉద్యమ అఖిల భారత నాయకుడుగా ఎదిగారు.

తెలంగాణా పోరాట క్రమంలో ముందుకొచ్చిన సిద్ధాంత సమస్యలు తర్వాత కాలంలో కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్ర చర్చలకు దారి తీశాయి. సిద్ధాంత స్వచ్ఛతను సముచిత అన్వయాన్ని కాపాడటానికి గాను ఆ సైద్ధాంతిక పోరాటం సాగించడంలో ఎం.బి.ది ఒక కీలకపాత్ర. చివరకు 1964లో సిపిఐ(ఎం)గా పునర్నిర్మాణమైనప్పుడు కీలకమైన విధాన పత్రాలన్నిటి రూపకల్పనలో ఆయన ప్రధానపాత్ర వహించారు. ఆ దశలో పార్టీలో ఇంకా తేలని సిద్ధాంత అంశాలు ముఖ్యంగా జాతుల సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి 1972 మధుర మహాసభలో ఆ అవగాహనకు తుది రూపమిచ్చిన సిద్ధాంతవేత్త. ఇప్పటి పరిస్థితికి భిన్నంగా ప్రధానంగా వివిధ వామపక్ష పార్టీల మధ్య వాద, వివాదాలు తీవ్రంగా సాగుతున్న కాలంలో నిశితమైన సమాధానాలివ్వడంలో మాకినేనిదే అగ్ర తాంబూలం. రెండు మహా సోషలిస్టు దేశాలైన అప్పటి సోవియట్ యూనియన్, చైనాలు రెండూ సిపిఐ(ఎం)తో విభేదించిన కాలంలో పార్టీ సైద్ధాంతిక అవగాహనను, రాజకీయ ప్రతిష్ఠను పెంపొందించడంలో ఎంబి అనన్య సామాన్యమైన పాత్ర పోషించారు. దేశ పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించడం అనే సూత్రాన్ని ఆయన సదా పాటించేవారు. అందుకోసం ఎంత శ్రమైనా చేసేవారు. ఏది రాసినా సాధికారికంగా రాయడం కోసం ఎన్నెన్నో గ్రంథాలు తిరగేసేవారు. రంగం మీదకు కొత్త సమస్యలు వచ్చినా, సరికొత్త వాదనలు వినిపించినా క్యాడర్లు మాకినేని ఏం రాస్తారోనని చూసే వారంటే అతిశయోక్తి కాదు. చైనా సోవియట్ పార్టీల మధ్య సంబంధాలు క్షీణించడంలో ప్రధాన ఘట్టమైన రుమేనియా పార్టీ మహాసభకు ఆయన హాజరైనారు. మొత్తంగానే అంతర్జాతీయ వ్యవహారాల పట్ల సౌహార్ద సంబంధాలు పట్ల ఆయనకు గొప్ప అవగాహన వుండేది. స్టాలిన్‌తోనే గాక మావో ,చౌఎన్ లై తదితరులతో కూడా అనేకసార్లు చర్చలు జరిపారు. పార్టీ అంతర్జాతీయ సంబంధాలను పునరుద్ధరించడంలో ఆయన ఒక కీలక పాత్ర నిర్వహించారు. గోర్బచెవ్ నాయకత్వం శల్య సారధ్యం ప్రారంభించినట్టు స్పష్టం కాగానే ఆయన ఒక సమగ్ర సిద్ధాంత పత్రం రాసి ప్రపంచం పరస్పరాధారితమనే దివాళాకోరు వాదనలు తుత్తునియలు చేశారు. మాకినేని వాదనా పటిమ, వ్యంగ్య వైభవం, హాస్యం గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. అంతర్జాతీయ వేదికలపై గంభీర ప్రసంగం చేసినా సామాన్య జనం అర్థం చేసుకోవడానికి అవసరమైన సులభ శైలిని కూడా ఆయనే పాటించేవారు.

వయస్సు, హోదాలతో నిమిత్తం లేకుండా యువ కార్యకర్తలతో కలసి పోయి ఉత్సాహపరచేవారు. మానవత్వాన్ని కనపరచేవారు. సాహిత్యంలో ఆయనకు మంచి పట్టు వుండేది. తెలుగు సామెతలు జాతీయాలు అలవోకగా ఉపయోగించే మాకినేని ఆంగ్ల భాషలోనూ అంత ధాటి కనపరచేవారు. ఆయన 1952-66 మధ్య రాజ్యసభలో వున్నప్పుడు మాట్లాడుతున్న వేగానికి ఉపాధ్యక్షుడు రాధాకష్ణన్ అడ్డుపడవలసి వచ్చింది. ఇది ఆయన స్వయం సాధనకు ఒక ఉదాహరణ మాత్రమే. జీవితం చివరి క్షణం వరకు పొలిట్‌బ్యూరో సభ్యుడుగా పీపుల్స్ డెమోక్రసీ సంపాదకుడుగా సేవ చేసిన మాకినేని అఖిల భారత ఉద్యమంతో పాటు ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్లో ఉద్యమంలో ధృవతారగా వెలుగొందుతుంటారు.

వరికపూడిసెల కోసం వచ్చేనెలలో ఆందోళన

అమరావతి జపం చేస్తూ ఇతర ప్రాంతాల అభివృద్ధిని విస్మరిస్తున్న చంద్రబాబు : పి మధు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

లక్షా 20 వేల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టుపై ఎన్నికల సమయంలో ఉపన్యాసాలిచ్చిన వారు అధికారంలోకి రాగానే దాని గురించి మాట్లాడడంలేదని మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురూ ఈ ప్రాజెక్టు విషయంలో శంకుస్థాపనలకే పరిమితమయ్యారని, దీనిపై వచ్చే నెలలో ఆందోళనకు పూనుకుంటామని తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలోని సిపిఎం కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. సూపర్-6 పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని సిఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. అదాని కంపెనీతో వైసిపి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని గతంలో డిమాండ్ చేసిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు ఈ పని చేయడం లేదని ప్రశ్నించారు. ధాన్యం మొత్తాన్ని కొంటున్నట్లు ప్రభుత్వం చెబుతోందని, పల్నాడు ప్రాంతంలో పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఎలా ఉందని నిలదీశారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకు కొనాలని, దళారుల నుండి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. అమరావతి, పోలవరం జపం చేస్తూ రాష్ట్రంలో ఇతర ప్రాంతాల అభివృద్ధిని చంద్రబాబు విస్మరిస్తున్నారని, అన్ని ప్రాంతాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత కాదా? అని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని, ఈ విధానాలను మార్చుకోకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.హనుమంతరెడ్డి, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు శివరామకృష్ణ. వెంకటప్పయ్య, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుదున్న మధు



పెదమట్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ధాన్యం కొనుగోలు నిలుపుదలపై ధర్నా

- తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురం మండలంలోని పెదమట్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది రోజులుగా కొనుగోలు నిలిపివేయడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఆ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో పది రోజులుగా కేంద్రం వద్ద రైతులు ఎదురుచూపులు చూస్తున్నారని తెలిపారు. గోదావరి వరదల వల్ల విఆర్.పురం మండలంలోని వెంకన్నగూడెం, రామవరం, చొప్పల్లి, మొద్దులగూడెం, గుర్రంపేట, నూతిగూడెం, సున్నంవారిగూడెం తదితర గ్రామాల్లో నాట్లు ఆలస్యంగా వేశారని తెలిపారు. దీంతో పంట రావడం ఆలస్యమైందన్నారు. ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులందరూ ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రైతు నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిందని, కొనుగోలు నిలుపుదల చేయడం తగదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం ఎండకు ఎండుతుండడం వల్ల రోజురోజుకు రంగు మారే అవకాశం ఉందని తెలిపారు.

రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులను సమీకరించి ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు మార్చి 2న రాతపరీక్ష

- జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ కుమార్ విశ్వజిత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జైళ్లశాఖ డ్రైవర్ పోస్టులకు మార్చి 2న రాత పరీక్ష నిర్వహిస్తామని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ కుమార్ విశ్వజిత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 5 డ్రైవర్ పోస్టులకు గతంలో నిర్వహించిన డ్రైవింగ్ పరీక్షలో 311 మంది అర్హత సాధించారని తెలిపారు. నెల్లూరు జిల్లా మూలపేటలోని ఎపి స్టేట్ ట్రైనింగ్ అకాడమి ఫర్ రిఫార్మేషన్ సర్వీసెస్, పాత సెంట్రల్ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 2న ఉదయం 8 గంటలకు ఎల్ఎంవి అభ్యర్థులు, మధ్యాహ్నం 12 గంటలకు హెచ్ఎంవి అభ్యర్థులు కచ్చితంగా హాజరుకాకపోతే అనుమతించబోమని పేర్కొన్నారు.

భూముల రీ సర్వే పై హెల్ప్‌లైన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీ సర్వేకు సంబంధించి భూ యజమానులు, సర్వే సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి ఎటువంటి సందేహాలున్నా వాటిని నివృత్తి చేసేందుకు రాష్ట్ర స్థాయి హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ పేర్కొంది. ఈ మేరకు ఆ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సందేహాలు నివృత్తి కోసం కార్యాలయం పనిరోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 8143679222కు ఫోన్ చేయొచ్చని తెలిపింది. ఈ అవకాశాన్ని భూ యజమానులు, రెవెన్యూ సిబ్బంది వినియోగించుకోవాలని ఆ శాఖ విజ్ఞప్తి చేసింది.

ఎయిర్‌టెల్ ప్లాన్లలో 'డేటా'కు ఎసరు

- పాపులర్ ప్లాన్ల నుంచి తొలగింపు
- చార్జీలు మాత్రం యథాతథం
- అదే బాటలో రిలయన్స్ జియో..!



న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలు ప్రజల నడ్డివిరచడానికి ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఇంతకాలం డేటానే ప్రాణం.. అది అందరి హక్కు అంటూ.. అత్యంత చౌకగా ఇస్తున్నామని ఊదరగొట్టిన టెల్కోలు ఇప్పుడు అడ్డగోలుగా తమ ప్లాన్ల నుంచి డేటాను తొలగించే పనిలో పడ్డాయి. ఈ క్రమంలోనే భారతీ ఎయిర్‌టెల్ అనుహ్యంగా తన రెండు పాపులర్ ప్లాన్ల నుంచి డేటాను తొలగించింది. ఇది గురువారం నుంచి అమల్లోకి రానుంది. వాయిస్, ఎస్ఎంఎస్‌ల కోసం ప్రత్యేకంగా రీఛార్జి ప్లాన్లు తీసుకురావాలని టెలికాం కంపెనీలకు ట్రాయ్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. గతేడాది జులైలో భారీగా పెంచిన టారిఫ్ ఛార్జీలతో ఇప్పటికే సతమతం అవుతోన్న వినియోగదారులు.. డేటా తొలగింపునతో ప్రత్యేకంగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితితో అదనపు భారం పడనుంది.

ఎయిర్ టెల్ రూ.509 ప్లాన్ 84 రోజుల కాలపరిమితో వస్తోందని.. ఈ రీఛార్జితో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 900 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయని పేర్కొంది. 365 రోజుల గడువుతో రూ.1,999 రీఛార్జి ప్లాన్ అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3600 ఎస్ఎంఎస్‌లు అందించనుంది. ఈ రెండు రీఛార్జి ప్లాన్లపై ఇంతకు ముందు 6జిబి డేటా కూడా అందించేది. తాజాగా ఈ డేటాకు ఎసరు పెట్టింది. త్వరలోనే రిలయన్స్ జియో కూడా అదే బాటలో పయనించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. జియో అందిస్తున్న రూ.479, రూ.1999 ప్లాన్లపై డేటా తొలగించే అవకాశం ఉందని రిపోర్టులు వస్తోన్నాయి. ప్రస్తుతం అన్ని టెలికాం కంపెనీలు వాయిస్, ఎస్ఎంఎస్‌లతో పాటు డేటా కలగలిపిన ప్లాన్లు అందిస్తున్నాయి.

వినియోగదారుల ఆగ్రహం..

గతేడాది జులైలో రిలయన్స్ జియో తొలుత టారీఫ్‌లను 25 శాతం వరకు పెంచగా... ఆ బాటలో ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కూడా ఛార్జీల మోత మోగించాయి. ఈ దఫా ఎయిర్‌టెల్ తొలుత డేటాకు ఎసరు పెట్టగా.. మిగితా రెండు ప్రయివేటు టెల్కోలు కూడా అదే బాటను ఎంచుకోన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే పెంచిన టారీఫ్‌లు భారంగా ఉన్నాయి. దీనికి తోడు ఎయిర్‌టెల్ ఇచ్చే డేటాను మాయం చేయడం పట్ల వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్లాన్లలో డేటాను తొలగించడంతో సాధారణంగా ధరలు కూడా తగ్గించాలి.. కానీ పాత టారీఫ్‌లనే వసూలు చేయడం గమనార్హం. ముఖ్యంగా కొద్దిపాటి డేటా వాడుకునే వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాట్సాప్ లాంటి మెసేజింగ్ ఫీచర్లను చెక్ చేసుకోవడానికి కూడా డేటా లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇకపై చిన్న అవసరాల కోసం కూడా డేటా కోసం అదనంగా నగదు చెల్లించాల్సి రావడం ద్వారా తమపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డేటా లేకుండా ప్లాన్లు ఎలా ఉపయోగపడతాయని ప్రశ్నిస్తున్నారు. ట్రాయ్, వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ మాత్రమే ఉపయోగించే వారి కోసం డేటా లేని ప్లాన్‌లను అందించాలని, అలాగే డేటా తొలగించినందుకు ధరలను తగ్గించాలని టెలికాం కంపెనీలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొత్త ప్లాన్లను తక్కువ ధరలో ప్రవేశపెట్టాల్సింది పోయి.. ఉన్న ప్లాన్లను అదే ధరలకు అందిస్తూ.. అందులోని డేటాకు ఎసరు పెట్టడం అన్యాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు రూ.16,736 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆర్థిక సంవత్సరం 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 2.2 శాతం వృద్ధితో రూ.16,736 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2023-24 ఇదే త్రైమాసికంలో రూ.16,373 కోట్ల లభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో ఆ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 7.7 శాతం పెరిగి రూ.30,650 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ స్థూల అడ్వాన్సులు 3 శాతం పెరిగి రూ.25,42,600 కోట్లకు చేరాయి. స్థూల నిరర్థక ఆస్తులు 1.42 శాతానికి పెరిగాయి. ఇంతక్రితం ఏడాది నాటికి 1.26 శాతంగా జిఎన్‌పిఎ ఉంది. 2024 ముగింపు నాటికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 9,143 శాఖలు, 21,049 ఎటిఎం కేంద్రాలను కలిగి ఉంది.

బిపిసిఎల్ లాభాల్లో 20% వృద్ధి

న్యూఢిల్లీ : దిగ్గజ ఇంధన కంపెనీ భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 19.6 శాతం వృద్ధితో రూ.3,806 కోట్ల నికర లాభాలు సాధించింది. కంపెనీ స్థూల రెవెన్యూ 1.9 శాతం తగ్గి రూ.1.27 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. గడిచిన త్రైమాసికంలో మెరుగైన ప్రగతిని కనబర్చామని బిపిసిఎల్ సిఎండి జి క్రిష్ణ కుమార్ తెలిపారు. తమ రిఫైనరీ మార్జిన్లు బ్యారెల్‌పై 4.4 డాలర్ల నుంచి 5.6 డాటర్లకు పెరిగాయన్నారు.

ఐఫోన్‌లోనూ ఇక ట్రూకాలర్..



బెంగళూరు : కమ్యూనికేషన్స్ వేదిక ట్రూకాలర్ ఫీచర్ ఇకపై ఐఫోన్‌లోనూ అందుబాటులోకి వచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. దీంతో స్పామ్, స్కామ్ బ్లాకింగ్ సామర్థ్యాలను ఐఫోన్ వినియోగదారులకు అందించనున్నట్లు ట్రూకాలర్ వెల్లడించింది. అన్ని రకాల కాల్స్‌ను గుర్తించే సామర్థ్యం లభించనుందని పేర్కొంది. ట్రూకాలర్ 15 సంవత్సరాలుగా అవాంఛనీయ కమ్యూనికేషన్ ఫిల్టర్ చేసే టెక్నాలజీలో ఉంది. స్పామ్ కాల్స్ ఆటోమాటిక్ బ్లాకింగ్ సదుపాయాలను కల్పిస్తుందని ట్రూకాలర్ సిఇఒ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా పేర్కొన్నారు. ఐఫోన్‌లోనూ ట్రూకాలర్‌ను అందుబాటులోకి తేవడంపై సంతోషంగా ఉందన్నారు.

రియాల్టీలో మందగమనం..!

- నివాస అమ్మకాల్లో 9 శాతం పతనం

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా రియాల్టీ మందగమనంలో ఉంది. గతేడాది 2024లో దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో నివాస అమ్మకాలు 9 శాతం పడిపోయి 4.71 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయని ప్రాప్‌ఈక్విటీ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్, కోల్‌కతా, ఢిల్లీ-ఎన్‌సిఆర్, ముంబయి, నవీ ముంబయి, పూణె, థానే నగరాల్లో 2023లో ఏకంగా 5.14 లక్షల యూనిట్ల అమ్మకాలు జరిగాయి. దీంతో పోల్చితే గతేడాది విక్రయాలు తగ్గాయి. నూతన నివాస అమ్మకాలు 15 శాతం క్షీణించి 4.11 లక్షల యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. సాధారణ ఎన్నికల వల్ల అమ్మకాల్లో స్తబ్దత చోటు చేసుకుందని ప్రాప్‌ఈక్విటీ సిఇఒ సమీర్ జసుజా పేర్కొన్నారు. గతేడాది హైదరాబాద్‌లో నివాస అమ్మకాలు 25 తగ్గి 61,722 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం 2023లో 82,350 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. కోల్‌కత్తాలో విక్రయాలు 1 శాతం, పూణెలో 13 శాతం, థానేలో 5 శాతం, చెన్నయ్‌లో 11 శాతం చొప్పున తగ్గాయి. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో మాత్రం 5 శాతం విక్రయాలు పెరిగి 49,932 యూనిట్లుగా నమోదయ్యాయి.

సంపాదకీయం

మరో నిరంకుశ చర్య

వైస్ ఛాన్సలర్ల నియామకంపై గవర్నర్లకు పూర్తి అధికారం కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రాష్ట్రాల హక్కులకు పాతర వేయడమే! ఈ నోటిఫికేషన్ ద్వారా ఉన్నత విద్యా వ్యవస్థలో ఊహించడానికి కూడా సాధ్యం కాని మార్పులను కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం తలపెట్టింది. వాటిలో అత్యంత కీలకమైనది వైస్ ఛాన్సలర్ల నియామక నిబంధనలను పూర్తిగా మార్చడానికి ప్రతిపాదించడం. వీరి నియామకాలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పాత్రను పూర్తిగా తొలగించడంతో పాటు, అన్ని అధికారాలను గవర్నర్లకు అప్పగించాలని పేర్కొనడంతో పాటు, వైస్ ఛాన్సలర్లకు ఎంపికకు సంబంధించిన విద్యాపరమైన అర్హతలను సడలించారు. విశ్వవిద్యాలయాలంటేనే మేథో నిలయాలు! వేనవేల చర్చలకు, భావాల ఘర్షణకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రాలు! ఒక్క మాటలో చెప్పాలంటే భవిష్యత్ దేశ నిర్మాణం ఇక్కడే జరుగుతుంది. అటువంటి సంస్థకు నాయకత్వం వహించే వ్యక్తి ఎలా ఉండాలి? తాజా మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు రంగానికి చెందిన వారితో పాటు, ఎటువంటి అకడమిక్ అనుభవం లేని వారిని కూడా వైస్ ఛాన్సలర్లగా నియమించే అవకాశం ఉంది. పైగా దీనికి సంబంధించి ఎటువంటి సెర్చి కమిటీలు, అధ్యయనాలు, పరిశీలనలు ఉండవు. అంతా గవర్నర్ కనుసన్నల్లోనే! కీలకమైన బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన నియామకాల్లోనూ ఇటువంటి మార్పులనే కేంద్రం తాజాగా ప్రతిపాదించింది.

గవర్నర్‌కు అప్పగించే అధికారాలు నిజానికి కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మతతత్వ, కార్పొరేట్ శక్తుల కలయికగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఉందన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అనేక కీలక రంగాలను సంఘ్ పరివారంతోనూ, ఆ భావజాలంతోనూ నింపిన ఘనత కేంద్ర సర్కారుకు ఉంది. ఇప్పుడు ఉన్నత విద్యా రంగాన్ని అటువంటి మౌఢ్యపు ఆలోచనలతో మెదళ్లను నింపుకున్న వారితోనూ, ఆ భావజాలాన్ని ప్రచారం చేసే వారితోనూ నింపివేయడానికే ఈ కుటిల ఎత్తుగడలకు పాల్పడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పనిలోపనిగా ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో వ్యాపార మయం చేసి తమ కార్పొరేట్ బాస్‌ల ఆకాంక్షలను నెరవేర్చడానికి కూడా ప్రతిపాదిత మార్పులు ఉపయోగపడతాయి. అందుకే, రాష్ట్ర ప్రభుత్వాలతో, విద్యారంగ నిపుణులతో ఏ మాత్రం చర్చించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం, యుజిసి ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశాయి. ఈ చర్య పూర్తిగా అప్రజాస్వామికం!

రాజ్యాంగపు 42వ సవరణ ద్వారా ఉన్నత విద్యను రాష్ట్ర జాబితా నుండి, ఉమ్మడి జాబితాలోకి బదిలీ చేశారు. దీనర్థం కేంద్ర ప్రభుత్వానికి విశేషాధికారాలు కట్టబెట్టినట్లు కాదు. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ రాష్ట్రాల జాబితాలోని 32వ అంశం ప్రకారం విశ్వవిద్యాలయాలను స్థాపించడానికి, పర్యవేక్షించడానికి రాష్ట్రాలకు అధికారం ఉంది. అందువల్లే, వివిధ రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు ఆ యా రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన చట్టాల ప్రకారమే నడుస్తాయి. ఆర్టికల్ 66 ప్రకారం ఉన్నత విద్యాలయాలు, పరిశోధన సంస్థలకు మధ్య సమన్వయం చేయడానికి, ప్రమాణాలు నిర్దేశించడానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. 1949 ఆగస్టు 31న రాజ్యాంగ సభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడా ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పారు. యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల నిర్వహణ కోసం అవుతున్న ఖర్చులో 80 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయి. అయితే, ఈ వాస్తవ పరిస్థితులు, రాజ్యాంగ నిర్దేశాలను కేంద్రంలోని మోడీ సర్కారు నామమాత్రంగా కూడా పట్టించుకోవడం లేదు. అందుకే, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఈ చర్యపై తీవ్రంగా స్పందించాయి. రెండు రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యాశాఖ మంత్రులు కేంద ప్రభుత్వానికి, ఎన్‌డిఎ యేతర పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు రాశారు. ఆ రెండు రాష్ట్రాలే కాదు. ఉన్నత విద్యను కాషాయీకరించడాన్ని, వ్యాపారమయం చేసే ఎత్తుగడలను తిప్పికొట్టడానికి జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి. రాజ్యాంగాన్ని, అది నెలకొల్పిన విలువలను రక్షించుకోవాలి.

మహనీయుల మాట




మతతత్వాన్ని మట్టుబెట్టే పని ముస్లింలది, సిక్కులది, క్రైస్తవులది, హిందువులదే కాదు, భారతీయులందరిదీ! దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరుచుకోవాలి!

- సుభాష్ చంద్రబోస్

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకే ...

సందర్భం




వై. కేశవరావు

చారిత్రాత్మక రైతు ఉద్యమం జరిగి మూడు సంవత్సరాలు దాటింది. 13 మాసాల పాటు ఢిల్లీ పరిసరాలు కేంద్రంగా దేశవ్యాప్తంగా జరిగిన పోరాటం ముగింపు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు చట్టాలు రద్దు చేస్తామని, సి2+50 శాతం మద్దతు ధరలు చట్టం చేస్తామని, విద్యుత్ చట్ట సవరణ బిల్లు రైతు సంఘాలతో చర్చించి నిర్ణయిస్తామని, ఉద్యమం సందర్భంగా అసువులు బాసిన రైతు కుటుంబాలకు పరిహారం ఇస్తామని ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చింది. చట్టాలను వెనక్కి తీసుకుంది. మిగతా హామీలను అమలు పరచకుండా మూడు చట్టాల రూపకర్తలతోను, ఆ విధానాల మద్దతుదారులతోనూ కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలన్నిటిలో అదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగులను సలహాదారులుగా నియమించింది.

మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం కొత్తగా మూడు పథకాలను ప్రకటించింది. ఈ మూడు పథకాల సారాంశం మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే ధ్యేయంగా ఉన్నాయి. వాస్తవానికి రద్దయిన చట్టాల కన్నా ఘోరంగా ఉన్నాయి. ఈ స్థితిలో ఎస్‌కెఎమ్ నాయకత్వం మరొక దీర్ఘకాల ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నది. ఈ క్రమంలో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 14న చర్చలకు సిద్ధమయింది.

డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్

డిజిటల్ రంగంలో విద్య, ఆరోగ్యం, ఆర్థిక, రిటైల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పేర్కొంది. సాంప్రదాయ వ్యవసాయాన్ని సాంకేతిక వ్యవసాయంగా మార్చడం లక్ష్యంగా ప్రకటించింది. మన వ్యవసాయ రంగం ప్రపంచంలో పాడి, జ్యూట్ పప్పుధాన్యాలు ఉత్పత్తిలో మొదటి స్థానంలో, గోధుమ, వరి, వేరుశనగ, కూరగాయలు, పళ్ళు, పత్తి, చెరకు ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉన్నప్పటికీ...చిన్న కమతాల వల్ల సరిపడా ఆదాయం రావడంలేదని పేర్కొంది. వాతావరణ సస్యరక్షణ, సాగునీటి వ్యవస్థ, అధిక ఎరువుల వాడకం సమస్యలు ఎదుర్కొంటున్నదని డిజిటల్ టెక్నాలజీతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొంది. ప్రతి గ్రామంలో బకెటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని అందులో రైతులందరినీ గ్రూప్‌గా ఏర్పరచాలని చెప్పింది. మూడు సంవత్సరాలలో 11 కోట్ల కుటుంబాలను ఈ గ్రూపుల్లో చేర్చడమే లక్ష్యంగా పేర్కొంది. రైతులందరినీ ఒకే గొడుగు కిందకు చేరుస్తుంది. ఈ గొడుగులన్నీ కార్పొరేట్ కంపెనీల అజమాయిషీలోనే వుంటాయి. వ్యవసాయ కార్యకలాపాలన్నీ కంపెనీల అజమాయిషీలోనే నిర్వహించాల్సి వుంటుంది. పేద, మధ్య తరగతి రైతాంగం యావత్తూ కంపెనీలకు బంధీలైపోతారు.



రైతులకు అగ్రి స్టాక్ కార్డులు ఇవ్వాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, పశుపోషణ, భూమి సారాలు, వాతావరణ ఫోర్ కాస్ట్, భూమిలో తేమ శాతం, క్రిమి కీటకాల ప్రభావం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంట్స్ అన్నీ దీని ద్వారా నిర్వహించాలని పేర్కొన్నది. ట్రాక్టర్లు, డ్రోన్లు, హార్వెస్టర్లు తదితర అగ్రికల్చరల్ రోబోట్లను ప్రవేశపెట్టాలని పేర్కొంది. భూములన్నీ ఏకీకృతం చేయడం లక్ష్యంగా ఉంది. ఇవన్నీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే తప్ప వేరుగాదు. రెండు దశాబ్దాలకు పూర్వం కుప్పంలో ఇజ్రాయిల్ కంపెనీతో చేసిన ప్రయోగం తప్ప వేరు కాదు.

నేషనల్ కోపరేటివ్ పాలసీ

రాష్ట్రాల జాబితాలో ఉన్న సహకార రంగాన్ని కేంద్రం పరిధిలోకి తీసుకున్నది. సహకార మంత్రిత్వ శాఖను ఏర్పరిచింది. జాతీయ సహకార పాలసీని ప్రకటించింది. గ్రామాలలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బహుళ ప్రయోజన ప్రాథమిక సహకార సంఘాలుగా మారుస్తుంది.

జనవరి 26న ర్యాలీ

ఇప్పటివరకు స్వతంత్ర సహకార సంఘాలుగా పని చేస్తున్న పాల సహకార సంఘాలను, మత్స్య సహకార సంఘాలను వీటితో సంధానం చేస్తుంది. వీటిని ప్రతి పంచాయతీ పరిధిలోనూ ఏర్పాటు చేస్తుంది. ఈ సంఘాలు సామాజిక వ్యవసాయం, పాలు, చేపలు, పరపతి, గోడౌన్లు ఏర్పాటు, ధాన్య సేకరణ, ఎరువులు, విత్తనాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ బంకులు, మందుల షాపులు ఏర్పాటు చేస్తాయి. కామన్ సర్వీస్ సెంటర్లు, మైక్రో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పు తాయి. రోబోట్ యంత్రాలు, యంత్రాల హైరింగ్ సెంటర్లు, సోలార్ పరికరాలు ఏర్పాటు చేస్తాయి. ఈ సహకార సంఘాలలో వ్యవసాయం చేసే రైతులు, పాలు పోసే రైతులు, చేపలు పెంచే రైతులు సభ్యులుగా ఉన్నారు. సంఘంలో ఎంత షేరు ధనం ఉన్నా ఒక్కొక్కరికి ఒక్కొక్క ఓటు ఉంటుంది. నూతన చట్టం ప్రకారం ఈ సంఘాలలో ఈ మూడు రంగాలతో వ్యాపారం చేసేవారు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నడిపేవారు, పెట్టుబడులు పెట్టేవారు "ఎ" తరగతి సభ్యులుగా చేరవచ్చు. వీరు 20 శాతం షేరు ధనం కట్టవచ్చు. ఓటింగ్ హక్కు కూడా 20 శాతం ఓట్లు ఉంటాయి. వ్యవసాయం చేసే రైతుకు, పాలు పోసే రైతుకు, చేపలు పెంచే రైతుకు ఒక్కొక్కరికి ఒక్కొక్క ఓటు మాత్రమే ఉంటుంది. ఈ సొసైటీలన్నీ వ్యాపారుల, ప్రోసెసింగ్ యూనిట్ యజమానుల, పెట్టుబడిదారులు అయిన అదానీ, అంబానీ, బేయర్, డూపాండ్, మాన్‌సాంటో, ర్యాలీస్ వంటి వాటి వశం అవుతాయి. ఈ సొసైటీలన్నిటికీ వారి ప్రయోజనాలే ప్రధానం అవుతాయి. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే ఆర్థిక సంస్థలన్నీ ఈ పథకానికి మద్దతుగా ఉంటాయి. ఇప్పటికే కంపెనీ యాక్ట్‌లోకి వెళ్ళిన విశాఖ డెయిరీ ఎలా నడుస్తున్నదో చూస్తూనే ఉన్నాం.

బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వం సంస్థలకు అప్పగించింది. నాబార్డ్ ఐదేళ్లలో 70 వేల సంఘాలను ఏర్పాటు చేసి అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలి. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ఇప్పుడున్న డెయిరీలను 46 వేల సొసైటీలతో పాటు మరొక 56 వేల సొసైటీలను ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో డెయిరీ ప్రాజెక్టును నెలకొల్పాలి. జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు 11,500 సొసైటీలు ఏర్పాటు చేయాలి.

నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్

ఏఎంసి చట్టానికి కేంద్రం 12 సవరణలు చేసింది. సవరణలన్నీ కార్పొరేట్ కంపెనీలకు, ఎగుమతిదారులకు, ప్రాసెసింగ్ కంపెనీల యజమానుల ప్రయోజనాల కోసం చేసినవే. గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, ప్రైవేట్ మార్కెట్లకు గుర్తింపు ఇచ్చింది. అన్ని మార్కెట్లకు ఈ ట్రేడింగ్ ప్లాట్‌ఫారాలు ఉండాలి. మార్కెట్ ఫీజులు, మార్కెట్ రుసుము, కమిషన్ చార్జీలు హేతుబద్ధం చేసింది. ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలకు రైతులు నేరుగా వెళితే ఫీజు మినహాయింపు. ఇతర రాష్ట్రాల నుండి ప్రాసెసింగ్‌కు తెచ్చిన సరుకులు ఫీజు మినహాయింపు. యార్డుల వెలుపల పండ్ల వ్యాపారాలు నిషేధించింది. దేశంలో ఉన్న 7057 రెగ్యులేటర్ మార్కెట్లను, 22 వేల గ్రామీణ అగ్రికల్చర్ మార్కెట్లను ఈనామ్ మార్కెట్లుగా మారుస్తుంది. ఏఎంసీల ద్వారానూ, ప్రైవేట్ మార్కెట్ల ద్వారానూ, ఎఫ్.పి.ఓలు, సొసైటీల ద్వారాను ముందస్తు అగ్రిమెంట్ల ద్వారా అమ్మకాలు, కొనుగోళ్ళు చేయవచ్చు.

మద్దతు ధరలు గానీ, మద్దతు ధరలకు కొనుగోలు చేయడం గాని, ధరలు పడిపోతే ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు ఉండవు. పైగా మద్దతు ధరల కోసం ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని సలహా ఇచ్చింది. ఇప్పటికే ధరల స్థిరీకరణ విధానం ఎత్తివేసింది. అన్ని రాష్ట్రాలు ఈ విధానాలు అమలు పరచాలని చెప్పింది. 2003లో ఈనామ్ మార్కెట్ల చట్టం చేసింది. ఈనామ్ మార్కెట్ వల్ల ఏ ఒక్క పంటకు ఏ ఒక్క రైతూ ప్రయోజనం పొందిన సందర్భం లేదు. ఇప్పటికే 2 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు అదానికి 30 సంవత్సరాలకు లీజుకు ఇచ్చింది. విజయవాడ నడిబొడ్డున ఉన్న సిడబ్ల్యుసి గోడౌన్ ప్రస్తుతం చందనా బ్రదర్స్ గోడౌన్‌గా ఉంది.

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎప్పుడూ ఇచ్చిన హామీ అమలుపరిచిన దాఖలాలు లేవు. 2014 ఎన్నికలలో సి2+50 శాతం అమలు పరుస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల అనంతరం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2021లో ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు పరచకుండా ఎగవేసింది. విద్యుత్ చట్టాన్ని యథాతథంగా అమలు చేసేందుకు పూనుకున్నది. కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్లు బకాయిలు రద్దు చేసిన ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని కబుర్లు చెబుతున్నది. రద్దు చేసిన చట్టాల కన్నా ఘోరమైన పథకాలను నేడు ముందుకు తెచ్చింది. పైగా ఏప్రిల్ ఒకటి నుండి 4 కార్మిక కోడ్‌లను అమలు పరుస్తానని ప్రకటించింది.

ఫిబ్రవరి 14న చర్చలు సజావుగా జరగాలన్నా, సి2+50 మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం చేయాలన్నా, రుణ మాఫీ చట్టం సాధించాలన్నా, రైతులకు వ్యవసాయ కార్మికులకు పెన్షన్ చట్టం రావాలన్నా పోరాటాన్ని తీవ్రం చేయాల్సి ఉంది. రైతాంగం, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులతోపాటు అన్ని ట్రేడ్ యూనియన్లను కలుపుకొని జనవరి 26న ర్యాలీలను జయప్రదం చేయాల్సి ఉంది.

/ వ్యాసకర్త రైతు సంఘం సీనియర్ నాయకుడు /

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎప్పుడూ ఇచ్చిన హామీ అమలుపరిచిన దాఖలాలు లేవు. 2014 ఎన్నికలలో సి2+50 శాతం అమలు పరుస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల అనంతరం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2021లో ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు పరచకుండా ఎగవేసింది. విద్యుత్ చట్టాన్ని యథాతథంగా అమలు చేసేందుకు పూనుకున్నది. కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్లు బకాయిలు రద్దు చేసిన ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని కబుర్లు చెబుతున్నది. రద్దు చేసిన చట్టాల కన్నా ఘోరమైన పథకాలను నేడు ముందుకు తెచ్చింది. పైగా ఏప్రిల్ ఒకటి నుండి 4 కార్మిక కోడ్‌లను అమలు పరుస్తానని ప్రకటించింది. ఫిబ్రవరి 14న చర్చలు సజావుగా జరగాలన్నా, సి2+50 మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం చేయాలన్నా, రుణ మాఫీ చట్టం సాధించాలన్నా, రైతులకు వ్యవసాయ కార్మికులకు పెన్షన్ చట్టం రావాలన్నా పోరాటాన్ని తీవ్రం చేయాల్సి ఉంది.

జనవాక్యం

దుంప తెగా.. ట్రంప్ స్పీడు ఇదేగా..

రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ప్రమాణం చేసిన డోనాల్డ్ ట్రంప్ స్పీడుని ఏ స్పీడోమీటర్లూ కొలవలేవు. పదవీ బాధ్యతలు తీసుకున్న క్షణమే కన్నుల కొద్దీ నిర్ణయాలు చకచకా తీసుకున్నారు. కొన్ని ఎన్నికల్లో చెప్పినవీ...మరి కొన్ని అప్పటికప్పుడే చెప్పినవి. ఆయన సంతకాలతో దేశం లోపలా, బయటా షాకులే. అమెరికాను మళ్లీ ఘనత పొందిన దేశంగా చేస్తానంటూ (మాగా) నుడివిన ఆయన వస్తూనే డజన్ల కొద్దీ ఆదేశాలపై సంతకాలు చేశారు. అందులో గత ప్రభుత్వం ఇచ్చిన 78 ఆదేశాల రద్దుతో మొదటి పద్దు మొదలెట్టారు. తర్వాత ముఖ్యమైన నిర్ణయం అమెరికాలో పుట్టిన వారికి ఆటోమేటిక్‌గా వర్తించే పౌరసత్వపు హక్కు రద్దు. తర్వాత ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి వైదొలగడం. పర్యావరణ రక్షణ బాధ్యత పూచీ పడాల్సిన పారిస్ ఒప్పందం నుండి తప్పుకోవడం. ఆ పైన తన చిరకాల హామీ అయిన మెక్సికో వైపు దేశ సరిహద్దుని గోడతో మూసేందుకు సుగమం చేసేలా ఎమర్జెన్సీ విధింపు. బ్రిక్స్ దేశాలతో వాణిజ్యంపై వంద శాతం సుంకం వేస్తానని హూంకరింపు. ఇలా ఒక్కొక్కటీ ఒక్కొక్క షాకు. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలను, అమెరికాతో సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేసే నిర్ణయాలు. అమెరికా తను పాడుచేసిన పర్యావరణం పట్ల చూపాల్సిన బాధ్యతను తప్పుకోవడం అంటే అది మొత్తం ప్రపంచ దేశాల పట్ల బాధ్యతను విస్మరించడమే. ఈ డజన్ల కొద్దీ ఆదేశాల్లో ఎన్ని కార్యరూపం దాలుస్తాయో కానీ ఆయన ఉద్దేశ్యం, స్పీడు మాత్రం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. అడుగు పెడుతూనే దుడుకు చూపించాడు. బండి స్టార్ట్ చేస్తూనే టాప్ గేర్ లోకి వెళ్లాడు. ఇక భయంతోనో, సంభ్రమంతోనో గట్టిగా కళ్ళు మూసుకోవడం, దెబ్బ తగలకుండా చూసుకోవడం ఒక్కటే ప్రపంచ దేశాల పని.

- డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, విజయనగరం.

విశ్లేషణ

భౌతికవాద పునరుజ్జీవం నేటి కర్తవ్యం



డా॥ కత్తి పద్మారావు



ఈనాడు భారతీయ తాత్విక బోధన ద్వారా విద్యార్థులను, పరిశోధకులను, రాజకీయవేత్తలను ప్రభావితం చేయాలంటే భారతీయ భౌతికవాద చింతన తప్పక జరగాలి. నీటిని కల్మషం చేసే కుంభమేళాలు భారతదేశ సంస్కృతి కాదు. ఇవి వ్యవసాయ సంస్కృతికి, పారిశ్రామిక విధానాలకు వ్యతిరిక్తమైనవి. మనిషిని మూఢ విశ్వాసాల్లోకి నెట్టి జ్ఞాన శూన్యం చేస్తాయి. తాత్విక జిజ్ఞాస నుండి కర్మకాండల్లోకి నెడతాయి. ఇవి పితృస్వామిక భావజాలంతో నడుస్తున్నాయి. ఇవి యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. యువతను లైబ్రరీలకు, పరిశోధనలకు, రచనలకు, సృజనానికి, కళాసృష్టికి వెళ్లకుండా నిరోధిస్తున్నాయి. అందుకే, భారతదేశంలో నూతన సామాజిక తాత్విక విప్లవం నేటి అవసరం.

భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో భారతీయ భౌతిక తత్వ శాస్త్రాన్ని బోధించకపోవడం వలన భారతీయ తాత్విక మూలాలు విద్యార్థులకు, ఆధునిక మేధావులకు అందడంలేదు. అసలు నిజానికి భారతీయ మొదటి తత్వశాస్త్ర భాగాలుగా చార్వాకం, జైనం, బౌద్ధం, సాంఖ్యం ప్రసిద్ధమైనవిగా చెప్పబడినవి. సర్వదర్శన సంగ్రహంలో వీటినే తత్వశాస్త్ర మొదటి దర్శనాలుగా ప్రకటించారు. ఈనాడు అన్ని కేంద్ర విశ్వవిద్యాలయాల్లోను, రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లోను తత్వశాస్త్ర విభాగాల్లో చార్వాకాన్ని చెప్పకపోవడం వలన వేదాలే మొదటివి అనుకునే పరిస్థితి వచ్చింది. కాని నిజానికి వేదాలు భారతీయ భౌతికవాదాన్ని పూర్వపక్షంగా వచ్చినవే. భారతదేశం ప్రధానంగా నదీ నాగరికతతో పాటు మాతృస్వామికమైన దేశం. నిప్పు, నీరు, గాలి, నేలను జీవన విధానంగా మలుచుకొన్న దేశం. ఈ మూలాలు విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు తెలియకపోతే వారికి ప్రాకృతిక భౌతిక జ్ఞానం తగ్గుతుంది. ఇప్పుడు ప్రయాగలో జరుగుతున్న కుంభమేళా నదీ నాగరికతను ఎలా విధ్వంసం చేస్తుందో తెలుసుకోలేరు. భారతదేశంలో తత్వ శాస్త్రమంటే ఆధ్యాత్మిక వాదంగా ప్రచారం చేశారు. తత్వశాస్త్రమనగానే ఆత్మ గురించో, పరలోకం గురించో చెప్పేదనే భావన ఏర్పడింది. నిజానికి భౌతికాంశాల నుండి రూపొందిన దాన్నే తత్వ శాస్త్రం అంటారు. భారతదేశంలో అతి ప్రాచీన జాతులు ఈ తాత్వికాంశాల మీద సుదీర్ఘమైన చర్చ చేశారు. శరీరానికి, చైతన్యానికి ఉన్న సంబంధాన్నీ మానవునికీ ప్రకృతికి ఉన్న సంబంధాన్నీ విశ్వ పరిణామాన్ని, మానవ పరిణామాన్నీ భౌతిక దృక్పథంతో వారు వివేచించారు. మానవునికి తన చుట్టూ వున్న ప్రకృతి, సమాజం పట్ల ఉదయించిన అనేక ప్రశ్నలకు వారు భౌతిక దృక్పథంతో సమాధానం వెతికారు. మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పునీ, నీరునీ, గాలినీ, భూమినీ వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. నిప్పుని, నీరునీ, గాలినీ, భూమినీ వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడానికి ముందు, దాని భౌతిక శక్తిని అర్థం చేసుకోక ముందు వడివడిగా ముందుకు నడవలేకపోయాడు. నిప్పు మానవ సామాజిక పరిణామంలో కీలక పాత్ర వహించింది. నిప్పుని ఆరాధించిన జాతుల కంటే, నిప్పుని భౌతిక శక్తిగా గుర్తించిన జాతులు శక్తివంతంగా ముందుకు నడిచాయి. నిప్పు మానవ జీవితాన్ని ఒక భౌతిక శక్తిగా ప్రభావితం చేసింది. భారతదేశంలో చార్వాకులు నిప్పుకి 'భౌతిక శాస్త్రతత్వాన్ని' రూపొందించారు. నిప్పునారాధించే జాతులకీ, నిప్పుని అధీనం చేసుకొన్న జాతులకీ భారతదేశంలో సమరం జరిగింది. తన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని సమన్వయించుకోవడంలో విఫలమైనవారు భావవాదులుగా రూపొందారు. వీరు భౌతిక సామాజిక వాస్తవికతకు భిన్నమైన భావవాదంతో భౌతికవాదులకెదురు నిలుస్తూ వచ్చారు. నిప్పుని పదార్థంగా కనుగొన్న చార్వాకుల వారసులు భారతీయ ఆదిమ జాతుల వారే. అడవులు తగులబెట్టి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల పరిణామం నుండి వ్యవసాయ సంస్కృతిని రూపొందించి నిప్పుని భౌతిక శక్తిగా వాడుకున్నారు.

వేదాలు భారత దేశానికి వలస వచ్చిన రాజకీయ తెగలైన ఆర్యులు రూపొందించుకున్న భావజాలం. ఈ వేదాలు క్రీ॥పూ॥ 2000–750 సంవత్సరాల మధ్యలో రచించబడినాయని వింటర్‌నిట్జ్ పేర్కొన్నాడు. కీత్ క్రీ॥పూ॥ 1200–350 సంవత్సరాల మధ్యలోవని తెలిపాడు. సాధారణంగా వేద రచన క్రీ.పూ 1400 ప్రాంతంలో ప్రారంభమై క్రీ॥పూ 600 వరకు జరిగిందని చరిత్రకారులు భావిస్తున్నారు. వేద శబ్దమునకు "జ్ఞానమ"ని అర్థం ఇవ్వబడింది. జైమిని అభిప్రాయం ప్రకారం వేదాలు రెండు భాగాలు. 1. మంత్రాలు 2. బ్రాహ్మణాలు. మంత్రాల సంకలనాన్ని సంహితలని అంటారు. ఋగ్వేదానికీ, యజుర్వేదానికీ, సామ వేదానికీ, అధర్వణ వేదానికీ, సంహితలున్నాయి. ఇవి ఒకరి నోటి నుండి ఒకరు కంఠస్థం చేశారు. అందుకే వీటిని శృతులు అన్నారు. వేదాలను సంహితులుగానే కాక బ్రాహ్మణాలుగా, అరణ్యకాలుగా కూడా విభజించారు. నాలుగు వేదాల్లో అతి పురాతనమైంది ఋగ్వేదం. ఋగ్వేద మంత్ర కర్తలలో విశ్వామిత్రుడు, వశిష్టుడు, భరద్వాజుడు, గౌతముడు ముఖ్యులు. వీరు క్రీ॥పూ 1500 ప్రాంతం వారీగా గుర్తింపబడ్డారు. ఋగ్వేదం క్రీ॥పూ 1520 ప్రాంతం నుండి క్రీ॥పూ 1420 దాకా వివిధ ఋషుల చేత రాయబడుతూనే ఉంది. ఋగ్వేదంలో అగ్ని, వరుణుడు, సూర్యుడు, ఇంద్రుడు మొదలైన దేవతలను కొనియాడారు. నిజానికి చార్వాక వాదం, జైనవాదం, బౌద్ధవాదం, సాంఖ్య తత్వశాస్త్రం బోధించబడితే విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు భారతదేశంలో తాత్విక మూలాలు అర్థం అవుతాయి. దానివల్ల దేశంలో వైజ్ఞానిక, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానం పెరుగుతుంది. అయితే బిజెపి, ఆర్‌యస్‌యస్, విశ్వహిందూ పరిషత్‌ల భావజాలాలు చొప్పించాలని చూస్తున్నారు. ఇది దేశానికి మంచిది కాదు. భారత దేశం ఒక మతానికి సంబంధించినది కాదు. ఒక వర్ణాధిపత్యానికి లోబడదు. ఇది లౌకికవాద భావజాలంతో కూడినది. భారతదేశ భౌగోళిక పరిస్థితుల నుంచి అనేక ఉపఖండాల నుండి మన దేశానికి వలస వచ్చిన పాలకులు భిన్న మతాలను తీసుకు వచ్చారు. వైదికం, ఇస్లాం, క్రైస్తవం బయట నుండి వచ్చినవే. చార్వాకం, బౌద్ధం, జైనం, సాంఖ్యం దేశీయంగా పుట్టిన తత్వాలు, ధర్మాలు. అవి ఆ తరువాత మతాలుగా పిలువబడ్డాయి. అందుకే ఈనాడు భారతీయ తాత్విక బోధన ద్వారా విద్యార్థులను, పరిశోధకులను, రాజకీయవేత్తలను ప్రభావితం చేయాలంటే భారతీయ భౌతికవాద చింతన తప్పక జరగాలి.

నీటిని కల్మషం చేసే కుంభమేళాలు భారతదేశ సంస్కృతి కాదు. ఇవి వ్యవసాయ సంస్కృతికి, పారిశ్రామిక విధానాలకు వ్యతిరిక్తమైనవి. మనిషిని మూఢ విశ్వాసాల్లోకి నెట్టి జ్ఞాన శూన్యం చేస్తాయి. తాత్విక జిజ్ఞాస నుండి కర్మకాండల్లోకి నెడతాయి. ఇవి పితృస్వామిక భావజాలంతో నడుస్తున్నాయి. ఇవి యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. యువతను లైబ్రరీలకు, పరిశోధనలకు, రచనలకు, సృజనానికి, కళాసృష్టికి వెళ్లకుండా నిరోధిస్తున్నాయి. అందుకే, భారతదేశంలో నూతన సామాజిక తాత్విక విప్లవం నేటి అవసరం. ఆ దిశగా పయనిద్దాం.

/ వ్యాసకర్త సెల్ : 9849741695 /

నివాళి

విజికె అంటే..



విజికె అంటే మూడు అక్షరాలే కాదు
మూర్తీభవించిన నిబద్ధతకు రూపాలు
జోహారు జోహారు వీజీకే
జోహారు కామ్రేడా! 'వీజీకే'

పరిచయమైతే అతడొక పరిమళం
సిరిమల్లెకు సరితూగే చిరునవ్వొక ఆభరణం
ఆలోచన, అవగాహన, అందమైన సంభాషణ
చెరగవు ఆ జ్ఞాపకాలు– వెలిగే నక్షత్రాలు
'వీజీకే'

సామాజిక బంధాలలో సమతా సౌగంధాలు
నింపాలని పదే పదే పరితపించినారు
సనాతనం ముసుగులోని పురాతనం భావాలను
వ్యతిరేకించిన తీరు అనుసరణం ఎవరికైన
'వీజీకే'

ఆకాంక్షల సాధనలో మనసుకు అలసట లేదు
సైద్ధాంతిక గమనంలో అడుగులు తడబడలేదు
ఉద్యమ కార్యాచరణకు నియమబద్ధ జీవితం
ఆదర్శంగా మిగిల్చి అమరత్వం పొందినారు
'వీజీకే'

- నల్లి ధర్మారావు

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com



బాలకృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన సతీమణి

రాయలసీమతో ప్రత్యేక అనుబంధం

- డాకు మహారాజ్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ

ప్రజాశక్తి -అనంతపురం

రాయలసీమతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సినిమా హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అనంతపురం నగరంలో బుధవారం సాయంత్రం జరిగిన డాకు మహారాజ్ సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి సినిమాను ఛాలెంజ్‌గా తీసుకుని చేస్తానని తెలిపారు. రాయలసీమ ప్రాంతమంటే సాధారణమైంది కాదని.. 'రాయల్ సీమ' అని పేర్కొన్నారు. ఈ ప్రాంత ఇతివృత్తంగా తీసిన తన సినిమాలు గతంలోనూ ఘన విజయాలు సాధించాయని గుర్తు చేశారు. ఇప్పుడు వచ్చిన డాకు మహారాజ్ అటువంటిదేనని తెలిపారు. ఈ సినిమా విజయవంతం చేయడంలో కృషి చేసిన సినిమా నటులకు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నటీమణులు ప్రజ్ఞా జైస్వాల్, శ్రద్ధ శ్రీనాథ్, దర్శకుడు బాబీ, సంగీత దర్శకుడు తమన్‌తోపాటు సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. వీరితోపాటు ఎంపిలు అంబికా లక్ష్మీ నారాయణ, బి కె పార్థసారథి, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర, మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు గేసు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో
దళితులకు విద్యుత్ షాక్!

- బిల్లులు కట్టలేదని సరఫరా నిలిపివేత
- రోడ్డుపై ధర్నా చేసిన మహిళలు

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇలాకాలో దళితులకు విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ బిల్లులు కట్టలేదన్న సాకుతో అధికారులు దళితుల ఇళ్లకు కరెంటు సరఫరా నిలిపివేశారు. దీంతో, పట్టణంలోని బంగారమ్మపేటలో దళిత వాడలో నివసిస్తున్న కుటుంబాలు అంధకారంలో ఉన్నాయి. మంగళవారం పార్వతీపురం నుంచి వచ్చిన ఇఆర్‌ఒ అధికారులు దళిత కాలనీలో విద్యుత్తు బిల్లులు చెల్లించని వారి ఇళ్లకు ఫీజులు తొలగించారు. దళితులు, గిరిజనులు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకోవచ్చని ప్రభుత్వం ఒకవైపు చెపుతూనే దళితుల ఇళ్లకు బిల్లులు పంపిణీ చేస్తున్నారు. దీంతో, వారు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ విద్యుత్ బిల్లుల గురించి అడగలేదని, ఇప్పుడు ఎలా అడుగుతున్నారని వారు ప్రశ్నించారు. బుధవారం ఉదయం దళిత మహిళలు దండిగాం రహదారిపై ధర్నా చేశారు. తామంతా రెక్కాడితేగానీ డొక్కాడని బడుగులమని, తమకు ఎలాంటి ఉపాధి అవకాశాలూ లేవని వాపోయారు. నెలనెలా ప్రభుత్వ నిబంధనలకు లోబడే విద్యుత్ వినియోగిస్తున్నామని, అలాంటప్పుడు బిల్లులు ఎందుకు పంపిణీ చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ధర్నా చేస్తున్న దళిత మహిళలు

రెండు బల్బులు, ఒక ఫ్యాన్‌కు రూ.5 వేలపైన బిల్లు



ఇంట్లో రెండు బల్బులు, ఒక ఫ్యాన్ వాడుతున్నాను. రూ.5,731 బిల్లు కట్టాలని బెదిరిస్తున్నారు. కట్టకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకోవచ్చనని ప్రభుత్వం చెబుతోంది. మరి బిల్లులు ఎందుకు పంపిణీ చేస్తున్నారు. ఇటీవలే నా మెదడుకు శస్త్ర చికిత్స జరిగింది.

\- ముగడ సుశీలమ్మ, దళిత కాలనీ, బంగారమ్మపేట

బల్బు, ఫ్యాన్‌కే రూ.4 వేలు



నా ఇంట్లో ఒక బల్బు, ఒక ఫ్యాన్ మాత్రమే ఉన్నాయి. నాలుగు వేల రూపాయలు బిల్లు చెల్లించాలంటూ నా ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉచిత విద్యుత్ అని ఒకవైపు చెపుతూనే దళితుల ఇళ్లకు విద్యుత్ బిల్లులు ఎందుకు వసూలు చేస్తున్నారు?

\- చింతల అప్పమ్మ, బంగారమ్మపేట

నా దృష్టికి రాలేదు

బంగారమ్మపేట దళితవాడలో విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా సరఫరా నిలిపివేసినట్లు నా దృష్టికి రాలేదు. స్పెషల్ టీం సభ్యులు బకాయిల వసూళ్లపై డ్రైవ్ నిర్వహించారు.

\- రంగారావు, ఎడిఇ, సాలూరు

ఒంగోలులో ఎయిర్‌పోర్టు

- ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి
- భూములను పరిశీలించిన కేంద్ర విమానయాన సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా వాసులకు కలగా మిగిలిన ఎయిర్‌పోర్టు ఏర్పాటు త్వరలోనే జరుగుతుందని ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఒంగోలు సమీపంలోని ఆలూరు - గాదెపాలెం - ఆలూరు మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సేకరించిన భూముల్లో కేంద్ర విమానయాన సంస్థ ప్రతినిధులు ఎస్.ఎస్.మూర్తి, పరేష్ తివారి, అమన్, అరుణ్‌కుమార్, షాజ్ అబుల్, నబీల్ రోషన్ పర్యటించారు. ఎయిర్ పోర్టు కోసం సేకరించిన 550 ఎకరాలకు సంబంధించిన మ్యాపులు, భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఒంగోలులో ఎయిర్‌పోర్టుతో అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఒంగోలులో ఎయిర్ పోర్టు ఏర్పాటుపై 2006 నుంచి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అప్పట్లో వాన్‌పిక్ సంస్థ ఎయిర్ పోర్టుకు కొన్ని భూములు సేకరించిందని, వివిధ కారణాలతో ఆ ప్రయత్నాలు సఫలం కాలేదన్నారు. గత మూడు నెలలుగా ఎయిర్ పోర్టు భూముల విషయమై కసరత్తు చేశామని తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ.. ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఒంగోలు ఎంతో అనువైన ప్రదేశమని తెలిపారు. ఇక్కడ ఎయిర్ పోర్టు కోసం భూములు సేకరించి ఉంచామన్నారు. జిల్లాలో ఎయిర్ పోర్టు వస్తే గ్రానైట్, ఆక్వా, పొగాకు రంగాలకు చెందిన వ్యాపారాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని వివరించారు. రామాయపట్నం పోర్టు నుంచి సరుకులను ఎయిర్‌పోర్ట్ ద్వారా రవాణా చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మి ప్రసన్న, కొత్తపట్నం తహశీల్దార్ పి.మధుసూదనరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మ్యాపును పరిశీలిస్తున్న కేంద్ర విమానయాన సంస్థ అధికారులు, ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

'సీమ'లోనే యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలి

- ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలోనే ఏర్పాటు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 85, సబ్‌సెక్షన్ (1), (2) ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల్లోపు కేంద్ర ప్రభుత్వం గోదావరి నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తెలంగాణాలో, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దురదృష్టవశాత్తు 10 సంవత్సరాల 7 నెలలు అయినప్పటికీ కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రాంతీయ పార్టీలైనా టిడిపి, వైసిపి చేతగాని తనం ఇందుకు కారణమన్నారు. ఈ బోర్డుకు విస్తృత అధికారాలు ఉంటాయన్నారు.

కోళ్లపై వైరస్ పంజా..!

ప్రజాశక్తి - తణుకు రూరల్ : పౌల్ట్రీ పరిశ్రమ రైతులు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా అంతుచిక్కని వైరస్ ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తణుకు పరిధిలోని ఓ కోళ్ల ఫారంలో ఒకే రోజు వంద కోళ్లు మృత్యువాత పడటం దీనికి నిదర్శనం. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 370 కోళ్ల ఫారాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 2.50 కోట్ల వరకు లేయర్ కోళ్లు ఉండగా గత కొద్దిరోజులుగా రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడటం గమనార్హం. తొలుత ఈ వైరస్ నాటు కోళ్లకు పాకింది. దీంతో నాటు కోళ్లు సైతం మృత్యువాత పడ్డాయి. ఈ ప్రభావం సంక్రాంతి కోడిపందేల్లో కూడా కనిపించింది. నాటు కోళ్లు లేక చాలా చోట్ల బరులు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రస్తుతం ఈ వైరస్ లేయర్ కోళ్లకు సైతం విస్తరించింది. సాధారణంగా గుడ్ల కోసం పెంచే లేయర్ కోళ్ల విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. కోడి గుడ్డు పెట్టే సమయం వరకూ దానికి రూ.300 ఖర్చు అవుతుంది. 18వ వారం నుంచి గుడ్డు పెట్టడం మొదలు పెట్టి 100 వారాల వరకూ గుడ్డు ఉత్పత్తి చేస్తుంది. గుడ్డు ఉత్పత్తి కోసం రైతుకు గుడ్డు నిమిత్తం రూ.4.60 పైసలు ఖర్చవుతుంది. గుడ్ల ఉత్పత్తిలో ఏపీలో ఉభయగోదావరి జిల్లాలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్, ఒరిస్సా వంటి రాష్ట్రాలు ఇక్కడ నుంచి గుడ్లు ఎగుమతి చేసుకుంటున్నాయి. ప్రస్తుతం వైరస్ ప్రభావంతో రైతులు కోళ్లకు సంబంధించిన మందులు, మేతల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. ఆదివేళల్లో కోళ్ల వైరస్ బారిన పడకుండా ముందస్తుగా తరచూ వ్యాక్సిన్లు వేస్తుంటారు. గుడ్డు ధర కూడా ఆశాజనకంగా ఉన్నా తగిన ఆహారాన్ని సరఫరా చేస్తున్నారు. అయితే ఉన్నట్టుండి ప్రస్తుతం కోళ్ల మృత్యువాత పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆయుర్వేద వైద్యశాలను సందర్శించిన హంగేరి, స్వీడన్ వాసులు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా :

ఆయుర్వేద వైద్యం పట్ల తమకు పూర్తి నమ్మకం కలిగిందని హంగేరి దేశానికి చెందిన మౌనిక, స్వీడన్‌కు చెందిన అనన్య పేర్కొన్నారు. మండలంలోని నిమ్మలగూడెంలో ఉన్న జమాల్ ఖాన్ ఆయుర్వేద వైద్యశాలకు బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాక్ పెయిన్ ఇతర సమస్యలకు కొరియర్ ద్వారా తెప్పించుకొని వాడామని, రోగం నయం అవడంతో మళ్లీ బుధవారం రాజమండ్రి నుండి తమకు తెలిసిన తెలుగువారితో వైద్యశాలకు విచ్చేశామని చెప్పారు.


ఎఒబిలో పోలీసుల అప్రమత్తత

- భారీ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బ
- ప్రతీకార చర్యకు దిగుతారని
- ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం
- కేంద్ర బలగాలతో ముమ్మరంగా గాలింపు

ప్రజాశక్తి-సీలేరు

చతీస్‌ఘడ్ సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత రామచంద్రారెడ్డి అలియాస్ చలపతితో పాటు 26 మంది మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. గట్టి ఎదురు దెబ్బలు తిన్న మవోయిస్టులు భారీ విధ్వంసాలకు పాల్పడతారని, పోలీసుల లక్ష్యంగా గ్రానైట్లు, డిటైనేటర్లతో మావోయిస్టులు దాడులకు తెగబడతారనిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో ఎఒబిలో పోలీసులు హై అలర్ట్ అయ్యారు. వందల సంఖ్యలో కేంద్ర పోలీసు బలగాలను రంగాల్లో దింపి అణువణువు గాలింపు చర్యలు చేపడుతున్నారు. చత్తీస్‌ఘడ్, ఒడిశా, తెలంగాణా, ఎపి సరిహద్దుల్లో మావోయిస్టు కదిలికులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి సరిహద్దు అటవీ ప్రాంతాన్ని బుధవారం జల్లెడ పట్టారు. సరిహద్దు అవుట్ పోస్టులకు భద్రత పెంచారు.

నెల రోజుల్లో సుమారు 40 మంది మావోయిస్టులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడంతో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలిందని చెప్పక తప్పదు. 2024లో సుమారు 100 మందికి పైగా మావోయిస్టులను హతమార్చిన పోలీసులు 2025లో నెలరోజులు వ్యవధిలో మరో 40 మందిని పోలీసులు హతమార్చి పైచేయి సాధించారు. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో తీవ్రత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మావోయిస్టు హిట్ లిస్టులో ఉన్న పోలీస్ స్టేషన్‌లకు సిఆర్‌పిఎఫ్ స్పెషల్ పార్టీ బలగాలతో భద్రత కట్టు దిట్టం చేశారు. మావోయిస్టు సానుభూతిపరులు కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి 1998లో ఈస్ట్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఉండేవారు. మల్కనగిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి బలిమెల రిజర్వాయర్‌లో 2008లో లాంచ్‌పై ప్రయాణిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలపై దాడి చేసి 38 మందిని హతమార్చిన ఘటనలో చలపతి కీలకపాత్ర పోషించారు. మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ వినీల కృష్ణ కిడ్నాప్ వ్యవహారంలోనూ కీలక సూత్రధారిగా ఉన్నారు.



ఎఒబి సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006


ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

భారీ లోటు తప్పదా?

- డిసెంబర్ వరకు 185శాతం ఆదాయ లోటు
- మూడు త్రైమాసికాల లెక్కలు తేల్చిన కాగ్



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తొలి మూడు త్రైమాసికాల ఆర్థిక లెక్కలను కాగ్ (కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్) వెల్లడించింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ లోటు తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు ఏకంగా 185 శాతం ఆదాయ లోటు నమోదుకావడం గమనార్హం. ఇక ద్రవ్యలోటు పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉన్నట్లు తేలింది. ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచిపోయి చివరి త్రైమాసికం మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో తాజాగా ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగానే కనిపిస్తోంది. సొంత ఆదాయం తగ్గుముఖం పట్టడం, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో కోతలు, వ్యయం పెరిగిపోవడం వంటివి ఇబ్బందికరంగా ఉన్నట్లు తేలింది. ప్రధానంగా ఆదాయ లోటు సమస్యగా మారింది. బడ్జెట్‌లో కేవలం 34,743 కోట్లు లోటుగా ఉంటుందని అంచనా వేయగా తొలి తొమ్మిది నెలలకే ఈ లోటు 185 శాతంతో 64,444 కోట్లకు చేరిపోయింది. ద్రవ్య లోటు కూడా 68,763 కోట్లుగా అంచనా వేయగా, ఇప్పటికే 107 శాతంతో 73,636 కోట్లకు చేరిపోయింది. వచ్చే మూడు నెలలకు ఈ లోటు మరింత పెరిగే అవకాశాలున్నాయని అంటున్నారు.

పడిపోయిన ఆదాయం

ఆదాయం కూడా అంచనాలకు భిన్నంగానే కనిపిస్తోంది. సంవత్సరం మొత్తానికి 2.01 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు రు. 1.13 లక్షల కోట్లు మాత్రమే చేతికందింది. ఇందులో సొంత పన్నుల ఆదాయం రు. 1.60 లక్షల కోట్లకుగాను కేవలం 98 వేల కోట్లవరకు మాత్రమే వచ్చింది. సొంత పన్నుల ఆదాయానికి సంబంధించి జిఎస్‌టి ద్వారా రు. 52 వేల కోట్ల వరకు రావాల్సి ఉండగా, రు.35 వేల కోట్లు, రిజిస్ట్రేషన్ల ద్వారా 13,500 కోట్లు రావాల్సి ఉండగా, 6,388 కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా 24,500 కోట్లకుగాను 12,813 కోట్లు మాత్రమే ఖజానాకు చేరాయి.

కేంద్ర నిధులకు గండి

ఇక కేంద్రం నుండి రావాల్సిన నిధులకు గండి పడింది. పలు పథకాలకు కేంద్రం నుండి గ్రాంట్ల రూపంలో 30,333 కోట్లు వస్తాయని అంచనా వేయగా అందులో డిసెంబర్ వరకు కేవలం రు.11,420 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయి. అంటే ఇప్పటికే దాదాపుగా 19 వేల కోట్లు తక్కువగా వచ్చినట్లు తేలింది. అలాగే కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 35 వేల కోట్ల వరకు రావాల్సి ఉండగా, 24 వేల కోట్లవరకు మాత్రమే ఖజానాకు చేరాయి. ఇలా అన్ని కోణాల్లో ఆదాయం తగ్గుముఖం పట్టడంతో ఆ లోటును భర్తీ చేసేందుకు రుణాలపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. బడ్జెట్‌లో 68,372 కోట్ల వరకు రుణాలు తీసుకునేందుకు ప్రతిపాదించగా, తొలి తొమ్మిది నెలల్లోనే ఏకంగా 74 వేల కోట్ల వరకు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది.

ఇది తాజా ఆర్థిక పరిస్థితి వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	బడ్జెట్‌లో	ఇప్పటివరకు
మొత్తం ఆదాయం	2,69,546	1,86,970
పన్నుల ద్వారా	1,60,263	98,033
కేంద్ర గ్రాంట్లు	30,334	11,420
పన్నుల్లో వాటా	35,395	24,617
రుణాలు	68,372	73,892
మొత్తం వ్యయం	2,68,629	1,86,418
రెవెన్యూ వ్యయం	2,35,917	1,77,523
పెట్టుబడి వ్యయం	32,713	8,895

కాంట్రాక్టు కార్మికులకు శాఖాపరంగా జీతాలు

- మంత్రి గొట్టిపాటితో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్ట్ కార్మికులకు శాఖాపరంగా జీతాలు అందించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం కోరింది. పలు సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆ సంఘం నేతలు బుధవారం సచివాలయంలో కలిశారు. సచివాలయాల పరిధిలో ఉన్న 7,400 మంది గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌లను విద్యుత్‌శాఖలో విలీనం చేయాలని కోరారు. పని ఒత్తిడిని అధిగమించే విధంగా ఉద్యోగులకు విధులు కేటాయింపు చేయాలని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల నిధులను గత ప్రభుత్వం ఎపి బేవరేజెస్ కార్పొరేషన్‌కు రూ.25 వేలకోట్లు చెల్లించిందని, వీటిని తిరిగి సంస్థలో జమ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి వారికి హామీ ఇచ్చారు. విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పర్వతనేని సాంబశివరావు, ఎం శ్రీరామ్మూర్తి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అధిక లోడ్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ రుసుములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆక్వా రైతులు కామిరెడ్డి ఈశ్వరరావు, డివివిఎస్ చౌదరితోపాటు పలువురు మంత్రిని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పరుగు పోటీలో ఊపిరి వదిలాడు

- తీవ్ర అస్వస్థతకు గురైన కానిస్టేబుల్ అభ్యర్థి

ప్రజాశక్తి-దత్తిరాజేరు/విజయనగరంకోట



పరుగు పోటీల్లో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థి బుధవారం ప్రాణాలు విడిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోమటిపల్లికి చెందిన బొడుపల్లి రవి కుమార్ (22) డిగ్రీ చదువుకున్నారు. స్టయిఫండరీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక రాతపరీక్షలో ఉత్తీర్ణుడైయ్యారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య (పిఇటి) పరీక్షకు మంగళవారం హాజరయ్యారు. 1600 మీటర్ల పరుగు పోటీలో పరుగెడుతూ.. అస్వస్థతతకు గురై ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అక్కడే ఉన్న అదనపు ఎస్‌పి పి సౌమ్యలత, వైద్య సిబ్బంది 108 వాహనంలో మహారాజా సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అభ్యర్థి ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో నగరంలోని తిరుమల- మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు ఎస్‌పి వకుల్ విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి రవికుమార్‌ను తీసుకెళ్లారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున రవికుమార్ మృతి చెందారు.

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఖాళీల భర్తీ

- చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి రేఖారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద రాష్ట్రంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, టెక్స్‌టైల్ డిజైనర్స్‌గా పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి రేఖారాణి తెలిపారు. అర్హత, అనుభవం, వయసు, నివాసం తదితర అంశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, టెక్స్‌టైల్ డిజైనర్స్ విభాగాల్లో ఒక్కో విభాగంలో 5 ఖాళీల చొప్పున మొత్తం 10 పోస్టులను భర్తీ చేస్తామని వివరించారు. ఎగ్జిక్యూటివ్స్‌గా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు హ్యాండ్లూమ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిగ్రీ లేదా డిప్లమో కలిగి ఉండాలని, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నిఫ్ట్, ఎన్ఐడి లేదా ప్రఖ్యాత సంస్థ నుంచి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. చేనేత విభాగంలో టెక్స్‌టైల్ డిజైనర్‌గా కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ఈ పోస్టుల నియామకం తాత్కాలికమేనని వెల్లడించారు. క్లస్టర్ మార్గదర్శకాలు handlooms.nic.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

పిఎం సూర్యఘర్‌పై అవగాహన : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధాన మంత్రి కుసుమ్ పథకాలపై రాష్ట్రస్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ మొదటి సమావేశం సిఎస్ అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో నివాస గృహాలు సొంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసి బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఏజెన్సీలు ఏర్పాటు చేశారని తెలిపారు. డిస్కమ్‌లు తమ పరిధిలో రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, నడిమూరు గ్రామం, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లె గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నూరుశాతం సోలరైజేషన్‌కు ప్రభుత్వం ప్రతి పాదించిందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాల్లో ఐదు గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా పైలెట్ ప్రాజెక్టు కింద తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయిం చిందని తెలిపారు. గృహాలతో పాటు వివిధ ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కళాశాలలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుదుత్పత్తి చేసి బిల్లులు పొదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సంబంధిత శాఖల సమన్వయంతో తగిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పిఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో 20,17,000 వ్యవసాయ విద్యుత్ పుంపు సెట్లు ఉండగా, కేంద్ర ప్రభుత్వం 3 లక్షల సోలార్ పంపుసెట్లకు అనుమతి ఇచ్చిందని వివరించారు. పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ పథకాల అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను తొలుత జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు వివరించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, ఇపిసిపిడిసిఎల్, సిపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, ఎకెవి భాస్కర్, కె సంతోషరావు, సోలార్ కార్పొరేషన్ ఎమ్‌డి కమలాకర్‌బాబు, ఇంధనశాఖ సంయుక్త కార్యదర్శి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యాశాఖ కార్యదర్శి కె శశిధర్, సెర్ప్ సిఇఒ వి కరుణ్, గృహ నిర్మాణశాఖ ఎమ్‌డి రాజబాబు వర్చువల్‌గా పాల్గొన్నారు.

రన్నింగ్ అలవెన్స్ రేట్లను 25 శాతం పెంచాలి

- ఎఐఎల్ఆర్ఎస్ఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిఎ పెంపుతోపాటు రన్నింగ్ అలవెన్స్ రేట్లను 25 శాతం పెంచాలని, ఎఐఎల్ఆర్ఎస్ఎ, ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఎఐఎల్ఆర్ఎస్ఎ సెంట్రల్ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం విజయవాడ రైల్వే క్రూ బుకింగ్ లాబీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎల్ఆర్ఎస్ఎ విజయవాడ డివిజన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ మాట్లాడుతూ.. ఏడవ వేతన సంఘం సిఫార్సు ప్రకారం డిఎ 50 శాతం పెరిగినప్పుడు టిఎతో సహ అనేక అలవెన్స్‌లు 25 శాతం పెంచబడ్డాయని, రన్నింగ్ సిబ్బంది తమ డ్యూటీ నిమిత్తం ప్రధాన కార్యాలయం నుంచి 8 కిలోమీటర్ల పైబడి బయటకు వెళ్తే వారి టిఎ కిలోమీటరు అలవెన్స్ ద్వారా చెల్లించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎల్ఆర్ఎస్ఎ డివిజనల్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశన్, బిఎల్‌రావు, వి హేమనాథ్ రెడ్డి, కెవి రావు, శంకర్ పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం

- ఐదుగురిని విశాఖకు తీసుకొచ్చిన సిపి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లి మోసపోయిన ఐదుగురిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ సహకారంతో విశాఖపట్నం తీసుకొచ్చినట్లు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. షార్జాకు ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ మోసపోయిన ఉత్తరాంధ్ర యువకుడు నగర పోలీస్ కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించడంతో అప్రమత్తమైన పోలీసులు ఐదుగురు బాధితులను కేంద్ర విదేశాంగ శాఖ సహకారంతో విశాఖ తీసుకువచ్చారు. వారికి బుధవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాకు చెందిన పోలుపర్తి లక్ష్మీనారాయణ (21), గార రాజేష్ (21) పైల రామస్వామి (21), శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళ్ల వెంకట్రావు(25), విశాఖపట్నం జిల్లాకు చెందిన గెద్దాడ లోకేష్ (24) సంవత్సరం క్రితం గాజువాక శ్రీనగర్ ప్రాంతంలో ఉన్న విశాఖ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లో వెల్డింగ్ పనులు చేయడంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. 2024 అక్టోబర్ నెలలో దుర్గారావు అలియాస్ ప్రసాద్, చందు ఏజెంట్ల ద్వారా మణికంట వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ ఆటోనగర్ నుంచి దుబాయ్‌లోని షార్జా ప్రాంతంలో క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో పనిచేయడానికి ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత 2024 నవంబర్ 12న దుబాయ్ వెళ్లి షార్జాలో ఆ కంపెనీలో చేర్పించారని వివరించారు. అయితే ఏజెంట్లు ఆఫర్ చేసిన విధంగా వారికి ఉద్యోగం ఇవ్వకుండా వారిని బంధించడంతో విశాఖపట్నం జిల్లాకు చెందిన లోకేష్ తనను సంప్రదించాడని సిపి వివరించారు. వెంటనే తాను ఇమిగ్రేషన్ అధికారులతో చర్చించి వారికి విమాన టికెట్లు ఏర్పాటుచేసి బుధవారం దుబాయ్ నుంచి విశాఖపట్నం సురక్షితంగా తీసుకొచ్చినట్లు తెలిపారు.

లారీ డ్రైవర్‌పై పోలీసుల జులుం

- రికార్డులు చూపించే లోపే చితకబాదిన సిఐ
- బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

లారీ డ్రైవర్ పై పోలీసు జులుం ప్రదర్శించారు. రికార్డులు చూపించే లోపే లాఠీలకు పని చెప్పి చితకబాదాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లి రూరల్ మండల పరిధిలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎంఎస్ నాసిర్ హుస్సేన్ కదిరికి చెందిన ఓ షాపులో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీలో ప్లైవుడ్‌కు ఉపయోగించే ముడి సరుకును తమిళనాడుకు తరలిస్తుండగా రాత్రి విధుల్లో ఉన్న తాలూకా సిఐ కళా వెంకటరమణ స్థానిక బైపాస్ రోడ్‌లో లారీని ఆపి రికార్డులు తనిఖీ చేశారు. డ్రైవర్ రికార్డులు చూపిస్తుండగానే ఫైన్ కట్టాలన్నారు. తనకు ఆ విషయం తెలియదని ఓనర్ కు ఫోన్ చేసి మాట్లాడుతానని ఫోన్ చేయడంతో తనకే ఎదురు చెప్తావా అంటూ లారీ డ్రైవర్ నాసిర్ హుస్సేన్ పై విచక్షణ రక్తంగా దాడి చేసి చితకబాదాడు. దీంతో బాధితుడు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న చేస్తున్న సమయంలో బాధితున్ని విచారించగా విషయం విలువలోకి వచ్చింది. ఎమ్మెల్యే వెంటనే డిఎస్‌పి కొండయ్యానాయుడు కు సమాచారాన్ని అందించారు. అనంతరం మదనపల్లె లారీ అసోసియేషన్ సభ్యులు సిఐపై చర్యలు తీసుకోవాలంటూ డిఎస్‌పి కార్యాలయం ఎదుట బైఠాయించారు. డిఎస్‌పి జోక్యం చేసుకుని మరోసారి ఇలా జరగకుండా చూస్తామని, సిఐతో క్షమాపణ చెప్పించడంతో సమస్య సద్దు మణిగింది.

అరకులో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కృషి

- ఎంపి తనుజారాణి -అరకువ్యాలీలో పాస్ పోర్ట్ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- అరకులోయ

పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అరకు ఎంపీ గుమ్మ తనుజరాణి అన్నారు. అరకులోయ పోస్ట్ ఆఫీస్ సముదాయంలో బుధవారం పాస్ పోర్ట్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అరకులోయ దిన దినం అభివృద్ధి చెందుతుందని, గతంలో మామూలు రోడ్డు ఉండేదని ఇప్పుడు హైవే రోడ్డు వచ్చిందన్నారు. అలాగే డబల్ రైల్వే ట్రాక్ వచ్చిందని ఆమె అన్నారు. పాస్ పోర్ట్ కోసం సుదూర ప్రాంతమైన విశాఖపట్నంకి వెళ్లే వారమని, ఇప్పుడు అరకులోనే అందుబాటులోకి పాస్ పోర్ట్ కేంద్రం రావడం హర్షణీయమన్నారు. అరకులోయకు దేశ విదేశాల పర్యాటకులు ఇక్కడికి సందర్శిస్తున్న దృష్ట్యా భవిష్యత్తులో అరకులోయలో ఎయిర్ పోర్ట్ కూడా అవసరం ఉందని, ఇందుకు ఎంపీగా తాను తన వంతు కృషి చేస్తానన్నారు. పాస్ పోర్ట్ సేవ కేంద్రాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, గతంలో పాస్ పోర్ట్ పొందడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లి అనేక అవస్థలు పడేవారని, ఇప్పుడు మన ముంగిట రావడం ఆనందదాయక మన్నారు. రీజనల్ పాస్పోర్ట్ అధికారి కె.ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ, అరకులో రోజుకు 40 స్లాట్ బుకింగ్ కు అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో స్లాట్ బుకింగ్ పెంచుకునే అవకాశం కూడా ఉందన్నారు. పాస్ పోర్ట్ పొందడానికి ఏజెంట్లను ఆశ్రయించవద్దని ఆయన కోరారు. అరకు సేవా కేంద్రంలో సులభతరంగా పాస్ పోర్ట్ పొందవచ్చు అన్నారు. విశాఖపట్నం పోస్ట్ మాస్టర్ జనరల్ విన్నం ఉపేంద్ర మాట్లాడుతూ, అరకులో పాస్ పోర్ట్ సేవ కేంద్రం ఏర్పాటు చేయడం అపూర్వమైన ఘట్టమన్నారు. పాస్ పోర్ట్ జాయింట్ సెక్రటరీ కేజే శ్రీనివాస్ మాట్లాడుతూ, అరుకు ప్రాంత ప్రజలు పాస్పోర్ట్ సేవా కేంద్రం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం పలువురికి పాస్ పోర్ట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, అనకాపల్లి పోస్టల్ ఎస్పీ నాగేశ్వరరెడ్డి, పాస్పోర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి. డి.సాగర్, తహసిల్దారు ఎం. వి.వి.ప్రసాద్, అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, పోస్టల్ ఐపివోలు లక్ష్మి కిషోర్, ఉపేందర్, ప్రముఖ వ్యాపారవేత మయూరి రాజారావు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు కోసం

27 నుంచి రాయలసీమ వ్యాప్తంగా ధర్నాలు : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్న డిమాండ్‌తో సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి రాయలసీమ వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం అనంతపురం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, వి.రామిరెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, మదనపల్లి జిల్లాలకు హంద్రీనీవా ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వల్సుందన్నారు. 2012 నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీరు వస్తున్నా ఒక్క ఎకరం ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మొదటి దశ కింద అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి పంట కాలువలు తవ్వలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి ఆశించినంతగా జరగడం లేదన్నారు. పంట కాలువల కోసం భూసేకరణ కూడా పూర్తి అయిందన్నారు. హంద్రీనీవా నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు రావడానికి కాలువ వెడల్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 3450 క్యూసెక్కుల నుంచి 6300 క్యూసెక్కుల నీరును విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిందన్నారు. ప్రస్తుతం కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ వేయడానికి 404, 405 జీవోలను విడుదల చేసిందన్నారు. రూ.930 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా ఇది సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. కాలువ లైనింగ్ పనుల వలన భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. ఇదే భావనను రైతు సంఘాలు జలసాధన కమిటీ ఇతర రాజకీయ పార్టీలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయడం, పంట కాలవలను తవ్వడం కార్యక్రమాలను తక్షణం చేయాలని కోరుతూ రాయలసీమ జిల్లాలలో ఈ నెల 27న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27 న అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతులు, ప్రజలు, మేధావులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

పౌరులను వేధించవద్దు

- చట్ట పరిధిలో పని చేయాలి
- ఇడికి బాంబే హైకోర్టు ఆదేశాలు

ముంబయి : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి కేంద్ర ఏజెన్సీలు పౌరులను వేధించటం ఆపాలని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. చట్టపరిధిలో పని చేయాలని ఆదేశించింది. తగిన ఆధారాలు లేకుండా ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిపై మనీలాండరింగ్ దర్యాప్తును ఇడి ప్రారంభించటాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. ఇందుకు ఇడికి రూ.1 లక్ష పెనాల్టీని విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ మిలింద్ జాధవ్ ఆదేశాలు జారీ చేశారు. "ఇడి వంటి చట్టాన్ని అమలుపర్చే ఏజెన్సీలకు ఒక బలమైన సందేశాన్ని పంపటం కోసమే ఈ అసాధారణ ఖర్చులు(పెనాల్టీ) విధించాల్సి వచ్చింది. సదరు ఏజెన్సీలు చట్టం పరిమితులకు అనుగుణంగా వ్యవహరించాలి. చట్టాన్ని వాటి చేతుల్లోకి తీసుకోవద్దు. పౌరులను వేదించొద్దు" అని జస్టిస్ మిలింద్ జాదవ్ అన్నారు. అయితే, ఇడి అప్పీలు కోసం ఈ కేసులో హైకోర్టు తన తీర్పును నాలుగు వారాలపాటు నిలుపుదల చేసింది.



వైట్‌హౌస్ వెబ్‌సైట్‌లో రాజ్యాంగం తొలగింపు

వాషింగ్టన్ : డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే వైట్‌హౌస్ వెబ్‌సైట్‌లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అమెరికా రాజ్యాంగ పేజీని తొలగించడం అందులో గుర్తించదగ్గ పరిణామంగా వుంది. ఆ పేజీలో ప్రస్తుతం '404 ఎర్రర్' అని చూపిస్తోంది. ఈ మార్పుకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుండి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రాథమిక పత్రాలపై ట్రంప్ ప్రభుత్వ వైఖరి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హోమ్ పేజీలో ప్రస్తుతం ట్రంప్ ఫోటో, అమెరికా ఈజ్ బ్యాక్ అనే సందేశం కనిపిస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న చర్యలు, జారీ చేసిన ఆదేశాలు వివరాలు, అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతలు ఆ వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నాయి. కానీ రాజ్యాంగం పేజీ కనబడకపోవడం ప్రజల దృష్టిని బాగా ఆకర్షిస్తోంది. అయితే ఇతర అనేక పేజీలు కూడా ఇదే ఎర్రర్‌ను చూపిస్తున్నాయి. పైగా స్పానిష్ భాషలో వున్న అధికార వైట్‌హౌస్ వెబ్‌సైట్‌ను ట్రంప్ ప్రభుత్వం తొలగించింది. అయితే వైట్‌హౌస్ వెబ్‌సైట్‌ను ఎడిటింగ్ సహా ఇతరత్రా మార్పులు చేపడుతున్నామని, ఈ క్రమంలో కొంత ఇబ్బందులు ఎదురవచ్చని త్వరలోనే మొత్తం రీ లోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ కార్యదర్శి హారిసన్ ఫీల్డ్స్ చెప్పారు.

జన్మతః పౌరసత్వం రద్దు

(మొదటి పేజీ తరువాయి)

వుండే చట్టబద్ధమైన ఇమ్మిగ్రెంట్లకు కూడా తిప్పలు తప్పవని అన్నారు. ట్రంప్ ఏం చేసినా దానితో నిమిత్తం లేకుండా జన్మత: పౌరసత్వం అనేది ఈ దేశ చట్టంగా వుండాలి, దాని కోసం పోరాడతామని మరో కాంగ్రెస్ సభ్యుడు శ్రీ థానేదార్ వ్యాఖ్యానించారు. ఈ చర్యను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రమీలా జయపాల్ అభివర్ణించారు. ఒక్క కలం పోటుతో పౌరసత్వాన్ని లాగేసుకోలేరని అన్నారు. దీన్ని గనక చట్టబద్ధం చేసినట్లైతే మన దేశ చట్టాలు, రాజ్యాంగంలో పొందుపరిచిన సంప్రదాయాలను అపహాస్యం చేసినట్లవుతుందని వ్యాఖ్యానించారు. న్యాయపరంగా ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు ఎదురవకపోతే, 30రోజుల్లోగా ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి.

22 రాష్ట్రాల దావా

ట్రంప్ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ డెమొక్రటిక్ పార్టీ పాలనలో వున్న 22 రాష్ట్రాలకు చెందిన అటార్నీ జనరల్స్ రెండు ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో మంగళవారం దావా వేశారు. తక్షణమే ఆ ఆదేశాలను నిలుపు చేయాలని కోరారు. 18 రాష్ట్రాలు, రెండు నగరాలైన శాన్‌ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్ మసాచుసెట్స్‌లోని ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లోవ్యాజ్యం దాఖలు చేయగా, మరోనాలుగు రాష్ట్రాలు వాషింగ్టన్ వెస్టర్న్ డిస్ట్రిక్ట్‌లో రెండో వ్యాజ్యాన్ని వేశాయి. రాజ్యాంగంలోని 14వ సవరణ కింద జన్మత: పౌరసత్వం అనేది ఆటోమేటిక్‌గా వస్తుందని, అధ్యక్షుడు గానీ కాంగ్రెస్ గానీ దాన్ని సవరించలేరని పిటిషనర్లు వాదించారు. తక్షణమే దీన్ని నిలుపుచేస్తూ ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాల్సిందిగా కోరారు.

పిఎం ఇ-బస్ పేరుతో

కార్పొరేట్ల గుప్పెట్లోకి రవాణా వ్యవస్థ?

- ఆర్‌టిసికి గుదిబండగా మారనున్న విద్యుత్ బస్సులు
- ప్రయాణికులపై అధిక భారం !

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా రవాణా వ్యవస్థను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే గత డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం పిఎం ఇ-బస్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ముఖ్య ఉద్దేశం ఆర్‌టిసిని ప్రైవేటీకరణ చేయడమేనని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పథకం అమలులో భాగంగా విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ యాజమాన్యాలను, కార్పొరేట్లను ఆర్‌టిసిలోకి చొప్పించేందుకు పథక రచన చేస్తున్నట్లు సమాచారం. కేంద్ర నిర్ణయాలకు అనుకూలంగా 2029 నాటికి 100 శాతం ఆర్‌టిసి బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబరు 88ని 11.12.24న విడుదల చేసింది. తొలి విడతగా రాష్ట్రంలోని 11 ప్రధాన నగరాల్లో 750 విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలని డిప్యూటీ సిఎంఇ, డిపిటిఒలకు 11.12.24న లెటర్ ఇచ్చినట్లు కార్మిక సంఘాలు



ఆరోపిస్తున్నాయి. విద్యుత్ బస్సుల కొనుగోలు వైపు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఎపిఎస్‌ఆర్‌టిసిలో 11,216 బస్సులు ఉండగా, 2,751 అద్దె బస్సులు ఉన్నాయి. అందులో 100 విద్యుత్ బస్సులు ఉన్నాయి. విద్యుత్ బస్సుల్లో ఒక్క ఆర్‌టిసి ఉద్యోగి కూడా పనిచేయడం లేదు. ప్రస్తుతం ఇలా కొనసాగుతుంటే రానున్న రోజుల్లో 750 విద్యుత్ బస్సులు వస్తే, ఆర్‌టిసిలో 3,700 వరకు ఆర్‌టిసి ఉద్యోగులు, డ్రైవర్లు, మెకానిక్‌లు, కండక్టర్లకు ఉద్యోగ భద్రత ఉండదని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. 2029 నాటికి అన్నీ ప్రైవేటు విద్యుత్ బస్సులే వస్తే ఆర్‌టిసి ఉద్యోగుల ఉద్యోగాలకు భద్రత ఉండదని, అంతేకాకుండా ప్రయాణ ఛార్జీలు భారం సామాన్యులపై పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి 2019 మధ్యలో ఫేమ్-1, 2 పథకాలను (ఫాస్టర్ అడాప్షన్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ హైబిడ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్) ప్రవేశపెట్టింది. ఇందులో బస్సుల కొనుగోలు, నిర్వహణ, నడపడం ప్రైవేటు వారే చేయాలనే షరతు విధించింది. దీనికి జిసిసి (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు) అని పేరు పెట్టింది. ఈ విధానంలో ఖర్చులు, లాభాలు కలుపుకుని నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఇదే తరహాలో పిఎం ఇ-బస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. నూతన పథకం అమలులో భాగంగా విద్యుత్ బస్సులపై వేలకోట్లు ఖర్చు చేయనుంది. పర్యావరణ హితం కోసం అని పైకి చెబుతున్నప్పటికీ దీని వెనుక కార్పొరేట్లకు సబ్సిడీ అమౌంట్‌ను ఇవ్వాలని చూస్తోందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. తప్పనిసరిగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలనుకుంటే... విద్యుత్ బస్సులకు కేంద్రం ఇచ్చే రాయితీలను ఆర్‌టిసిలకే ఇవ్వాలన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణ నేరుగా ఆర్‌టిసికే కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తోంది. విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్‌టిసి ప్రైవేటీకరణ ఆపాలని పేర్కొంటుంది.

జూట్‌కు ఎంఎస్‌పి : కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముడిజూట్‌కు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఈఎ) 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ముడి జూట్ ఎంఎస్‌పి ఆమోదించింది. 2025-26 సీజన్‌లో రా జూట్ (టిడి-3 గ్రేడ్) ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా నిర్ణయించింది. ఇది మొత్తం దేశపు సగటు ఉత్పత్తి వ్యయం కంటే 66.8 శాతం రాబడిని నిర్ధారిస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ఆమోదించబడిన ముడి జూట్ ఎంఎస్‌పి 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన విధంగా కనీసం 1.5 రెట్లు ఆల్ ఇండియా వెయిటెడ్ సగటు ఉత్పత్తి వ్యయం స్థాయిలో ఎంఎస్‌పిని నిర్ణయించే సూత్రానికి అనుగుణంగా ఉంది.

మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ముడి జూట్ ఎంఎస్‌పి గత మార్కెటింగ్ సీజన్ 2024-25 కంటే క్వింటాల్‌కు రూ.315 పెరిగింది. కేంద్ర ప్రభుత్వం 2014-15లో క్వింటాల్‌కు రూ.2400కి చెందిన ముడి జనపనార ఎంఎస్‌పిని 2025-26లో రూ.5,650కి పెంచింది. క్వింటాల్‌కు రూ. 3,250 (2.35 రెట్లు) పెరిగిందని తెలిపింది. 2014-15 నుండి 2024-25 మధ్య కాలంలో జనపనార సాగు చేసే రైతులకు చెల్లించిన ఎంఎస్‌పి మొత్తం రూ. 1,300 కోట్లు కాగా, 2004-05 నుంచి 2013-14 మధ్య కాలంలో చెల్లించిన మొత్తం రూ. 441 కోట్లని పేర్కొంది. 40 లక్షల వ్యవసాయ కుటుంబాల జీవనోపాధి ప్రత్యక్షంగా, పరోక్షంగా జూట్ పరిశ్రమపై ఆధారపడి ఉంది. దాదాపు 4 లక్షల మంది కార్మికులు జూట్ మిల్లుల్లో ప్రత్యక్ష ఉపాధిని పొందుతున్నారు, జూట్ వ్యాపారం చేస్తున్నారు. గతేడాది 1.70 లక్షల మంది రైతుల నుంచి జనపనారను కొనుగోలు చేశారు. జనపనార రైతులలో 82 శాతం పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా మిగిలిన అస్సాం. బీహార్‌లు జూట్ ఉత్పత్తిలో 9 శాతం వాటా కలిగి ఉన్నారు. జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జెసిఐ) ప్రైస్ సపోర్టు కార్యకలాపాలను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా కొనసాగుతుంది. అటువంటి కార్యకలాపాలలో ఏవైనా నష్టాలు ఉంటే, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీయింబర్స్ చేస్తుంది. మరోవైపు జాతీయ ఆరోగ్య మిషన్ (2021-24) కింద సాధించిన విజయాల గురించి కేంద్ర మంత్రివర్గం వివరించింది. దేశ ప్రజారోగ్య ఫలితాలను మెరుగుపరచడంలో ఒక మైలురాయిగా నిలిచిందని పేర్కొంది.

రిపబ్లిక్ డే పరేట్‌కు 26 శకటాలు ఎంపిక

- ఎపి నుంచి ఏటికొప్పాక శకటం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనవరి 26 రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు ప్రదర్శన జరగనుంది. వీటితో పాటు పది కేంద్ర మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌ల శకటాలు ప్రదర్శన ఉంటుంది. మొత్తం 26 శకటాలు మాత్రమే పరేడ్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించాయి. ఆంధ్రప్రదేశ్ (ఏటికొప్పాక కొయ్య బొమ్మలు), కర్ణాటక, గోవా, ఉత్తరాఖండ్, హర్యానా, జార్ఖండ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, త్రిపుర, పశ్చిమ బెంగాల్, చండీగఢ్, ఢిల్లీ, దాద్రా నగర్ హవేలీ, డామన్- డయ్యూ శకటాలు ప్రదర్శిస్తారు.అలాగే, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ ,గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖచ, మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ,నూతన పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ, సిపిడబ్ల్యుడి శకటాలను ప్రదర్శించనున్నాయి.

నాలుగు ఇయు దేశాలతో భారత్ ఒప్పందం

- 10వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ఉద్యోగాలు
- డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో కేంద్ర మంత్రి ప్రకటన

దావోస్ : నాలుగు దేశాల యురోపియన్ బ్లాక్‌తో భారత్ కుదుర్చుకునే కొత్త వాణిజ్య, ఆర్థిక ప్రాతినిధ్య ఒప్పందం వల్ల భారత్‌లో వంద బిలియన్ల డాలర్ల విలువైన పెట్టుబడులు వస్తాయని, 10లక్షల ఉద్యోగాలు సృష్టించబడతాయని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి బుధవారం తెలిపారు. ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాల్లో భాగంగా ఆయన పలు సమావేశాల్లో పాల్గొన్నారు. నాలుగు యురోపియన్ దేశాలు, భారత్ కుదుర్చుకున్న వాణిజ్య, ఆర్థిక ప్రాతినిధ్య ఒప్పందం వచ్చే ఏడాది నుండి అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్విస్ ప్రభుత్వం త్వరలోనే ఈ ఒప్పందానికి ఆమోద ముద్ర వేయనుందని చెప్పారు. మొదట కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోనే నైపుణ్యాల అభివృద్ధి అంశం వుండడం కీలకమైన సానుకూల



పరిణామమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నాలుగు దేశాలకు చెందిన నైపుణ్యాల అభివృద్ధి సంస్థలు, వాటి సిలబస్‌ను భారత యువతకు కూడా అందించనున్నట్లు తెలిపారు. అలాగే భారత్‌లో నేర్చుకున్న నైపుణ్యాలకు ఈ నాలుగు యురోపియన్ దేశాల్లో కూడా గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఒప్పందం వల్ల వంద బిలియన్ల డాలర్ల పెట్టుబడులు వస్తాయన్నారు. పది లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు దేశంలో వస్తాయన్నారు.

కాలుష్యాన్ని తగ్గించేందుకు పారిశ్రామిక మండళ్ళు నిబద్ధత

ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సదస్సులో మూడో రోజైన బుధవారం పారిశ్రామిక మండళ్ళ పరివర్తనా చొరవలో భాగంగా 16 దేశాలకు చెందిన 33 పారిశ్రామిక మండళ్ళు ఆర్థిక ప్రగతికి, ఉపాధి సృష్టికి, కాలుష్యాల కోతకు నిబద్ధతను ప్రకటించాయి. ఇందులో భారత్‌కు చెందిన ఐదు పారిశ్రామిక మండలులు వున్నాయి. ఒకపక్క ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటూనే మరోపక్క కాలుష్య కారక వాయువులను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ పారిశ్రామిక మండలులు ప్రతిన చేశాయి. ఈ 33 మండలులు తగ్గించగలమని ప్రతిన చేసిన కాలుష్య వాయువులు సౌదీ అరేబియా ఏటా విడుదల చేసే కాలుష్య వాయువులు 832 మిలియన్ల టన్నులకు సమానంగా వున్నాయని డబ్ల్యుఇఎఫ్ బుధవారం ప్రకటించింది.

అణ్వాయుధాలను వీడండి

అణ్వాయుధాల అభివృద్ధి తమ లక్ష్యం కాదని స్పష్టం చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని ఇతర దేశాలతో, అమెరికాతో సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు ఇరాన్ తొలి చర్య తీసుకోవాల్సి వుందని యుఎన్ చీఫ్ గుటెరస్ ఇరాన్‌ను కోరారు. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాల మధ్య సంబంధాలు అన్నింటికంటే ముఖ్యమైన అంశమని ఆయన వ్యాఖ్యానించారు.

పనామా కాలువ.. అమెరికా కానుక కాదు

- జోస్ రౌల్ ములినో

దావోస్: పనామా కాలువ తమదేనంటూ గత కొన్ని రోజులుగా డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. ఈ కాలువను అమెరికా తమకేం బహుమతిగా ఇవ్వలేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ములినో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పనామా కాలువపై ట్రంప్ చెప్పిన ప్రతి మాటను మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఎందుకంటే అదంతా అవాస్తవం. ఆ కాలువ అమెరికా నుంచి మాకు రాయితీగానో.. బహుమతిగానో వచ్చింది కాదు. అది మాది. మాకు మాత్రమే సొంతం" అని తెలిపారు. అలాగే ఈ కాలువ విషయంలో చైనా ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇలాంటి ప్రకటనలతో పనామా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు.

ట్రంప్ ఇటీవల పలు సందర్భాల్లో మాట్లాడుతూ పనామా కాలువ తమదేనని, తప్పకుండా వెనక్కి తీసుకుంటామని చెబుతున్నారు. దీంతో ఇరు దేశాల మధ్య వివాదం రాజుకుంది.

వెస్ట్ బ్యాంక్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్

- జెనిన్ నగరంపై దాడులు
- 9మంది మృతి, 35మందికి గాయాలు

జెరూసలేం : ఒకపక్క గాజాలో కాల్పుల విరమణ అమల్లో వుండగా, మరోపక్క వెస్ట్ బ్యాంక్ నగరమైన జెనిన్‌పై ఇజ్రాయిల్ సైనిక బలగాలు హెలికాప్టర్లతో మంగళవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 9మంది పాలస్తీనియన్లు మరణించారు. 35మంది గాయపడ్డారు. పెద్ద ఎత్తున జరిగిన మిలటరీ ఆపరేషన్ ఇదని ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. పాలస్తీనా గ్రామాలపై దాడి చేసిన ఇజ్రాయిల్ సెటిలర్లపై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ దాడులు చోటు చేసుకున్నాయి. గాజా, లెబనాన్, సిరియా, యెమెన్, జుడియా, సామారియా ఇలా ఎక్కడ ఇరాన్ తన ప్రభావం చూపించినా అక్కడ తాము కచ్చితంగా, కృతనిశ్చయంతో వ్యవహరిస్తామని నెతన్యాహు చెప్పారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ గురించి చెప్పేటపుడు జుడియా, సామారియా అనే పదాలను ఇజ్రాయిల్ ఉపయోగిస్తూ వుంటుంది. గాజాలో కాల్పుల విరమణ ప్రారంభమైన రెండు రోజుల తర్వాత జెనిన్‌పై దాడులు జరిగాయి. సైనికులు, పోలీసులు, ఇంటెలిజెన్స్ సర్వీసులు జెనిన్‌లో తీవ్రవాద నిరోధక ఆపరేషన్‌ను ప్రారంభించాయని మిలటరీ ప్రకటించింది. శరణార్థ శిబిరం,



హమాస్, ఇస్లామిక్ జిహాద్‌లకు చెందిన ప్రధాన కేంద్రంపై తమ పట్టును పునరుద్ధాటించేందుకు వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా భద్రతా బలగాలు వారాల తరబడి ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఆ నేపథ్యంలో మిలటరీ ప్రకటన వెలువడింది. ఇటీవల కాలంలో హమాస్ తన కార్యకలాపాలను వెస్ట్ బ్యాంక్‌లో విస్తరిస్తోంది. ఇజ్రాయిల్‌పై పోరాటాన్ని ఉధృతం చేయాల్సిందిగా మంగళవారం హమాస్ పాలస్తీనియన్లకు పిలుపిచ్చింది. ఆపరేషన్ ప్రారంభం కాగానే, పాలస్తీనా భద్రతా బలగాలు శరణార్ధ శిబిరం నుండి వైదొలిగాయి. పెద్ద ఎత్తున కాల్పుల మోత కూడా వినిపించింది. ఇజ్రాయిల్ జరిపిన ఈ దాడుల్లో 9మంది మరణించారని, 35మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య సేవల విభాగం తెలిపింది.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- యుజిసి ముసాయిదా నిబంధనలను కేంద్రం వెనక్కి తీసుకోవాలి
- కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

తిరువనంతపురం : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజిసి) తీసుకొచ్చిన వివాదాస్పద ముసాయిదా నిబంధనలను కేంద్రం వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ ముసాయిదా నిబంధనలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. యుజిసి ముసాయిదా నిబంధనలను వ్యతిరేకిస్తూ కేరళ రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కేంద్రం చర్యపై అధికార సిపిఎం, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌లు తమ వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. ఇది ఉన్నత విద్యకు సంబంధించి సంఘ్ పరివార్ ఎజెండాలో భాగమని ఆరోపించాయి.

తొలి రాష్ట్రంగా కేరళ

ఈ తీర్మానాన్ని సీఎం విజయన్ సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో యూజీసీ ముసాయిదా నిబంధనలకు వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని ఆమోదించిన రాష్ట్రంగా కేరళ నిలిచింది. సమాఖ్య సూత్రాలు, ప్రజాస్వామ్య వ్యవస్థకు యూజీసీ ముసాయిదా వ్యతిరేకమని సీఎం విజయన్ అన్నారు."వీసీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాన్ని ఇది పూర్తిగా తొలగిస్తుంది. రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించదు" అని తీర్మానంలో పేర్కొన్నారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యావేత్తలు లేవనెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టినట్లు సీఎం తెలిపారు. ముసాయిదా నిబంధనలు ఉన్నత విద్యా రంగాన్ని వాణిజ్యీకరించే చేసే చర్యగా విజయన్ అభివర్ణించారు. ఉన్నత విద్యను మతోన్మాదుల చేతుల్లోకి తీసుకొచ్చే ప్రయత్నంగా ఈ నిబంధనలను చూడొచ్చని తీర్మానంలో వివరించారు.

ఉన్నత విద్యా సంస్థల్లో వైస్-చాన్సలర్ల నియమాకాలకు సంబంధించి రాష్ట్రాల్లో గవర్నర్లకు విస్తృత అధికారాలను కట్టబెడుతూ యూజీసీ ఇటీవల కొత్త నిబంధనలను విడుదల చేసింది. సాధారణంగా ఈ నియామకాలను విద్యావేత్తలతో భర్తీ చేసేవారు. ఈ వివాదాస్పద యుజిసి ముసాయిదా నిబంధనలపై దేశవ్యాప్తంగా పలువురు విద్యావేత్తలతో పాటు వివిధ ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. యుజిసి చర్యను తప్పుబడుతున్నాయి. గవర్నర్ల ద్వారా రాష్ట్రాల్లోని ఉన్నత విద్యాసంస్థలపై కేంద్రం పెత్తనం చెలాయించే అవకాశాలున్నాయంటూ అనమానాలను వ్యక్తం చేస్తున్నాయి.

తొలిసారిగా త్రివిధ దళాల శకటం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రిపబ్లిక్ డే పరేడ్‌లో తొలిసారిగా 'శక్త్ ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్‌తో త్రివిధ దళాల శకటం పాల్గొననుంది. ఈ మేరకు బుధవారం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. జనవరి 26న 76వ రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా ఉమ్మడిత్వం, సమైక్యత స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, త్రివిధ దళాల శకటం కర్తవ్య పథంలో తొలిసారిగా ప్రదర్శించనున్నట్లు తెలిపింది. 'శక్త్ ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్‌తో ఈ శకటం సాయుధ దళాలలో ఉమ్మడిత్వం, సమైక్యత దృక్పథాన్ని ప్రదర్శిస్తుంది, ఇది జాతీయ భద్రత, కార్యాచరణ నైపుణ్యాన్ని నిర్ధారిస్తుంది.

ఈ శకటం త్రివిధ దళాల మధ్య నెట్‌వర్కింగ్, కమ్యూనికేషన్‌ను సులభతరం చేసే జాయింట్ ఆపరేషన్స్ రూమ్‌ను వర్ణిస్తుంది. ఇది స్వదేశీ అర్జున్ మెయిన్ బ్యాటిల్ ట్యాంక్, తేజస్ ఎంకెఐఐ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్, డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ విశాఖపట్నం రిమోట్లీ పైలట్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో భూమి, నీరు, గాలిలో ఆపరేషన్‌ను ప్రదర్శించే యుద్ధభూమి దృశ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇది బహుళ-డొమైన్ ఆపరేషన్లలో త్రి-సేవల సినర్జీని ప్రతిబింబిస్తుంది. రక్షణలో 'ఆత్మనిర్భరత' సాధించాలనే దార్శనికతకు ఈ వేదికలు ఉదాహరణగా నిలుస్తాయి.

గూగుల్ క్లౌడ్ విస్తరణకు ఎపి అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదింపులు జరిపారు. మలేషియాకు చెందిన పెట్రోనాస్ ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మాలిక్యులస్‌కు సంబంధించి భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. 2030 నాటికి ఐదు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి కాకినాడ ప్లాంటులో రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. మూలపేటలోనూ పెట్టుబడుల అంశాన్ని పరిశీలించాలని తౌఫిక్‌ను చంద్రబాబునాయుడు కోరారు. పెప్సికో ఇంటర్నేషనల్ బేవరేజస్ సిఇఒ యూజీన్ విల్లెంసెన్, ఛైర్మన్ స్టీఫెన్ కెహోతో సిఎం చర్చించారు. విశాఖపట్టణాన్ని గ్లోబల్ డెలివరీగా చేసుకుని పెప్సికో హబ్, గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వారిని కోరారు. బహ్రెయిన్ ప్రధాని హమద్ ఆల్ మహ్మీద్, ముంతాలకత్ సిఇఓ అబ్దుల్లా బిన్ ఖలీఫా ఆల్ ఖలీఫాతోనూ సమావేశమయ్యారు. ఎపిలో స్మార్ట్ కంటెయినర్ టెర్మినల్ ఏర్పాటుకు ముందుకు రావాలని డిజి వరల్డ్ సంస్థ ఆసియా, ఆఫ్రికా ఎమ్‌డి రిజ్వాన్ సూమర్‌కు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడ, కృష్ణపట్నం, మూలపేటలో టెర్మినల్స్ ఏర్పాటు చేయాలని, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్‌పైనా పెట్టుబడులు పెట్టాలని కోరారు.

బిల్‌గేట్స్‌తో చర్చలు

మైక్రోసాఫ్ట్ అధినేత, ప్రపంచ ఐటి దిగ్గజం బిల్‌గేట్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ భేటీ అయ్యారు. ఉమ్మడి సిఎంగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లో చేసిన అభివృద్ధిని బిల్‌గేట్స్‌కు వివరించారు. అలాగే ఎపిలోనూ ఐటి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని, ఎఐ యూనివర్శిటీ సలహామండలిలో భాగస్వామ్యం వహించాలని కోరారు. ఎపిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ అండ్ డయాగ్నోస్టిక్స్‌ను ఏర్పాటు చేయడానికి బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ తరుపున రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాలని కోరారు. చంద్రబాబును కలవడం ఆనందంగా ఉందని ప్రతిపాదనలపై త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బిల్‌గేట్స్ హామీనిచ్చారు.

ఎపిలో వరల్డ్ ట్రేడ్ సెంటర్
డబ్ల్యుటిసి గ్లోబల్ హెడ్‌ను కోరిన లోకేష్

వరల్డ్ ట్రేడ్ సెంటర్ అసోసియేషన్ గ్లోబల్ హెడ్ జాన్ డ్రూతో లోకేష్ చర్చలు జరిపారు. విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో వరల్డ్ ట్రేడ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హిటాచీ ఇండియా ఎమ్‌డి భరత్ కౌశల్‌తో చర్చించిన మంత్రి హెచ్‌విడిసి(హైవోల్టేజ్ డైరెక్ట్ కరెంటు) సాంకేతికతకు సహకరించాలని కోరారు. డబ్ల్యుఇఎఫ్ హెల్త్‌కేర్ హెడ్ శ్యామ్ బిషన్, టెమాసెక్ స్ట్రాటజీ హెడ్ రవి లాంబాతో చర్చలు జరిపారు. ఎపిలో మూడు ఎఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీతోనూ మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం విద్యారంగ గవర్నర్లు, డబ్ల్యుఇఎఫ్ సదస్సులోనూ మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఎపిలో మూడు నాలెడ్జి సిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎఐపై జరిగిన మరో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న లోకేష్ విశాఖపట్నంలో ఎన్విడియా సహకారంతో ఎఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కలిసిన ముగ్గురు సిఎంలు

దావోస్‌లో మూడోరోజు చర్చల సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకేచోట కలిశారు. కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు

(మొదటి పేజీ తరువాయి)

పురోహితులు. కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో శర్మ బిఎస్‌సి, నెల్లూరు విఆర్ న్యాయ కళాశాలలో లా చేశారు. 1994లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యాక కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది రామకృష్ణారావు వద్ద జూనియర్‌గా పనిచేశారు. 1998లో సొంతగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. 2007 అక్టోబర్‌లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఉమ్మడి ఎపిలోని పలు జిల్లాల్లో పనిచేశారు. 2017-18లో అనంతపురం, 2020-22లో విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా (పిడిజె) చేశారు. 2022లో హైకోర్టు రిజిస్ట్రార్‌గా చేశారు. 2023 నుంచి ఎపి జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా చేస్తున్నారు.

ప్రకాశం జిల్లాకు చెందిన లక్ష్మణరావు

పద్మావతి, వెంకటేశ్వర్లు దంపతులకు యడవల్లి లక్ష్మణరావు 1975 ఆగస్టు 3న పుట్టారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కనిగిరి స్వస్థలం. ప్రాథమిక విద్య ప్రకాశం జిల్లాలో సాగింది. నెల్లూరు విఆర్ న్యాయ కళాశాలలో లా చేశారు. క్రిమినల్ లా, కంపెనీ లాలో బంగారు పతకాలు సాధించారు. 2000 సంవత్సరంలో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. నాటి ఉమ్మడి ప్రకాశం జిల్లా, నెల్లూరు, కావలిలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. జిల్లా జడ్జి పోస్టులకు నిర్వహించిన పరీక్షలో మొదటి ర్యాంకు సాధించి 2014లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఏలూరులో అదనపు జిల్లా జడ్జిగా, ఉమ్మడి ఎపిలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. నాగార్జున వర్సిటీ నుంచి పిజి పూర్తి చేసి మెరిట్ సర్టిఫికెట్లు రెండు సాధించారు. ఏయూ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. 2021లో హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా నియమితులయ్యారు. ఆ తర్వాత రిజిస్ట్రార్ జనరల్‌గా కొనసాగుతున్నారు.

ప్రభుత్వం ద్వారానే సమగ్రాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

డేటా రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను శాసిస్తుందన్నారు. కాబట్టి ప్రభుత్వమే ఈ డేటా సెంటర్లను నిర్వహిస్తే నియంత్రణ, భద్రత ఉంటుందని చెప్పారు. 2018లోనే డేటా ప్రైవసి చట్టం తీసుకువస్తామన్నా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అడ్డుకుంటున్నట్లు చెప్పారు. మన రాష్ట్రానికి అవసరమైన పెట్టుబడులు పెట్టేవారు ఈ రాష్ట్రంలోనే ఉన్నారని చెప్పారు. వీళ్లంతా విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి ప్రత్యామ్నాయ ప్రణాళికను త్వరలో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలో ప్రవేశపెట్టి చర్చించడం జరుగుతుందన్నారు. ఈ ప్రణాళికలో ప్రజలు, వివిధ వర్గాలు, సంఘాల అభిప్రాయాలు తీసుకునేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రజలను విస్మరిస్తున్నారు : మాజీ మంత్రి వడ్డే

రైతు నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ... ప్రస్తుతం పాలకులు ప్రజల సలహాలు, సూచనలను పూర్తిగా విస్మరిస్తు న్నారని తెలిపారు. కేంద్రం కార్పొరేట్లకు రూ. లక్షల కోట్లు రుణాలుగా ఇచ్చి, పారు బకాయిల పేరిట వాటిని మాఫీ చేసిందని, ఇది చాలక సహకార సంఘాల్లో నిధులను తీసుకుని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తోందని అన్నారు. గడిచిన 35 ఏళ్ల నుంచి ఎంఎస్పి కేవలం 22 శాతం మాత్రమే పెరిగిందన్నారు. కనీస మద్దతు ధర తక్కువగా ఉండటం వల్ల రైతులు ఏటా రూ.3 లక్షల కోట్లు నష్టపోతున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఎంఎస్పి నిర్ణయించాలని కోరారు.

మానవాభివృద్ధి కావాలి: ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ...అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాదని మానవాభివృద్ధి, సమ్మిళిత అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి అని పేర్కొన్నారు. మానవాభివృద్ధి నివేదికల్లో మన దేశం 130వ స్థానానికే పరిమితమవగా, దేశంలో కేరళ 1వ స్థానంలో ఉండగా, మన రాష్ట్రం 12వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో మానవాభివృద్ధికి దోహదపడే విద్య, వైద్యం ఉండాల్సిన స్థాయిలో లేవన్నారు. 25 ప్రభుత్వ వర్సిటీలలో 6 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రాథమిక విద్యలో 50 శాతం, ఇంటర్ విద్యలో 80 శాతం కార్పొరేట్ల పరమైనట్లు చెప్పారు. ప్రైవేటు వర్సిటీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,134 పిహెచ్‌సిలు ఉంటే 400 పిహెచ్‌సిల్లో డాక్టర్ల కొరత ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య, మౌలిక సదుపాయాలు లేక ఇప్పటికీ డోలీల్లో తరలించాల్సి వస్తుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయం ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1980 నుంచి 2010 వరకూ వ్యవసాయ రంగం తిరోగమనంలో ఉంటే, పారిశ్రామిక రంగంలో 1 శాతం మాత్రమే వృద్ధి ఉందన్నారు. సేవా రంగంలో కొంత వృద్ధి నమోదైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 58 శాతం మంది వ్యవసాయ రంగంపై, పారిశ్రామిక రంగంలో 10 శాతం, సేవా రంగంపై 32 శాతం ఆధారపడి ఉన్నారని తెలిపారు. సేవారంగంపై ఆధారపడి సుస్థిరాభివృద్ధి సాధించలేమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందని ఇటీవలే సిఎం చంద్రబాబు చెప్పారని, అటువంటి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం అందించే సహకారం ముఖ్యమన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి వంటివి గత పదేళ్లలో కేంద్రం అమలు చేయకపోవడంతోనే రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉండటానికి కారణమన్నారు. సదస్సులో రైతు నాయకులు భవానీ ప్రసాద్, ఫ్యాప్సి ప్రతినిధి వాసిరెడ్డి మురళీకృష్ణ, విశ్రాంత ఇంజనీర్ పున్నారావు, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.వి ఆంజనేయులు, , విశ్రాంత ప్రిన్సిపల్ లక్ష్మణరావు, జర్నలిస్టులు సత్యనారాయణ, డానీ తదితరులు వారి సూచనలు, సలహాలను అందించారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మీ కోసం

జలుబుతో ఉన్నప్పుడు ఫ్రూట్ సలాడ్ తినాలనిపిస్తే.. అందులో కాస్త ఉప్పు, మిరియాల పొడిని జల్లుకుని తినడం మంచిది.

జీవన సౌరభం

ఉన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకొనే క్రమంలో ఎదురయ్యే సవాళ్లే జీవిత నిర్మాణంలో పునాది రాళ్లు ...

బహిరంగ ప్రసంగం



సీత తెలివితేటలు, పెద్దల పట్ల వినయ విధేయతలు కలిగిన మంచి అమ్మాయి. నాలుగవ తరగతి చదువుతోంది. ఆ అమ్మాయంటే టీచర్లకు, స్నేహితులకు అందరికీ చాలా ఇష్టం. కానీ, ఎవరితోనైనా కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడటానికి చాలా భయపడుతుంది. ఏదైనా తప్పు మాట్లాడతానేమోననే అనుమానంతో వారు ఏది అడిగినా అవును, కాదు అన్నట్లుగా తల ఊపుతుంది. ఈ విషయంలో టీచర్ చాలాసార్లు సీతకి నచ్చజెప్పేవారు. పిరికిగా ఉండకూడదని ధైర్యంగా ఉండాలని చెప్పేవారు. అయినా సీతలో ఎంత మాత్రమూ మార్పు రాలేదు.

ఒకరోజు తరగతి గదిలో టీచర్ ఉపన్యాస పోటీలను ప్రకటించారు. పాల్గొనే పిల్లలందరినీ పేర్లు ఇవ్వమని చెప్పారు. సీత తన పేరు ఇవ్వలేదు. టీచర్ ఆమెను దగ్గరకు పిలిచి 'ఎందుకు పేరు ఇవ్వలేద'ని అడిగారు. 'నాకు అందరి ముందు మాట్లాడాలంటే భయమ'ని చెప్పింది. 'అదంతా తరువాత ముందు పేరు ఇవ్వమ'ని టీచర్ ప్రోత్సహించారు. సీత తప్పనిసరవడంతో పేరిచ్చింది.

టీచర్ ఆ రోజు సాయంత్రం నుండి సీతతో ఉపన్యాస పోటీలకు ఇచ్చిన అంశాన్ని రిహార్సల్ చేయించసాగారు. సీత మొదట చాలా భయపడింది. అప్పుడు టీచర్ 'సీత నీ కళ్ళ ముందు ఎవరూ లేరు, నువ్వొక్కదానివే ఉన్నావనుకుని కళ్ళు మూసుకుని చెప్పు' అని చెప్పారు. సీత అలాగే కళ్ళు మూసుకుని మొదట తడబడుతూ తరువాత చక్కగా చెప్పింది. 'గుడ్ సీతా! ఇలాగే అద్దం ముందు నిలబడి చెప్పు. నీ తప్పులు నీకు తెలుస్తాయి, ఆ తరువాత మీ కుటుంబ సభ్యుల ముందు చెప్పు. వాళ్ళు కూడా నీ తప్పులను సరిచేస్తారు. బాగా ప్రాక్టీసు అయ్యాక నీలో భయం కూడా పోతుంది' అన్నారు టీచర్. అలాగే తు.చ తప్పకుండా సీత అమలుచేసింది. పది రోజుల కృషి తరువాత సీత ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకుంది. టీచర్ పిల్లలందరికీ సీతను ఉదాహరణగా చూపించి చక్కగా మాట్లాడగలిగితే స్పష్టమైన ఉచ్చారణ వస్తుంది, ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతుందని చెప్పారు.

– కె.వి.సుమలత,
94926 56255.

నేను గీసిన బొమ్మ






పి.దినేష్
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ ధూళి మిట్ట
సిద్దిపేట జిల్లా.

బొమ్మ గీయండి

పిల్లలూ, ఈ రోజు ఐస్‌క్రీమ్ బొమ్మ గీయడం నేర్చుకుందాం. కింద ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.



'అబద్ధానికి' రెక్కలు ఇవ్వొద్దు!

సోషల్ మీడియాలో కొందరు అబద్ధాలను వండి వార్చటమే పనిగా పెట్టుకున్నారు. వాళ్లు జరగని దానిని జరిగినట్లూ, జరిగినదానిని జరగనట్లూ తమ అనుచరులను నమ్మిస్తారు. పుకార్లను పుట్టించటమే తమ ధర్మంగా భావిస్తారు. తప్పుడు సమాచారంతో విద్వేషాలను సృష్టించి, కొన్ని పార్టీల మీద, కొందరు వ్యక్తుల మీదా, కొన్ని మతాల మీదా అపోహలు రేకెత్తిస్తారు. ముఖ్యంగా మతతత్వాన్ని పెంచి, మతోన్మాదం ఆధారంగా బతికే పార్టీలకు మద్దతు కూడగట్టే పనిలో ఎంతటి అబద్ధాలకైనా తెగిస్తారు. తమను అనుసరించే వాళ్ల తెలివిని అథఃపాతాళంలోకి తొక్కి, ఉన్మాదంతో ఊగిపోయేలా చేస్తారు. తప్పుడు ప్రచారపు బండారం ఎప్పటికప్పుడు బట్టబయలు అయినా, ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా మరొక అబద్ధం సృష్టిలో నిర్లజ్జగా మునిగిపోతారు. అలాంటి వేదికలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది!

అబద్ధానికి వ్యాప్తి చెందే వేగం ఎక్కువగా ఉంటుంది. దానిని కొందరు కావాలని పుట్టించి, ప్రచారం చేస్తారు కాబట్టి– ప్రణాళికాబద్ధంగా కొద్ది వ్యవధిలోనే అనేక గ్రూపుల్లోకి విస్తరించిపోతుంది. భక్తి, దేశభక్తి, మతం, విశ్వాసం, ఘనమైన గతం, మహత్తు, విచిత్రం, అద్భుతం వంటి ముసుగులు వేసి, ఈ అబద్ధాలను ప్రచారం చేస్తారు. ఏదైనా ఒక సంఘటన జరిగినప్పుడు, దానిపై ప్రజలందరి దృష్టి ఉందనుకున్నప్పుడు – తాము అనుకున్న అబద్ధానికి పురుడు పోస్తారు. ఎక్కడో జరిగిన సంఘటనను ఇక్కడి సందర్భంతో ముడిపెట్టి, చకచకా ఫేక్ ప్రచారం మొదలు పెడతారు. అపోహలు సృష్టిస్తారు. ఇలాంటి ఫొటోలు, వీడియోలు, సమాచారం ఎక్కడ వచ్చినా ... చూసిన వెంటనే నమ్మటం మానేయాలి. ప్రధాన మీడియాలో, టీవీ ఛానెళ్లలో రాని సమాచారం వాట్సాప్ గ్రూపుల్లోనే చక్కర్లు కొడుతుంది అంటే– వెంటనే ఆగి ఆలోచించాలి. అది నిజమా? కాదా? అన్నది నిర్ధారించుకోవాలి. ఏ సమాచారాన్ని అయినా, నిజమో కాదో కొన్ని క్షణాల్లో నిర్ధారించుకునే అవకాశం ఇప్పుడు అందరికీ అందుబాట్లో ఉంది. ఆ ఫొటో లేదా వార్తని గూగుల్‌లో రివర్స్ సెర్చ్ చేస్తే– అది ఎక్కడెక్కడ ఉందో క్షణాల్లో కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. ఆ సమాచారం లేదా ఫొటో 'మూలం' ఏమిటో తెలుస్తుంది. అప్పుడు అది నిజమా? కాదా? అన్నది ఎవరికి వారు నిర్ధారించుకోవొచ్చు. 'కని కల్ల నిజము తెలిసిన మనుజుడేపో నీతిపరుడు మహిలో సుమతీ' అని శతకకారుడు బద్దెన ఆరొందల ఏళ్ల క్రితం హితవు చెప్పాడు. దానిని పాటిస్తే– అబద్ధాలను, అపోహలను పెంచే చెత్తమూకలకు అడ్డుకట్ట వేయొచ్చు.

కొంతమంది అడ్డూ అదుపూ లేకుండా అబద్ధాలను, విద్వేషాలను ప్రచారం చేస్తుంటే–ఎంతోమంది యువతీ యువకులు బాధ్యతగా వాటి బండారాన్ని బయట పెడుతున్నారు. కొన్ని సంస్థలు కూడా ఫ్యాక్ట్ ఏమిటో తేల్చి చెబుతున్నాయి. మీ దృష్టికి వచ్చిన వీడియోలోని, వార్తలోని సమాచారం నమ్మదగిందో, కాదో తెలియాలంటే – అలాంటి సైట్ల ద్వారా కూడా తెలుసుకోవొచ్చు. ఫ్యాక్ట్ చెక్ పేరుతో ఆ వీడియోలోని సమాచారాన్ని సెర్చ్ చేయండి. ఆ ఫొటో, వార్త, వీడియో గురించిన పరిశీలన, నిర్ధారణ అప్పటికే జరిగి ఉండొచ్చు. జరుగుతున్న ప్రచారం ఏమిటి? అసలు ఆ ఫొటో/ వీడియో ఎక్కడివి? పరిశీలన తరువాత తేలిన నిజం ఏమిటి? అన్న సమాచారాన్ని ఫ్యాక్ట్ చెక్ సంస్థలు వివరంగా అందిస్తున్నాయి. వాటిని ఫాలో అవడం ద్వారా నిజానిజాలు తెలుసుకోవొచ్చు.

ఉదాహరణకు ఈ మధ్యకాలంలో విస్తారంగా వైరల్ అయిన కొన్ని వీడియోల గురించి ఫ్యాక్ట్‌చెక్ గ్రూపులు ఏమి చెప్పాయో చూద్దాం.



1. అయ్యప్పమాల వేసుకున్న ఒక విద్యార్థిని స్కూలు నుంచి బలవంతంగా గెంటేసినట్టు, రోడ్డు మీద వెళ్లేవారు చూసి, యాజమాన్యంతో గొడవకు దిగినట్టు, ఆఖరికి యాజమాన్యం ఆ విద్యార్థి కాళ్లకు నమస్కరించి, పాఠశాలలోకి అనుమతించినట్లూ ఒక వీడియో నడుస్తోంది.

ఇది నిజంగా జరగలేదని, హిందూత్వ సంస్థలు కొన్ని కావాలని హైదరాబాద్‌లో పాత్రధారులతో దీనిని సృష్టించి, ప్రచారం చేస్తున్నాయని ఫ్యాక్ట్లీ అనే సంస్థ తన పరిశీలనలో తేల్చింది.

(ఈ వీడియో ప్రభావంతోనే తెలంగాణాలోని ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి మీద దాడి చేసి, అతడి చేత విద్యార్థి కాళ్లు మొక్కించిన సంఘటన జరిగింది.)



2. కుంభమేళాలో సాధువులు కొందరు మంటల్లో కూర్చొని, మంత్రాలు చదువుతున్నారని, వారిని అగ్ని ఏమీ చేయలేకపోతోందని ఒక వీడియో ప్రచారంలో ఉంది.

ఇందులో నిజం లేదని, ఇది 'ది ఫైర్ యోగి' పేరిట 2011లో తంజావూరులో చిత్రీకరించిన డాక్యుమెంటరీ అని పరిశీలనలో తేలింది.



3. తిరుమల దేవస్థానంలో ప్రజా సంబంధాల అధికారిగా పనిచేసిన ముబీనా నిష్కా బేగం అనే మహిళ ఇంటిపై ఐటి అధికారులు దాడి, పెద్ద ఎత్తున నగలు స్వాధీనం చేసుకున్నట్టు ఈ మధ్య ఒక వీడియో వాట్సాప్‌లో హల్‌చల్ చేసింది.

అలాంటి పేరుతో ఎవరూ టిటిడిలో పనిచేయలేదని తిరుపతి తిరుమల దేవస్థానం జనవరి 5వ తేదీన ప్రకటన కూడా జారీ చేసింది. ఫ్యాక్ట్ చెక్‌లో తేలిందేమిటంటే– 2021లో తమిళనాడులో ఒక నగల షాపులో భారీ దొంగతనం జరిగింది. పోలీసులు ఆ నగలను దొంగల నుంచి స్వాధీనం చేసుకొని, విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఈ వీడియోను మతపరమైన వ్యతిరేకత పెంచటానికి, తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీయటానికి దుండగులు ప్రచారానికి వాడుకున్నట్టు పరిశీలనలో వెల్లడైంది.




4. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ లేకుండా పోయిందని, అనేకమంది మహిళలపై అత్యాచారం చేసి, చంపేశారని పెద్ద సంఖ్యలో మృతదేహాలు ఉన్న వీడియో ఆ మధ్య ప్రచారం అయింది.

అలాంటి సంఘటన బంగ్లాదేశ్‌లో జరగలేదని, ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన మహిళల వీడియోను మతం పేరిట రెచ్చగొట్టే ఉద్దేశంతో వైరల్ చేశారని పరిశీలనలో నిర్ధారణ అయింది.


... ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! ఇలాంటి వీడియోలు, వార్తలూ ప్రతిరోజూ సోషల్ మీడియాలో పెద్ద సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా మనువాద భావజాలాన్ని పెంచటానికి, దేశంలో మత సామరస్యాన్ని దెబ్బ తీయటానికి కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తుల ద్వారా ఈ అబద్ధాల సృష్టి జరుగుతోంది. దేశాభిమానం, మతాభిమానం ఉన్న వారిని రెచ్చగొట్టి, తప్పుదోవ పట్టించటానికే ఈ పన్నాగం. ఇలాంటి వీడియోలను, వార్తలను చూసిన వెంటనే ఫార్వార్డు చేయకుండా, అనుకూల వ్యాఖ్యలు చేయకుండా ఉండాలి. మోసగించేవాళ్లు తమను నమ్మేవాళ్లను మాత్రమే మోసగించగలరు. 'మీరు సృష్టించే చెత్తను మేం నమ్మం..' అని రివర్స్ కౌంటర్ చేస్తే, ఫేక్‌న్యూస్ గొంతును మొదట్లోనే ఆపేయవొచ్చు!

– శాంతిమిత్ర



'అఖండ 2' షూటింగ్‌కు ఏర్పాట్లు

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న కొత్త సినిమా 'అఖండ 2'. బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన 'అఖండ'కు సీక్వెల్‌గా 'అఖండ 2' తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు పరిసర ప్రాంతాల్లోని కృష్ణానది వద్ద జరపటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్కడి గుడిమెట్ట గ్రామం వద్ద కృష్ణానది తీరాన్ని బోయపాటి శ్రీను తన బృందంతో కలిసి పరిశీలించారు. అక్కడి వసతులు, షూటింగ్‌కు ఉన్న వనరులను పర్యవేక్షించారు. కృష్ణానదిలో బోటుపై షికారు చేశారు. నదిలో పరిస్థితిని పరిశీలించారు. గుడిమెట్ల గ్రామస్తులతో కూడా కొద్దిసేపు ముచ్చడించారు. అక్కడి వాతావరణ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న 'మహాకుంభమేళా'లో ఈ సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. 14 రీల్స్ పతాకంపై ఆచంట రామ్, గోపినాథ్‌తో కలిసి బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని నిర్మిస్తున్నారు. దసరా కానుకగా సెప్టెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది. తమన్ సంగీతం అందిస్తున్నారు.



'బ్యాడ్ బాయ్ కార్తీక్' టైటిల్ ఖరారు

నటుడు నాగశౌర్య నటిస్తున్న కొత్త సినిమా 'బ్యాడ్ బాయ్ కార్తీక్' టైటిల్‌ను చిత్ర యూనిట్ ఖరారుచేసింది. బుధవారంనాడు ఆయన పుట్టినరోజు కావటంతో ఈ పోస్టర్‌ను విడుదల చేసింది. రామ్ దేసిన దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా విభిన్నమైన కథతో దీనిని తెరకెక్కిస్తున్నారు. శౌర్య యాంగ్రీ లుగ్‌లో కనిపించారు. వైష్ణవి ఫిల్మ్ పతాకంపై ఈ సినిమా నిర్మితమవుతోంది. హరీష్ జయరాజ్ సంగీతం. 'పోలీసు వారి హెచ్చరిక', 'నారీ నారీ నడుమ మురారి' సినిమాల్లో కూడా ఆయన నటిస్తున్నారు.


విమర్శలొచ్చాయని

నా పంథా మార్చుకోను



అనిల్ రావిపూడి

'నా సినిమాల్లో జబర్దస్త్ టైపు స్కిట్స్ ఉంటాయని కొందరు అంటుంటారు. అలా అనే వాళ్లు 10 శాతం ఉంటే 90 శాతం మంది నా సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. గత పదేళ్లుగా కొంతమంది నా సినిమాలను విమర్శిస్తూనే ఉన్నారు. నాకూ అలవాటైపోయింది. అందుకే నా పని చేసుకుంటున్నా. ఆడియన్సే వాళ్లకు సమాధానం చెబుతున్నారు. ఒక వేళ వాళ్లు అన్నదే నిజమైతే సంక్రాంతికి వస్తున్నాం సినిమా వారం రోజుల్లో రూ.200 కోట్లు రాబట్టదు. నేను నా పంథా మార్చుకోను. ఇలాగే సినిమాలు చేస్తాను. నా సినిమాలను ఫ్యామిలీ మొత్తం చూసి ఎంజాయ్ చేస్తున్నారు. ఎలాంటి వల్గారిటీ లేకుండా సినిమాలను చేస్తున్నాను. కామెడీ కోసం బూతు పదాలను వాడట్లేదు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో బుల్లి రాజు చేత కూడా కొంతవరకూ బూతులు తిట్టించాను. అది కూడా ఓ మంచి సందేశం ఇవ్వటం కోసమే. ఓటీటీల్లో సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూసి పిల్లలు ఎలా చెడిపోతున్నారనేది ఈ సినిమాలో చూపించాం.' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈనెల 14న విడుదలైంది. విడుదలైన ఎనిమిదిరోజుల్లోనే రూ.218 కోట్ల గ్రాస్ వసూళ్లను సంపాదించి సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది.



29న ఒటిటిలోకి 'పుష్ప 2'

అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా నటించిన చిత్రం 'పుష్ప 2'. ఈనెలాఖరులో 29 లేదా, 31న ఓటీటీ నెట్‌ఫ్లిక్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచి రూ.1850 కోట్ల గ్రాస్ కలెక్షన్ మార్కును దాటేసింది. బాహుబలి తర్వాత అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాగా నిలిచింది. ఈ మేరకు నిర్మాతలు అధికారికంగా పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సినిమా విడుదలైన 56 రోజుల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుందని మేకర్లు గతంలోనే ప్రకటించారు. నెట్‌ఫ్లిక్స్ రూ.200 కోట్లతో ఇప్పటికే డిజిటల్ హక్కులను కైవసం చేసుకుంది. రీలోడెడ్ వర్షన్ 3.40 గంటల నిడివి ఉంది. ఒటిటిలో ఈ కొత్త వర్షన్‌ను విడుదల చేయనున్నారు. కేవలం 30 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.1800 కోట్లు గ్రాస్ పైగా కనెక్షన్లు దాటేసింది. ఆపై బాహుబలి 2 రికార్డును దాటేసింది. కేవలం హిందీలో రూ.800 కోట్ల నెట్ వసూళ్ళ సాధించిన ఏకైక సినిమా రికార్డు క్రియేట్ చేసింది. బాలీవుడ్ రికార్డును సైతం దాటేసింది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం పుష్ప చిత్రానికి సీక్వెల్‌గా గతేడాది డిసెంబర్ 5న విడుదలైంది. ఈ సినిమాలో ఫాహద్ ఫాజిల్, రావు రమేష్, జగపతిబాబు, సునీల్, అనసూయ, జగదీశ్ నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

రష్మిక కాలు బెణికింది..

టాలీవుడ్ నటి రష్మిక మందన్న స్వల్పంగా గాయపడ్డారు. బుధవారం ఆమె శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వీల్‌చైర్‌లో కనిపించారు. కారులో నుంచి దిగేటప్పుడు ఆమె నడవలేకపోయారు. సిబ్బంది సహాయంతోనే ఆమె వీల్‌ఛైర్‌పై కూర్చున్నారు. ఇటీవల జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా ఆమె కాలు బెణికింది. తను నటించిన 'పుష్ప 2' సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలవటంతో ఆమె సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం విక్కీ కౌశల్ 'ఛావా'తోపాటు సల్మాన్‌ఖాన్ 'సికిందర్', శేఖర్ కమ్ముల 'కుబేర', రాహుల్ రవీంద్రన్ ' ది గర్ల్ ఫ్రెండ్', 'తామా' వంటి చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు.

ఇంగ్లండ్‌పై వరుణాస్త్రం!

- అభిషేక్ శర్మ అర్ధసెంచరీ
- తొలి టి20లో ఏడు వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం



వరుణ్ చక్రవర్తి 4-0-23-3

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో తొలుత టీమిండియా బౌలర్ వరుణ్ చక్రవర్తి స్పిన్ మాయాజాలానికి తోడు.. బ్యాటర్ అభిషేక్ శర్మ ధనా ధన్ బ్యాటింగ్‌తో చెలరేగడంతో ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టి20లో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలుత వరుణ్ చక్రవర్తి(3/23)కి తోడు అర్ష్‌దీప్, హార్దిక్, అక్షర్ రెండేసి వికెట్లతో రాణించడంతో ఇంగ్లండ్ జట్టు 132పరుగులకే ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అభిషేక్ శర్మ(79; 34బంతుల్లో 5ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగా ఆడి మ్యాచ్‌ను 12.5ఓవర్లలోనే ముగించారు.

టాస్ గెలిచిన భారత్.. తొలుత బౌలింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నమ్మకాన్ని ఏ ఒక్క బౌలర్ వమ్ము చేయలేదు. అర్ష్‌దీప్, హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ వికెట్లు చేజిక్కించుకోవడంలో సఫలమయ్యారు. ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్(68) అర్ధసెంచరీ మినహా.. మిగతా ఏ ఒక్క బ్యాటర్‌నూ క్రీజ్‌లో నిలదొక్కుకునే అవకాశం భారత బౌలర్లు ఇవ్వలేదు. తొలి ఓవర్లోనే ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ డౌకౌట్ అయ్యాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో కీపర్ సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ జోస్ బట్లర్ మరో ఓపెనర్ బెన్ డకెట్‌కు జతగా క్రీజులోకి వచ్చాడు. కానీ మూడో ఓవర్ ఐదో బంతికి బెన్ డకెట్(4) కూడా పెవిలియన్‌కు చేరాడు. అర్షదీప్ బౌలింగ్ లోనే రింకూ సింగ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం మరో బౌలర్ వరుణ్ చక్రవర్తి తన విశ్వరూపం చూపించాడు. ఎనిమిదో ఓవర్ మూడో బంతికి హ్యారీ బ్రూక్‌ను, ఐదో బంతికి లియామ్ లివింగ్‌స్టోన్‌ను ఔట్ చేసి పెవిలియన్‌కు పంపాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్, హార్దిక్, అక్షర్‌కు రెండేసి, వరుణ్ చక్రవర్తికి మూడు వికెట్లు దక్కాయి.

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సంజు(26), అభిషేక్(79) ధనా ధన్ బ్యాటింగ్‌తో మెరిసారు. అభిషేక్ శర్మ కేవలం 20 బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్(0) నిరాశపరిచినా.. తిలక్‌వర్మ(19), హార్దిక్(3) మరో వికెట్ కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్‌కు రెండు, రషీద్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తికి లభించగా.. ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో టి20 చెన్నై వేదికగా శనివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)సంజు (బి)అర్ష్‌దీప్ 0, డకెట్ (సి)రింకు సింగ్ (బి)అర్ష్‌దీప్ 4, బట్లర్ (సి)నితీశ్‌రెడ్డి (బి)వరుణ్ చక్రవర్తి 68, బ్రూక్ (బి)వరుణ్ చక్రవర్తి 17, లివింగ్‌స్టోన్ (బి)వరుణ్ చక్రవర్తి 0, బేథెల్ (సి)అభిషేక్ శర్మ (బి)హార్దిక్ పాండ్యా 7, ఓవర్టన్ (సి)నితీశ్‌రెడ్డి (బి)అక్షర్ పటేల్ 2, అట్కిన్సన్ (స్టంప్)సంజు (బి)అక్షర్ 2, ఆర్చర్ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 12, రషీద్ (నాటౌట్) 0, వుడ్ (రనౌట్)సంజు 1, అదనం 11. (20 ఓవర్లలో ఆలౌట్) 132పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/17, 3/65, 4/65, 5/83, 6/95, 7/103, 8/109, 10/132

బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-17-2, హార్దిక్ పాండ్యా 4-0-42-2, వరుణ్ చక్రవర్తి 4-0-23-3, అక్షర్ పటేల్ 4-1-22-2, బిష్ణోయ్ 4-0-22-0


ఇండియా ఇన్నింగ్స్: సంజు (సి)అట్కిన్సన్ (బి) ఆర్చర్ 26, అభిషేక్ శర్మ (సి)బ్రూక్ (బి)రషీద్ 79, సూర్యకుమార్ (సి)సాల్ట్ (బి)ఆర్చర్ 0, తిలక్ వర్మ (నాటౌట్) 19, హార్దిక్ (నాటౌట్) 3, అదనం 6. (12.5ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 133పరుగులు.

వికెట్ల పతనం: 1/41, 2/41, 3/125

బౌలింగ్: ఆర్చర్ 4-0-21-2, అట్కిన్సన్ 2-0-38-0, వుడ్ 2.5-0-25-0, రషీద్ 2-0-27-1, ఓవర్టన్ 1-0-10-0, లివింగ్‌స్టోన్ 1-0-7-0.

సెమీస్‌కు సిన్నర్, షెల్టన్

నేడు మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్ • ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, అమెరికాకు చెందిన 21వ సీడ్ షెల్టన్ సెమీస్‌కు చేరారు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సిన్నర్ 6-3, 6-2, 6-1తో 8వ సీడ్, ఆస్ట్రేలియాకు చెందిన డి-మినర్‌ను వరుససెట్లలో చిత్తుచేశారు. సంచలన విజయాలతో క్వార్టర్స్‌కు చేరిన స్థానిక ఆటగాడు టాప్‌సీడ్ ప్లేయర్‌కు అడ్డుకట్ట వేయలేకపోయాడు. ఇక షెల్టన్ 6-4, 7-5, 4-6, 7-5(7-4)తో ఇటలీకే చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు సొనేగోను ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్, 19వ సీడ్, అమెరికాకు చెందిన మడిసన్ కీస్ ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో స్వియాటెక్ 6-1, 6-2తో అమెరికాకు చెందిన 8వ సీడ్ నవ్వారోను చిత్తుచేయగా.. కీస్ 3-6తో తొలిసెట్‌ను కోల్పోయినా... ఆ తర్వాత రెండుసెట్లను 6-3, 6-4తో ముగించి సెమీస్‌కు చేరింది.

సింగిల్స్ సెమీఫైనల్స్...

23(గురు) : సబలెంక(1) × బడోసా(11) (మ.2.00గం॥లకు)
కీస్(19) × ఇగా స్వియాటెక్(2) (మ.3.10ని.లకు)
24(శుక్ర) : సిన్నర్(1) × షెల్టన్(21) జకోవిచ్(7) × జ్వెరేవ్(2)

ప్రి క్వార్టర్స్‌కు తానీషా-ధృవ్

ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



జకార్తా: ఇండోనేషియా వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్‌లో తానీషా-ధృవ్ కపిల సత్తా చాటారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో వీరు 21-18, 21-14తో ఇండోనేషియాకే చెందిన జామిల్-ములానాను చిత్తుచేశారు. మరో పోటీలో ఆర్ కపూర్-గద్దె జంట 9-21, 13-21తో ఇంగ్లండ్ జంట చేతిలో వరుససెట్లలో ఓటమిపాల య్యారు. మహిళల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. తొలిరౌండ్‌లో పివి సింధు 20-22, 12-21తో న్యాయెల్(వియత్నాం) చేతిలో, అనుపమ ఉపాధ్యాయ 12-21, 5-21తో టంగ్‌జంగ్(ఇండోనేషియా) చేతిలో వరుససెట్లలో ఓటమిపాలయ్యారు. మరో పోటీలో హేమంత్ 14-21, 11-21తో 13వ ర్యాంకర్ ఇంటనాన్ (థాయ్‌లాండ్) చేతిలో, ఆర్.రామ్‌రాజ్ 17-21, 19-21తో మియాజికి(జపాన్) చేతిలో వరుససెట్లలో ఓటమిపాలయ్యారు. ఇక పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రాజ్‌వత్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో నరాకో(జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. హోరాహోరీగా సాగి ఈ మ్యాచ్‌లో ప్రియాన్షు 14-21, 21-13, 18-21తో నరోకా చేతిలో ఓడాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68